RNI Reg-No. 69176/96

# నేటి మనదేశమ్

తెలుగు దినపత్రిక

Published from Hyderabad and Medchal Malkajgiri

CIRCULATED THROUGHOUT TELANGANA STATE

సంపుటి :31 సంచిక : 250 హైదరాబాద్ సంపాదకులు: కె.ఎస్.రంగశాయి: మంగళవారం 14-04-2026 పేజీలు : 12 వెల: 1-00

## తట్టేపల్లి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

స్కూటీని ఢీకొట్టిన లారీ

ప్రమాదంలో దంపతులతో సహా చిన్నారి మృతి




**వికారాబాద్, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** వికారాబాద్ జిల్లాలో తీవ్ర విషాదం నెలకొంది. పెద్దేముల్ మండలం తట్టేపల్లి దగ్గర ఓ టూ వీలర్‌ను లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో భార్యాభర్తలు సహా ఓ చిన్నారి దుర్మరణం చెందింది. మృతులు తాండూరు నుంచి జహీరాబాద్ వైపు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. కాగా, యాక్సిడెంట్ తర్వాత పారిపోయిన లారీ డ్రైవర్.. పెద్దేముల్ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయినట్లు తెలుస్తోంది. పెద్దేముల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

మిగతా 2లో..



# మహిళా రిజర్వేషన్లతో పునర్విభజన లింక్

**హైదరాబాద్, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మహిళారిజర్వేషన్లు, పునర్విభజనను కలపడంతో రాజకీయ కుట్ర ఉందని సిఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. 2026 జనాభా లెక్కల ప్రకారంమహిళారిజర్వేషన్లబిల్లు తీసుకువస్తే కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఇవ్వడంతో పాటు కట్టుబడి ఉంటామని ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. హిళలరాజకీయసాధికారితకు కాంగ్రెస్ మొదటి నుంచి కట్టుబడి ఉంది..నియోజకవర్గాల పునర్వభజనను ప్రధాని మోదీ రాజకీయ పావుగా ప్రమాదకరంగా వాడుకుంటున్నాడని ఆరోపించారు. డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ల అంశాలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం కోసమే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. డీలిమిటేషన్ అనేది రాజకీయ పార్టీలకో, ప్రభుత్వానికో సంబంధించిన అంశం కాదని స్పష్టం

మిగతా 2లో..

- ఇందులో బిజెపి రాజకీయ కుట్ర దాగి ఉంది
- పునర్విభజనను రాజకీయ పావుగా వాడుకుంటున్న మోడీ
- జనాభా లెక్కల అనంతరం మహిళా బిల్లు అని చెప్పారు
- ఆ మేరకే గతంలో బిల్లు పెట్టి..ఇప్పుడీ హడావిడి ఎందుకు?
- జనాభా లెక్కల తరవాత నియోజకవర్గాల పునర్విభజనపై చర్చించాలి
- దక్షిణాదిని దెబ్బతీసే కుట్రలో భాగంగానే ఉత్తరాది సీట్ల పెంపు
- మీడియా సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం

## మహిళా రిజర్వేషన్ బిల్లు 21వ శతాబ్దంలో అతి ముఖ్యమైన నిర్ణయం

ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 13 (ఆర్ఎన్ఎ):** భారత సరికొత్త చరిత్ర లిఖించడానికి అతి చేరువలో ఉందని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. ఈ 21వ శతాబ్దంలో అతి పెద్ద నిర్ణయాల్లో ఒకదానిని భారత్ తీసుకోబోతోందని వెల్లడించారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ను ఉద్దేశించి సోమవారం దిల్లీలో నిర్వహించిన 'నారీ శక్తి వందన్ సమ్మేళన్' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. "భారత ప్రజాస్వామ్యాన్ని మహిళలు మరింత బలోపేతం చేస్తారు. మహిళల రిజర్వేషన్ల బిల్లు అత్యావశ్యకం. సుదీర్ఘ కాలం తర్వాత ఈ బిల్లు వస్తోంది. ప్రతి పార్టీ దీన్ని ముందుకు తీసుకెళ్లాలి. 2029లోగా మహిళా రిజర్వేషన్ బిల్లును

మిగతా 2లో..

## ఓటర్ జాబితాలో కొనసాగేహక్కు ఓటర్‌కు ఉంటుంది

'సర్'పై సుప్రీం వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 13 (ఆర్ఎన్ఎ):** పశ్చిమబెంగాల్‌లో నిర్వహించిన సర్ ప్రక్రియపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఓటర్ జాబితాలో కొనసాగేహక్కు ఓటర్‌కు ఉంటుందని వ్యాఖ్యానించింది. ఎన్నికలు నిర్వహించాలనే ఒత్తిడితో ఆ ప్రక్రియను వక్రీకరించకూడదని హితవు పలికింది. అదే సమయంలో సర్ ప్రక్రియలో ఓట్లు తొలగించారంటూ దాఖలైన పిటిషన్లను విచారించేందుకు మాత్రం నిరాకరించింది. వారి పిటిషన్లు ఇప్పటికే అప్పిలేట్ ట్రైబ్యునళ్ల ముందు విచారణకు ఉన్నాయని వ్యాఖ్యానించింది. సరైన ప్రక్రియ లేకుండా ఎన్నికల సంఘం ఏకపక్షంగా పేర్లను తొలగిస్తోందని, ఈ తొలగింపులపై దాఖలైన పిటిషన్లను సకాలంలో విచారించడం లేదని పిటిషనర్లు ఆరోపించారు. "పిటిషనర్లు ఇప్పటికే ట్రైబ్యునళ్లను ఆశ్రయించడంతో.. ప్రస్తుత అభిప్రాయాలు అర్థంలేనివి" అని సుప్రీం వ్యాఖ్యానించింది. ఈ పిటిషన్లను విచారించేందుకే కలకత్తా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆదేశాల మేరకు 19 ట్రైబ్యునళ్లు

మిగతా 2లో..

## బాంబులు..తూటాలకు ఓట్లతో సమాధానమిస్తారు

కేంద్ర మంత్రి అమిత్ షా



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 13 (ఆర్ఎన్ఎ):** త్వరలో జరగనున్న ఎన్నికల్లో బెంగాల్ ప్రజలు బాంబులు, తూటాలకు ఓట్లతో జవాబు ఇస్తారని కేంద్ర మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. మమత ప్రభుత్వాన్ని అధికారం నుంచి దించేయాలని ప్రజలు నిర్ణయించుకున్నారని.. ఎన్నికల తర్వాత రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేది భాజపానేనని అన్నారు. పోలింగ్ రోజు ఎటువంటి అక్రమాలకు పాల్పడకుండా టీఎంసీ గూండాలు తమ ఇళ్లలోనే ఉండాలని.. లేదంటే ఫలితం వెలువడిన అనంతరం వారిని కటకటాల వెనక్కి పంపుతామని హెచ్చరించారు. బెంగాల్‌లోని రాణిగంజ్ ప్రాంతంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. దేశంలో నక్సలిజాన్ని మోదీ ప్రభుత్వం పూర్తిగా అణచివేసిందని.. ఇప్పుడు చొరబాటుదారులను తరిమికొట్టే సమయం ఆసన్నమైందని అమిత్‌షా అన్నారు. బెంగాల్ సహా దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి చొరబాటుదారులను బయటకు పంపిస్తామన్నారు. గతంలో మమతా బెనర్జీ మద్దతిచ్చిన మన్మోహన్ సింగ్ ప్రభుత్వం ఉగ్రవాదంపై ఎన్నడూ చర్యలు తీసుకోలేదని.. దానికి బదులుగా ఉగ్రవాదులకు

మిగతా 2లో..

## శ్రీపాదరావుకు సిఎం రేవంత్ నివాళి



**హైదరాబాద్, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు 27 వ వర్ధంతి సందర్భంగా జూబ్లీహిల్స్ నివాసంలో ఆయన చిత్రపటం వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులు అర్పించారు. తెలుగు రాష్ట్రాల్లో తనకంటూ ఒక ప్రత్యేకతను చాటుకున్న నాయకుడు దుద్దిళ్ల శ్రీపాదరావు అని ఈ సందర్భంగా సీఎం నివాళి అర్పించారు. సర్పంచ్ స్థాయి నుంచి శాసనసభ స్పీకర్ వరకు అన్ని పదవులకు వన్నె తెచ్చిన నేత అని ఆయన కొనియాడారు. శాసనసభ ఔనత్యాన్ని పెంపొందిస్తు హుందాగా ఆయన సభను నడిపిన తీరు శ్లాఘనీయమని ముఖ్యమంత్రి అన్నారు. దుద్దిళ్ల శ్రీపాదరావు జీవితం నేటి తరానికి ఒక గొప్ప స్ఫూర్తి అని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి,ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ఎంఎల్ ఏ సంజయ్ పాల్గొన్నారు.

## హోర్ముజ్‌పై ట్రంప్ వ్యాఖ్యలు

దిగ్బంధిస్తే తీవ్ర పరిణామాలు... ఘాటుగా హెచ్చరికలు చేసిన ఇరాన్



**టెహ్రాన్, ఏప్రిల్ 13 (ఆర్ఎన్ఎ):** హోర్ముజ్‌ను దిగ్బంధిస్తామన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరిక లపై ఇరాన్ మరోసారి ఘాటుగా స్పందించింది. హోర్ముజ్ ఇప్పటికీ తమ నియంత్రణలోనే ఉందని పేర్కొంది. శత్రువులు ఏ చిన్న పొరపాటు చేసినా ప్రమాదం తప్పదని హెచ్చరించింది. అంతకుముందు ఇరాన్ సైనిక దళం (ఐఆర్‌జీసీ) కూడా ట్రంప్‌కు గట్టి వార్నింగ్ ఇచ్చిన విషయం తెలిసిందే. హోర్ముజ్ వైపు వచ్చే యుద్ధ నౌకలపై దాడి చేస్తామని హెచ్చరించింది. పౌర నౌకల రాకపోకలకు మాత్రం ఎలాంటి ఇబ్బందీ ఉండదని భరోసా ఇచ్చింది. యుద్ధ నౌకలు వస్తే మాత్రం కాల్పుల విరమణను ఉల్లంఘించినట్టేనని స్పష్టం చేసింది. ఇక యూఎస్‌తో చర్చలు విఫలం

మిగతా 2లో..

## తెలంగాణ టెట్ నోటిఫికేషన్ విడుదల



**హైదరాబాద్, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్షకు నోటిఫికేషన్ విడుదలైంది. ఏప్రిల్ 15 నుంచి 30 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ డా.ఈ.నవీన్ నికోలస్ వెల్లడించారు. ఏడాదికి రెండు సార్లు (జూన్, డిసెంబర్) టెట్ నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. దీంతో ఈ ఏడాదిలో ఇది తొలి విడత నోటిఫికేషన్ కానుంది. టెట్ నిర్వహణకు సంబంధించి ఇటీవలే పాఠశాల విద్యాశాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదన పంపగా.. విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా

మిగతా 2లో..

## వికసిత భారత్ లక్ష్య సాధనలో మినరల్స్ కూడా కీలకమే

మినరల్ రంగంలో ఆత్మనిర్భరత భారత్‌పై ప్రత్యేక దృష్టి

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడి



**హైదరాబాద్, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రపంచవ్యాప్తంగా క్రిటికల్ మినరల్స్ ప్రాముఖ్యం పెరుగుతోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. 2047 వికసిత భారత్ లక్ష్యాన్ని సాధించడంలో మినరల్స్ కీలకమని చెప్పుకొచ్చారు. మినరల్ రంగంలో ఆత్మనిర్భరత సాధించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు కిషన్ రెడ్డి తెలిపారు. సోమవారం హెచ్ఐసీపీలో భారత ప్రభుత్వ గనుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 2వ విడత ఎక్స్‌ప్లోరేషన్ లైసెన్స్ వేలం, 7వ విడత క్రిటికల్ / స్ట్రాటజిక్ మినరల్ బ్లాక్స్ వేలం కార్యక్రమానికి కేంద్ర మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. జియోపాలిటిక్స్, క్లైమేట్ మార్పు, ఆర్థిక భద్రతలో ఈ మినరల్స్ కీలక పాత్ర పోషిస్తున్నాయని వివరించారు. ఇప్పటివరకు 46 బ్లాక్స్ వేలం విజయవంతంగా పూర్తి చేశామని కేంద్ర మంత్రి వెల్లడించారు. 7వ విడతలో 19 బ్లాక్స్‌ల వేలం ప్రారంభమైందన్నారు. మినరల్ ఎక్స్‌ప్లోరేషన్ లైసెన్స్ మొదటి విడత ప్రారంభమైందని.. త్వరలోనే 11 బ్లాక్స్‌లకు రెండో విడత లైసెన్స్ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. తెలంగాణలో 2 వెనేడియం, టైటానియం బ్లాక్స్ సిద్ధం చేసినట్లు మంత్రి ప్రకటించారు. మైనింగ్ కార్యకలాపాలను

మిగతా 2లో..

## సమ్మెపై కార్మికులు ఆలోచించాలి

మంత్రి పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తెలంగాణ ఆర్టీసీ కార్మికుల సమ్మెపై మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించారు. రెండు అంశాలపై ప్రభుత్వం కమిటీ వేసిందని తెలిపారు. కమిటీ నుంచి పూర్తి వివరాలు వచ్చిన తర్వాత కార్మికులకు అనుగుణంగా నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఆర్టీసీ విలీనం, యూనియన్ అంశంపై కమిటీ వేసినట్లు తెలిపారు. మిగతా అంశాలు క్లియర్ చేయడానికి తాము సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేశారు. ఆర్టీసీ కార్మికులు ఆలోచించాలని.. తొందర పడవద్దని మంత్రి పొన్నం విజ్ఞప్తి చేశారు. సమ్మెకు సిద్ధమవుతున్న ఆర్టీసీ కార్మికులు.. లేబర్ కమిషనర్‌తో చర్చలు జరపాలని నిర్ణయించారు. లేబర్ కమిషనర్ కార్యాలయం వద్దకు భారీగా ఆర్టీసీ కార్మికులు చేరుకోవాలని జేఏసీ పిలుపునిచ్చింది. చర్చల అనంతరం సమ్మె తేదీ ప్రకటించే అవకాశం ఉంది . ప్రభుత్వం తమ డిమాండ్లపై స్పందించకపోతే ఈనెల 20 నుంచి సమ్మెకు వెళ్లాలని ఆర్టీసీ కార్మికులు యోచిస్తున్నట్లు సమాచారం. మార్చి 13న యాజమాన్యానికి ఆర్టీసీ జేఏసీ సమ్మె నోటీసు ఇచ్చిన విషయం తెలిసిందే.

**మొదటి పేజీ తరువాయిలు**

## మహిళా రిజర్వేషన్ బిల్లు 21వ శతాబ్దంలో అతి ముఖ్యమైన నిర్ణయం

అమలు చేయాలి. ఈ నిర్ణయం మహిళా శక్తి, గౌరవానికి అంకితం. దేశ పార్లమెంట్ ఒక కొత్త చరిత్రను సృష్టించేందుకు దగ్గర్లో ఉంది. సమానత్వంతో కూడిన భారతదేశానికి ఇదొక తీర్మానం. ఇక్కడ సామాజిక న్యాయం నినాదానికే పరిమితం కాదు. అది మన పనిసంస్కృతిలో ఒక భాగం. రాష్ట్ర శాసనసభల నుంచి దేశ పార్లమెంట్ వరకు దశాబ్దాల నిరీక్షణకు తెరదించే సమయం ఆసన్నమైంది. ఆ సమయం ఏప్రిల్ 16, 17, 18" అని మోదీ వెల్లడించారు. "గతంలో ఇళ్లు పురుషుల పేర్ల మీదే ఉండేవి. భూమి, దుకాణం, కారు.. ఇలా ఏది చూసుకున్నా మగవాళ్ల పేరుమీదే ఉండేవి. అదంతా సహజమనే భావన ఉండేది. మేం పీఎం ఆవాస్ యోజన తీసుకువచ్చాం. దానికింద మహిళ పేరు మీదే ఇళ్ల రిజిస్ట్రేషన్‌కు మేం ప్రాధాన్యం ఇచ్చాం" అని అన్నారు. ఇలా మహిళా సాధికారత కోసం తీసుకువచ్చిన పథకాల గురించి ప్రస్తావించారు. తాను కుటుంబ జీవితాన్ని జీవించకపోయినా.. ఆ వ్యవహారాలపై అవగాహన ఉందని ప్రధాని సరదాగా వ్యాఖ్యానించారు.

## బాంబులు..తూటాలకు ఓట్లతో సమాధానమిస్తారు

బిర్యానీతో విందు ఇచ్చిందని ఆరోపించారు. మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం పహల్గాం దాడులకు ప్రతీకారంగా పాక్‌లోని ఉగ్రవాదులను కోలుకోలేని దెబ్బకొట్టిందన్నారు. రాత్రి సమయాల్లో మహిళలు బయట తిరగాల్సిన అవసరం ఏముందని ఒకప్పుడు మమత ప్రశ్నించారని అమిత్ షా పేర్కొన్నారు. అటువంటి మాటలు ఆమె పదవికే సిగ్గుచేటని అన్నారు. అర్ధరాత్రి కూడా మహిళలు ధైర్యంగా తిరిగే వాతావరణాన్ని తాము బెంగాల్‌లో సృష్టిస్తామన్నారు. ఆర్జీకర్ లాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

## ఓటర్ జాబితాలో కొనసాగేహక్కు ఓటర్‌కు ఉంటుంది

ఏర్పాటయ్యాయి. ఇప్పుడు అవి విచారించాల్సిన అప్పీళ్ల సంఖ్య 30 నుంచి 34 లక్షల వరకు ఉందని ఈసీ తరఫు న్యాయవాది కోర్టుకు వెల్లడించారు. ఈ అప్పీళ్లను నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కరిస్తారా..? లేక గడువు పొడిగిస్తూనే ఉంటారా..? అని పిటిషనర్ల తరఫు న్యాయవాది వాదించారు. ఇరుపక్షాల వాదనలు విన్న సుప్రీం స్పందిస్తూ.."ఈ దేశంలో ఓటు హక్కు అనేది రాజ్యాంగపరమైనదే కాదు.. అదొక భావోద్వేగపూరితమైన అంశం కూడా. ఇది ప్రజాస్వామ్యంలో భాగం. ఒక ప్రభుత్వాన్ని ఎంచుకోవడంలో కీలకం. అలాగే కాలపరిమితి నిర్ణయించి, ట్రైబ్యునళ్లపై భారం మోపలేం. అధిక సంఖ్యలో ఓటర్లను తొలగించినా.. ఆ తొలగింపు వల్ల ఎన్నికలు ప్రభావితమైతే తప్ప ఎన్నికను రద్దు చేయలేం. న్యాయపరమైన జోక్యం అనేది ఎన్నికలను ప్రోత్సహించేలా ఉండాలి" అని వ్యాఖ్యానించింది. ఇక బెంగాల్‌లో ఏప్రిల్ 23, 29న రెండు విడతల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే.

## తట్టేపల్లి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండల పరిధిలోని త్తటెపల్లి గ్రామ శివారులో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందారు. వికారాబాద్ జిల్లా రుక్మాపూర్ గ్రామానికి చెందిన పావని (35), ఆమె భర్త కవిరాజ్ (40) జహీరాబాద్‌లో నివసిస్తున్నారు. వీరు ఆదివారం సాయంత్రం జహీరాబాద్ నుంచి రుక్మాపూర్ గ్రామానికి వెళ్లారు. తిరిగి వస్తుండగా లారీ వీరి స్కూటీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పావని, కవిరాజ్, కీర్తన అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. కుమారుడు కార్తీక్ స్వల్ప గాయాలతో ప్రాణాలతో బయటపడ్డాడు. చికిత్స నిమిత్తం తాండూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ మహమ్మద్ షరీఫ్‌పై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దేముల్ పోలీసులు తెలిపారు.

## తెలంగాణ టెట్ నోటిఫికేషన్ విడుదల

అనుమతించడంతో తాజాగా నోటిఫికేషన్ విడుదల చేశారు.

ముఖ్య తేదీలు
- ఏప్రిల్ 15 నుంచి 30 వరకు ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ
- జూన్ 9 నుంచి టెట్ హాల్ టికెట్ల డౌన్‌లోడ్
- జూన్ 15 నుంచి 30 వరకు ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహణ
- జులై 28 నుంచి 31 మధ్య ఫలితాలు

తాజా నోటిఫికేషన్ ప్రకారం.. టెట్ ఆన్‌లైన్ పరీక్షలు జూన్ 15 నుంచి 30వ తేదీ మధ్య ఉదయం 9 నుంచి 11.30 వరకు; అలాగే, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 వరకు జరుగుతాయి. ఏప్రిల్ 15 నుంచి జులై 31 వరకు అన్ని పని దినాల్లో హెల్ప్ డెస్క్ సర్వీసులు అందిస్తుందని అధికారులు తెలిపారు. టెట్ పరీక్షకు దరఖాస్తు రుసుం జనరల్, బీసీ అభ్యర్థులకు ఒక్కో పేపర్ (పేపర్– 1, పేపర్– 2)కి రూ.750 కాగా.. రెండు పేపర్లూ రాయాలనుకుంటే రూ.1000 చెల్లించాల్సి ఉంటుంది. అలాగే, ఎస్సీ/ ఎస్టీ/ పీడబ్ల్యూడీ అభ్యర్థులైతే ఒక్కో పేపర్‌కు రూ.700, రెండు పేపర్లకు అయితే రూ.950 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది.

## వికసిత భారత్ లక్ష్య సాధనలో మినరల్స్ కూడా కీలకమే

వేగవంతం చేయడం కోసం చట్టాల్లో మార్పులు తీసుకొస్తున్నామని చెప్పారు. రాష్ట్రాలు స్వతంత్రంగా వేలం నిర్వహించే అవకాశం కల్పించనున్నట్లు చెప్పారు. పర్యావరణ అనుమతుల ప్రక్రియను సరళీకరించడం, 24 మినరల్స్‌పై కస్టమ్స్ డ్యూటీ రద్దు చేయడం, త్వరగా ఉత్పత్తి ప్రారంభించే కంపెనీలకు ప్రోత్సాహకాలు అందించడం వంటి చర్యలు తీసుకోనున్నట్లు కిషన్ రెడ్డి వివరించారు. స్క్రాప్ నుంచి మినరల్స్ రీసైక్లింగ్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. విదేశాల్లో మైనింగ్ ప్రయత్నాలు చేపట్టామని తెలిపారు. రక్షణ రంగం, ఎలక్ట్రిక్ వెహికల్స్, గ్రీన్ ఎనర్జీకి క్రిటికల్ మినరల్స్ కీలకమని.. ప్రైవేట్ సంస్థలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. భారత్‌ను గ్లోబల్ మైనింగ్ లీడర్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.

# మహిళా రిజర్వేషన్లతో పునర్విభజన

(మొదటి పేజీ తరువాయి)

చేసిన సీఎం రేవంత్, దీనిని మహిళా రిజర్వేషన్లతో కలిపి చూపించడం సరైంది కాదన్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం ఈ రెండు అంశాలను కలిపి వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోందని విమర్శించారు. సోమవారం సాయంత్రం సచివాలయంలో ఆయన మంత్రులు, ఎంపిలు, ఇతర నాయకులతో కలసి మీడియా సమావేశంలో మాట్లాడారు. మహిళా రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా దుష్ప్రచారం జరుగుతోందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. మహిళలకు ఓటుహక్కు, రాజకీయ రిజర్వేషన్లు కల్పించడంలో కాంగ్రెస్ పార్టీ కీలక పాత్ర పోషించిందని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ హయాంలోనే మహిళలు ముఖ్యమైన పదవులు చేపట్టిన విషయాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్ రెండూ వేర్వేరు అంశాలని స్పష్టం చేసిన రేవంత్ రెడ్డి, వీటిని కలిపి బీజేపీ రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తోందని విమర్శించారు. ముఖ్యంగా 2011 జనాభా లెక్కల ఆధారంగా ఈ రెండు అంశాలను అనుసంధానించడం వెనుక రాజకీయ కుట్ర, వివక్ష ఉన్నాయని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు తమ పూర్తి మద్దతు ఉందని ప్రకటించిన సీఎం రేవంత్, ప్రస్తుతం ఉన్న పార్లమెంట్ సీట్ల ఆధారంగానే ఈ బిల్లును అమలు చేయాలని కేంద్రాన్ని కోరారు. 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలోనే ఈ బిల్లును అమలు చేసి ఉంటే, మరింత మంది మహిళలు పార్లమెంట్‌కు ఎన్నికయ్యేవారని రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. రాజ్యాంగంలోనే పురుషులతో పాటు మహిళలకు ఓటు హక్కు ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. అప్పటికిప్రపంచంలోని చాలా దేశాల్లో మహిళలకు ఓటు హక్కు లేదు..

పురుషులతో పాటు మహిళలకు సమాన అవకాశాలు కల్పించింది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని అన్నారు. దేశ ప్రధానిగా, రాష్ట్రపతిగా, లోక్ సభస్పీకర్ గా, ముఖ్యమంత్రులుగా, గవర్నర్లుగా చాలా రాజ్యాంగబద్ధమైన పదవుల్లో మహిళలకు కాంగ్రెస్ అవకాశం కల్పించిందని గుర్తు చేశారు. మహిళలనాయకత్వంలోపనిచేసిన పార్టీ కాంగ్రెస్.. రాజీవ్ గాంధీ స్థానిక సంస్థల్లోమహిళలకురిజర్వేషన్లుతీసుకువచ్చారు. . సోనియా గాంధీ నాయకత్వంలో చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ బిల్లు తీసుకువచ్చారు.. అప్పుడు రాజ్యసభలో ఆమోదించారు..బీజేపీ సహకరించకపోవడం వల్లనే లోక్ సభలోమహిళారిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందలేదన్నారు. ఇంతకాలం ప్రధాని మోదీ ఈ బిల్లును పట్టించుకోలేదు. 2023 లో



మహిళారిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతుఇచ్చింది.. 2026 జనాభాలెక్కల తర్వాతగెజిట్ ఆధారంగా మహిళారిజర్వేషన్లు అమలు చేస్తామని చట్టం చేశారు... 2026జనభా లెక్కలు పూర్తి చేసి అమలు చేయకుండా 2011జనాభాలెక్కల ఆధారంగా చట్టం ముందుకు తెస్తున్నారు.. 2026జనాభా లెక్కలప్రకారం నిబంధనను సవరించుకుంటే 2029 లోక్ సభతో పాటు వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్లు అమలుచేయొచ్చన్నారు. ఇకపోతే 2011 జనాభా లెక్కల ప్రకారం డీలిమిటేషన్ చేయాలని ఎన్డీయే చూస్తోందన్నారు. కానీ, 2026 జనాభా లెక్కల ప్రకారం డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలన్నది కాంగ్రెస్ డిమాండ్ అని చెప్పారు. ఈ రెండింటినీ కలపడం, పాత జనాభా లెక్కల ప్రకారం వెళ్లడంలో కుట్ర ఉందని ఆక్షేపించారు. 33శాతం మహిళా రిజర్వేషన్లకు కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. ఈ రిజర్వేషన్లను ఆర్నెల్లలోనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. డీలిమిటేషన్ పక్రియ చాలా ప్రమాదకర దిశలో వెళ్తోంది. చిన్న రాష్ట్రాలు, దక్షిణాదికి అన్యాయం జరిగేలా మోదీ కుట్ర చేస్తున్నారు. కుటుంబ నియంత్రణను దక్షిణాది రాష్ట్రాలు సమర్థంగా అమలు చేశాయి. ఉత్తరాదిలో అది సరిగ్గా అమలు కాకపోవడం వల్లే జనాభా విపరీతంగా పెరిగింది. జనాభా ప్రాతిపదికన సీట్ల పెంపు వద్దని దక్షిణాది రాష్ట్రాలు గట్టిగా చెప్పాయి. దక్షిణాది రాష్ట్రాల వ్యతిరేకత వల్ల మోదీ కొత్త ప్రతిపాదన తీసుకొచ్చారు. ప్రతి రాష్ట్రంలో 50శాతం సీట్లు పెంచుతామని చెబుతున్నారు. ఇలా చేస్తే.. యూపీ, బిహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో సీట్లు బాగా పెరగనున్నాయి. ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్య లోక్‌సభ సీట్లలో అంతరం భారీగా పెరుగుతుందన్నారు. సీట్ల పెంపు తర్వాత దక్షిణాదిలో 195 లోక్‌సభ స్థానాలు అవుతాయి. ఉత్తరాదిలో సీట్లు 620కి పెరుగుతాయి. ఉత్తర, దక్షిణాది మధ్య ప్రస్తుతం ఉన్న 210 సీట్ల అంతరం 412కి పెరుగుతుంది. ఎన్డీయే ప్రభుత్వంలో దక్షిణాది రాష్ట్రాలకు ఏమాత్రం ప్రాధాన్యం దక్కడం లేదు. కేంద్రంలోని కీలక శాఖలు ఏవీ దక్షిణాది రాష్ట్రాలకు ఇవ్వడం లేదు. సీట్లు పెంచాలనుకుంటే అఖిలపక్షాన్ని పిలిచి మాట్లాడాలి. ఏ ప్రాతిపదికన 50 శాతం సీట్లు పెంచుతారు? సీట్లు 50 శాతం పెంచాలని మోదీకి ఏ దేవుడు చెప్పాడు? 50శాతం సీట్లు పెంచితే ఉత్తరాది, దక్షిణాది మధ్య తీవ్ర అంతరం ఏర్పడుతుంది. దక్షిణాదిపై చూపుతున్న వివక్షతో దేశ సమగ్రతకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు. దక్షిణాది రాష్ట్రాల పట్ల వివక్షను మరింత పెంచేలా భాజపా వ్యవహరిస్తోందన్నారు. దక్షిణాది రాష్ట్రాల పరిస్థితి.. పన్నులు కట్టడం, దిల్లీకి వెళ్లి సలాం కొట్టడం అన్నట్లుగా ఉంది. దీనికి మేం వ్యతిరేకం. దక్షిణాది రాష్ట్రాలు దేశానికి ఫైనాన్షియల్ కేపిటల్స్. ఉత్తరాది రాష్ట్రాలు పొలిటికల్ కేపిటల్స్. పొలిటికల్ కేపిటల్స్ ఎప్పుడూ ఫైనాన్షియల్ కేపిటల్స్‌ని తక్కువగా చూస్తాయి. దక్షిణాది రాష్ట్రాలు ద్వితీయ శ్రేణి పౌరులుగా మిగిలిపోతారని అన్నారు. హైబ్రిడ్ ప్రాతిపదికన సీట్లు పెంచాలనేది మా డిమాండ్. కొత్తగా పెంచే సీట్లలో 50 శాతానికి జీడీపీని ప్రాతిపదికగా తీసుకోవాలి. కొత్తగా పెంచే సీట్లలో 136 సీట్లు జీడీపీ వృద్ధి ఆధారంగా పెంచాలి. మరో 136 సీట్లను జనాభా ప్రాతిపదికగా పెంచాలి. దేశానికి ఆదాయం ఇస్తున్న రాష్ట్రాలను గౌరవించాలి. చిన్న రాష్ట్రాలకు కూడా న్యాయం జరిగేలా గతంలో సీట్ల కేటాయింపు జరిగిందని రేవంత్‌రెడ్డి అన్నారు. మీడియా సమావేశంల మంత్రులు భట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి, సీతక్క, పొంగులేటి, ఎంపిలు రఘురామిరెడ్డి, మల్లు రవి, సలహాదారు కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

# హోర్ముజ్‌పై ట్రంప్ వ్యాఖ్యలు

(మొదటి పేజీ తరువాయి)

కావడంపై ఇరాన్ మంత్రి అరాగ్చీ ఎక్స్ వేదికగా కీలక వ్యాఖ్యలు చేశారు. 47 ఏళ్ల తరువాత జరిగిన అత్యున్నత స్థాయి చర్చలకు తాము సదుద్దేశంతో వెళ్లామని చెప్పారు. ఒప్పందం అంగుళం దూరంలో ఉండగా యూఎస్ తన లక్ష్యాలను, ఉద్దేశాలను మార్చుకుందని ఆరోపించారు. మునుపటి అనుభవాల నుంచి ఎలాంటి గుణపాఠాలను అమెరికా నేర్చుకోలేదని అన్నారు. మంచి భావాలుంటే చివరకు మంచే జరుగుతుందని అన్నారు. మనసులో శత్రుత్వం ఉంటే తుదకు అదే మిగులుతుందని ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. సోమవారం హోర్ముజ్‌లో నౌకల ట్రాఫిక్ స్తంభించిపోయిందని లాయిడ్స్ లిస్ట్ ఇంటెలిజెన్స్ అనే మారిటైమ్ సంస్థ తాజాగా పేర్కొంది. హోర్ముజ్‌ను దిగ్బంధిస్తామన్న ట్రంప్ ప్రకటన తరువాత నౌకల రాకపోకలు నిలిచిపోయాయని పేర్కొంది. ఎలాంటి ఒప్పందం లేకుండా ఇరాన్‌తో చర్చలు ముగియడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి స్పందించారు. గతంలో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం మాత్రం కొనసాగుతోందని అన్నారు. ఇరాన్ మళ్లీ చర్చలకు వస్తుందా? రాదా? అనేది తనకు ఇక అనవసరమని కూడా చెప్పారు. ఇప్పటికే ఇరాన్ పరిస్థితి దగజారిందని, మిలిటరీ ధ్వంసమైపోయిందని చెప్పారు. శాంతి చర్చలు విఫలమవడానికి అమెరికానే కారణమని ఇరాన్ ఆరోపించింది. యుద్ధాన్ని ముగించేందుకు అమెరికాతో ఇరాన్ చిత్తశుద్ధితో సంప్రదింపులు చేసింది. కానీ, ఇస్లామాబాద్ ఒప్పందానికి కొన్ని అంగుళాల దూరంలోనే చర్చలు కుప్పకూలాయి. అతివాద భావజాలం, లక్ష్యాలు మారడం, నిర్బంధం వంటివి మాకు ఎదురయ్యాయి. మంచి చేస్తే మంచి జరుగుతుంది. చెడు చేయాలని చూస్తే శత్రుత్వమే మిగులుతుందని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చి పోస్ట్ చేశారు.

# మహిళలంటే బిజెపికి చిన్నచూపు

**15మంది బిజెపి అధ్యక్షులు మారినా..మహిళలకు చోటేది... ముఖ్య పదవుల్లో కూడా మహిళలకు చోటివ్వని బిజెపి**

**కాంగ్రెస్‌లో ఇందిర, సోనియాలు అధ్యక్షులుగా పనిచేశారు... బండి సంజయ్ విమర్శలు మాని నిజాలు తెలుసుకోవాలి**

**మీడియా సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి చురకలు**

**హైదరాబాద్, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** సీట్ల పునర్విభజనలో పర్సంటేజీలు కాదు నెంబర్ ముఖ్యం అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. రాజకీయాల్లో నెంబర్ ముఖ్యం అంటూ.. వాజపేయి ప్రభుత్వం ఒక్క ఓటుతో పడిపోయిందని గుర్తు చేశారు. నెంబర్ లేకుండా రాజకీయాల్లో ఎవరూ ఎవరితోనూ చర్చలు చేయరని అన్నారు. ఇకపోతే ఇప్పటివరకు15 మంది బీజేపీ అధ్యక్షుల నియామకం జరిగింది.. కాని ఇప్పటివరకు భారతీయజనతా పార్టీ అధ్యక్షురాలిగా ఒక్క మహిళ నియామకంజరగలేదని సిఎం రేవంత్ చురకలంటించారు. బీజేపీకి మహిళ పట్లగౌరవం, చిత్తశుద్ధి ఉందో అర్థమౌతుందన్నారు. ఇందిరాగాంధీ, సోనియా గాంధీ నాయకత్వంలో అతి ఎక్కువ కాలం పనిచేసిన పార్టీ కాంగ్రెస్ మహిళలకు అన్యాయం చేస్తుందా.. అని ప్రశ్నించారు. బీజేపీకి మహిళను అధ్యక్షురాలిగా నియమించుకున్న తర్వాత బండి సంజయ్ మాట్లాడాలన్నారు. బండి సంజయ్ వ్యాఖ్యలుదక్షణాది రాష్ట్రాల్లోని ఎస్సీ,ఎస్టీ, మహిళలకు వ్యతిరేకం.. అన్నారు. మా ఎంపీలు తెలంగాణను సాధించారు.. ఇప్పుడు పునర్విభజన పైన కూడా పోరాడుతారని సిఎం అన్నారు. దక్షిణాది రాష్ట్రాలతో పాటు చిన్న రాష్ట్రాలను కూడా ఐక్యం చేస్తాం అని అన్నారు. పార్లమెంట్ లో బిల్లును ఎలా ఆమోదిస్తారోచూస్తాం.. 60యేళ్లలోమహిళల కోసం కాంగ్రెస్ పార్టీ చాలా




చేసింది..46యేళ్లలో ఒక్క మహిళను పార్టీ అధ్యక్షురాలిని బీజేపీచేయలేదు.. జనరల్ సెక్రటరీ ఆర్గనైజేషన్పదవి కూడా ఇవ్వలేదన్నారు. మహిళలను చిన్న చూపు చూడటమే బీజేపీలక్షణం.. ద్వితీయ శ్రేణి పౌరులుగా మహిళలను చూస్తున్నారు.. స్వాతంత్ర్యం తెచ్చింది, రాజ్యాంగాన్ని తెచ్చింది, రిజర్వేషన్లుకల్పించింది కాంగ్రెస్ పార్టీ.. ఇప్పుడు దేశాన్ని కాపాడుకునే బాధ్యత కూడా కాంగ్రెస్ దే.. అన్నారు. యా బా పై శాతంతో సీట్ల పునర్విభజన జరిగితే కిషన్ రెడ్డి, బండి సంజయ్ లు మోదీ ఇంటి ముందు బంట్రోతు లుగానిలబడాల్సివస్తుంది.. వాళ్ల అవసరం ఇక ముందు ఉండదన్నారు. అన్ని దక్షిణాది రాష్ట్రాలతో పాటు ఢిల్లీ, పంజాబ్ లాంటి చిన్న రాష్ట్రాలకు కుదీనిపైన లేఖ రాస్తానని సిఎం రేవంత్ అన్నారు. గతంలోనియోజకవర్గాలపునర్విభజన మూడు సార్లు జరిగింది.. 1967 లో 520సీట్లకు పెంచారు,1976 లో 542సీట్లకుపెంచారు.. తర్వాత సిక్కిం నుంచి ఒక సీటు పెరిగి 543 కి పెరిగింది.. 2001 లో వాజ్ పేయి పునర్విభజన పైన చట్టసవరణ చేశారు. దాని వల్ల 2009 లో తెలంగాణకు17 ఎంపీ సీట్లు , ఆంధ్రాకు25 ఎంపీ సీట్లు వచ్చాయి.. .తెలంగాణ కు 119 అసెంబ్లీ సీట్లు, ఏపీకి175శాసన సభ సీట్లు పెరిగాయి.. స్థూల ఉత్పత్తిలోఅత్యధికంగాభాగస్వామ్యం చేస్తున్న రాష్ట్రాలకు అవకాశం ఇవ్వాలి.. ఈ శా న్య రాష్ట్రాల్లో, కేంద్ర పాలిత ప్రాంతాల్లో జనాభాప్రాతిపాదికన సీట్లు లేవు.. 100 శాతం జనాభాప్రాతిపదికన సీట్ల పెంపు జరగలేదు.. ప్రాతినిధ్యం కోసమే ఈశాన్య రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఎంపీ సీట్లు ఇచ్చారని సిఎం గుర్తు చేశారు. సీట్ల పునర్విజభన పైన అఖిల పక్ష సమావేశంతో పాటు అన్ని సంస్థలతో సంప్రదింపులు చేయాలి.. పార్లమెంటులో పునర్విభజన పైన చర్చించాలి.. నిపుణలతో ఒక కమిటీ ఏర్పాటు చేయాలి.. అన్ని అసెంబ్లీల్లో చర్చకు పెట్టి పార్లమెంటులో ఆమోదించి నిర్ణయం తీసుకోవాలి.. 2028 మార్చి వరకు ఈ పక్రియను పూర్తి చేయొచ్చు...హడావుడి గా చేసి దేశంలో దక్షణ, ఉత్తరాది మధ్యగ్యాప్ పెంచొద్దని సిఎం రేవంత్ డిమాండ్ చేశారు.

## మొబైల్ ఫోన్ల కొనుగోళ్లపై అసత్య ప్రచారాలు

**కెసిఆర్‌కు లీగల్ నోటీసులు పంపిన సీతక్క**

**హైదరాబాద్, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు మంత్రి సీతక్క లీగల్ నోటీసులు పంపించారు. బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా చేస్తున్న తప్పుడు ఆరోపణలకు కేసీఆర్ బాధ్యత వహించాలని నోటీసుల్లో పేర్కొన్నారు. సోమవారం 13న రిజిస్టర్ పోస్టు ద్వారా కేసీఆర్ కు లీగల్ నోటీసులు పంపించారు సీతక్క. సీతక్క తరుపు అడ్వకేట్ నాగులూరి కృష్ణ కుమార్ రిజిస్టర్ పోస్టు ద్వారా కేసీఆర్ కు లీగల్ నోటీస్ పంపించారు. అంగన్వాడి మొబైల్ ఫోన్ల కొనుగోలు విషయంలో నిరాధార ఆరోపణలు చేస్తూ తన ప్రతిష్టకు భంగం వాటిల్లేలా బీఆర్ఎస్ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతోందని.. అందుకు కేసీర్ బాధ్యత వహించాలనంటూ నోటీసుల్లో పేర్కొన్నారు. అంగన్వాడీ మొబైల్ ఫోన్ల కొనుగోలు పక్రియను తెలంగాణ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ నిర్వహించిందని తెలిపారు. టెండర్ ఇవాల్యుయేషన్ కమిటీ నిర్ణయాల ప్రకారం కాంట్రాక్ట్ ఇవ్వడం జరిగిందని, ఇందులో తనకు ఎలాంటి సంబంధం లేదని నోటీసులో స్పష్టం చేశారు. మొత్తం టెండర్ విలువ 44 కోట్ల రూపాయలే ఉన్నప్పటికీ, అందులో రూ. 30 కోట్ల అవినీతి జరిగిందని చెప్పడం అసంబద్ధమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆధారాలు లేని ఆరోపణగా పేర్కొన్నారు. ఖా పార్టీ అఫీషియల్ సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారానికి కేసీఆర్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. తన ప్రతిష్టను దెబ్బతీసేలా కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని నోటీసులో పేర్కొన్నారు మంత్రి సీతక్క. 48 గంటల్లో పోస్టులు తొలగించి కేసీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకుంటానని లీగల్ నోటీసులో పేర్కొన్నారు.

## గ్యాస్ సిలిండర్ల అక్రమ నిల్వలపై దాడులు

- రూ 1.50 కోట్ల విలువైన డొమెస్టిక్ సిలిండర్ల స్వాధీనం.
- గత నెల రోజుల్లో 2,089 కేసులు నమోదు.
- పౌరసరఫరాల శాఖ నిరంతర నిఘా

**హైదరాబాద్, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** గ్యాస్ సరఫరాలో గృహ వినియోగదారులకి ఎటువంటి ఇబ్బంది రాకుండా రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ నిరంతరం మానిటరింగ్ చేస్తున్నది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర పౌర సరఫరాలు, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు గ్యాస్ సిలిండర్ల ను అక్రమ నిల్వ, పక్కదారి పట్టించే వారిపై అధికారులు నిఘా ఉంచి, ఆకస్మిక తనిఖీలు చేస్తున్నారు. డొమెస్టిక్ సిలిండర్ల సరఫరా పక్రియ నిబంధనల ప్రకారం సకాలంలో జరిగేందుకు బుకింగ్స్ / డెలివరీలను కమాండ్ కంట్రోల్ ద్వారా ఆయా ఏజెన్సీ లతో రోజువారీగా చెక్ చేస్తున్నారు. గత నెల రోజులుగా నిర్వహించిన దాడుల్లో అక్రమంగా తరలిస్తున్న, నిల్వ ఉంచిన 5,079 డొమెస్టిక్ సిలిండర్లు, మరో 70 చిన్న సిలిండర్లను విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ 1 కోటి 50 లక్షలు ఉన్నది. ఈ సందర్భంగా 2,089 కేసులు నమోదు చేశారు. వీరిపై చట్ట ప్రకారం చర్యలు చేపట్టారు. గ్యాస్ సిలిండర్ల అక్రమ నిల్వ, తరలింపు, డెలివరీ లో జాప్యంపై రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్:1967 కు ఫిర్యాదు చేయాలని ప్రభుత్వం సూచించింది.

## నాంపల్లి రెడ్‌హిల్స్‌లో అగ్నిప్రమాదం

**సకాలంలో మంటలను ఆర్పిన ఫైర్ సిబ్బంది**

**హైదరాబాద్, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నాంపల్లి రెడ్‌హిల్స్‌లోని మూడంతస్తుల భవనంలో సోమవారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. భవనం మూడో అంతస్తులో షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ప్రమాద సమయంలో భవనంలో 23 మంది నివాసితులు ఉన్నారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు వెంటనే అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. భవనంలో చిక్కుకున్న 23 మందిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదని, ప్రాణనష్టం ఏమీ లేదని అధికారులు తెలిపారు. మంటలు వేగంగా వ్యాప్తి చెందే అవకాశం ఉన్నప్పటికీ, అగ్నిమాపక శాఖ సిబ్బంది త్వరితగతిన స్పందించి.. మంటలు ఇతర ఫ్లోర్లకు వ్యాపించకుండా నివారించారు. చివరకు మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకొచ్చారు. భవనంలో ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. మంటలు పూర్తిగా అదుపులోకి రావడం, ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. అగ్నిప్రమాదంపై స్థానిక పోలీసులు, అగ్నిమాపక అధికారులు దర్యాప్తు మొదలుపెట్టారు.

## వచ్చే విద్యాసంవత్సరానికి డిగ్రీ ప్రవేశాలు

**15నుంచి సీట్ల భర్తీకి తొలివిడత ప్రక్రియ**

**తెలంగాణలో దోస్త్ నోటిఫికేషన్ విడుదల**

**హైదరాబాద్, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాష్ట్రంలో వచ్చే విద్యా సంవత్సరం 2026–27లో ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో సీట్ల భర్తీకి నిర్వహించే దోస్త్ నోటిఫికేషన్‌ను తెలంగాణ ఉన్నత విద్యామండలి విడుదల చేసింది. ఈనెల 15వ తేదీ నుంచి మే 7వ తేదీ వరకు తొలి విడతలో సీట్ల భర్తీ పక్రియ కొనసాగుతుంది. అర్హులైన విద్యార్థులు రూ.200 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి. ఏప్రిల్ 30వ తేదీ నుంచి మే 8వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. ఒక మే 14వ తేదీన తొలి దశ సీట్ల కేటాయింపు జరగనుంది. సీట్ల కేటాయింపు అనంతరం ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. ఇక రెండో దశ సీట్ల రిజిస్ట్రేషన్ పక్రియ మే 15వ తేదీ నుంచి మే 25వ తేదీ వరకు కొనసాగనుంది. మే 15వ తేదీ నుంచి మే 26వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చు. మే 30వ తేదీ సీట్లు కేటాయిస్తారు. మూడో విడత రిజిస్ట్రేషన్ పక్రియ మే 31వ తేదీ నుంచి జూన్ 15వ తేదీ వరకు జరగనుంది. జూన్ 16వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చు. జూన్ 20వ తేదీన సీట్ల కేటాయింపు ఉంటుంది. రెండో, మూడో విడత సీట్ల కేటాయింపు అనంతరం కూడా ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. సీట్లు పొందిన విద్యార్థులు ఆయా కాలేజీల్లో జూన్ 20 నుంచి 27వ తేదీ మధ్యలో హాజరై అడ్మిషన్ పక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది. జూన్ 29, 30వ తేదీల్లో ఓరియంటేషన్ కార్యక్రమాలు నిర్వహిస్తారు. జూలై 1వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయి.

## మహిళా రిజర్వేషన్లపై విమర్శలు తగవు

**సిఎం రేవంత్ వ్యాఖ్యలపై ఎంపి డికె అరుణ**

**హైదరాబాద్, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్‌ను దేశ ప్రజలు స్వాగతిస్తున్నారని ఎన్డీయే కూటమి పార్టీల నేతలే చెబుతున్నారని బిజెపి ఎంపి డికె అరుణ అన్నారు. మహిళా రిజర్వేషన్ అంశానికి ప్రతిపక్ష పార్టీలు మద్దతు ఇస్తూనే డీలిమిటేషన్‌పై విమర్శలు చేస్తున్నాయి. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా విమర్శలు చేయడం సరికాదని ఆమె వ్యాఖ్యలు చేశారు. దక్షిణాది, చిన్న రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీజేపీ ఎంపీ డీకే అరుణ తీవ్రంగా స్పందించారు. మహిళా రిజర్వేషన్లు, పార్లమెంటు, అసెంబ్లీలలో మహిళల ప్రాతినిథ్యం పెంచడానికి సాయపడుతుందని డీకే అరుణ తెలిపారు. మహిళా రిజర్వేషన్ల అంశంపై రాజకీయం చేయవద్దని ప్రతిపక్ష పార్టీలకు ఆమె సూచించారు. ఈ రిజర్వేషన్ల ద్వారా చట్టసభల్లో మహిళలకు సమాన అవకాశాలు లభిస్తాయని, దీనికి పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరి మద్దతును అవసరమని ఆమె అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో, ఇలాంటి చట్టాలు మహిళలకు చాలా మేలు చేస్తాయని ఎంపీ తెలిపారు.

## నేటి మనదేశమ్ సంపాదకీయం

# అంబేద్కర్ ఆశయాలకు పట్టం కట్టాలి!

అంబేద్కర్ మహాశయుడు ఈ దేశం గురించి గొప్పగా కలలు కన్నారు. తన దేశాన్ని ఉన్నతంగా చూడాలను కున్నారు. అస్పృశ్యతను పూర్తిగా నిర్మూలించడంతో పాటు, అందరికీ విద్య దక్కాలన్న ఆశయం ఆయనది. న్యాయవాదిగా, ఆర్థికవేత్తగా, రాజకీయవేత్తగా, సామాజిక సంస్కర్తగా, రాజ్యాంగ నిర్మాతగా భారతీయుల గుండెల్లో ఎప్పటికీ నిలిచిపోయే మహనీయుడు డాక్టర్ భీమ్‌రావ్ అంబేద్కర్. అంటరానితనాన్ని వ్యతిరేకిస్తూ.. దళితులు, మహిళలు, కార్మికుల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేసిన యోధుడు అంబేద్కర్. దేశంలో అన్ని మతాలు, తెగలు, దళితులు, గిరిజనులు, వెనుకబడిన కులాలు తదితర వర్గాలకు సమ న్యాయం జరిగేలా, వారి హక్కులకు భంగం వాటిల్లకుండా ఉండేందుకు, సర్వసత్తాక సార్వభౌమాధి కారాన్ని దక్కించుకొనేందుకు వీలుగా అంబేద్కర్ రాజ్యంగాన్ని రూపొందించారు. వివిధ రకాల భాషలు, ఆచారాలు, మతాలూ ఉన్నటువంటి ఈ దేశంలో ఆయన ముందు చూపుతో రాసిన రాజ్యాంగం అనుసరించి ఇప్పుడు మన దేశం నడుస్తుంది అంటే ఆయన గొప్పతనం ఏంటో అర్థం అవుతుంది. ఆయన కేవలం దళితుల కోసమో లేక వాళ్ళ రిజర్వేషన్ ల కోసమో మాత్రమే కృషి చేయలేదు. ఆడవాళ్ళకి మగవాళ్ళకి సమానమైన జీతాలు ఉండాలని, ఆడవాళ్ళకి ప్రెగ్నెన్సీ టైం లో లీవ్స్ ఇవ్వాలని, పని గంటల సమయాన్ని 12 నుండి 8 గంటలు చేయాలనీ, స్త్రీలకూ ఆస్తి హక్కు ఇవ్వాలని ఇలా ఎన్నో అంశాలలో ఈయన కృషి చేసారు. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని యావత్ భారతావని ఆయన ఆశయాలపై ఇప్పటికైనా అధ్యయనం చేయాలి. ఎంతసేపు అంబేద్కర్ పేరు చెప్పి విగ్రహాలు పెట్టడం, సభలు పెట్టడం కాదు. ఆయన దేశానికి అందించిన విలువైన సూచనలు పాటించలి. ఆయన కోరుకున్న సమాజం కోసం పాలకులు ఆలోచన చేయాలి. అందుకు నడుం బిగించాలి. జయంతి సభల్లో ఉపన్యాసాలు ఇవ్వడం మానాలి. ఒకానొక సమయంలో అంటరానితనం పేరు తో అట్టడుగు వర్గాల ప్రజల పరిస్థితి ఏవిధంగా ఉండేదన్నది ఆయన జీవితమే పెద్ద ఉదాహరణ. అప్పటి వరకు మూగ బోయిన అణగారిన ప్రజలకు గొంతుకయ్యాడు. అయితే కొందరు రాజకీయంగా ఆయనను ఎదగకుండా చేశారు. స్వాతంత్ర్యం రాగానే నెహ్రూ బదులు అండేబ్కర్‌ను ప్రధానిని చేసివుంటే మనదేశ రాత మరోలా ఉండేది. కానీ నెహ్రూ, గాంధీల కుట్రలకు ఆయన బలయ్యారు. భారత రాజ్యాంగ నిర్మాత, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, ఆర్థిక నిపుణుడు, దళితోద్ధారకుడు, మహా మేధావి, బహుముఖ ప్రజ్ఞాశాలి, ఇలా ఆయన గురించి ఎంత చెప్పినా తక్కువే. అందుకే నేమో ఆయనను ఆనాటి నేతలు దూరం పెట్టారు. ఈనాటి నేతలు విగ్రహాలు పెట్టి, కేవలం చెక్క భజనలు చేస్తున్నారు. కానీ ఆయన స్వప్నించిన భారతాన్ని ఆవిష్కృతం చేసే ప్రయత్నాలు చేయడం లేదు. 1891 వ సంవత్సరం ఏప్రిల్ 14 వ తేదీన రాంజీ మాలోజి సక్పాల్ ,భీమాబాయ్ దంపతులకు మధ్యప్రదేశ్ లోని మావ్ గ్రామంలో మహర్ కులంలో అంబేద్కర్ జన్మించారు. అప్పట్లో ఈ కులం వారిని అంటరానివారిగా పరిగణించేవారు. దళితుడు అనే కారణంతో ఈయన చిన్న వయసు నుండే ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నారు. చిన్నప్పుడు వాళ్ళ అన్నయ్యతో కలిసి వేరే ఊరుకి నడిచి వెళ్తుంటే బాగా దాహం వేయడంతో దగ్గరలో ఉన్న ఒక ఇంటికి వెళ్లి తాగడానికి నీటిని అడిగితే అంబేద్కర్ మహర్ కులానికి చెందిన వారు అని తెలిసి నీళ్లు ఇవ్వకపోగా, పక్కనే ఉన్న మురికి గుంటలో నీటిని తాగమని తిట్టి పంపించారు. ఇది ఒక ఉదాహరణ మాత్రమే. ఇలాంటి అనేక అవమానాలను అంబేద్కర్ ఎదుర్కొన్నారు. అందుకే ఇలాంటి వ్యవస్తను నిరసించాడు. అలాగని మిగతా కులాల వారిని ఏనాడూ ఆయన ఈసడించుకోలేదు. ఇది వ్యవస్థాగతమైన లోపంగా గుర్తించారు. తన ఆలోచనలను రాజ్యాంగ రచనలో చూపారు. భారత దేశం ఉన్నతంగా ఉండాని కోరుకున్నాడు. దేశ విభజనను తీవ్రంగా వ్యతిరేకించారు. ఇదే విషయాన్ని నిర్మొహమాటంగా చెప్పారు. కానీ వారెవ్వరూ అంబేద్కర్‌ను లెక్కచేయలేదంటే, ఆయన పట్ల వారికి గల ప్రేమానురాగాలు ఏపాటివో వేరుగా చెప్పాల్సిన పనిలేదు. అమెరికాలో మొదటి సారిగా అంబేద్కర్ స్వేచ్ఛ అంటే ఏంటో చూసారు. అప్పుడు భారత దేశంలో ఉన్నట్టుగా కుల, జాతి వివక్షత లేదు. అందరికి సమానమైన గౌరవం, అవకాశాలు దక్కేవి. 1917 లో అంబేద్కర్ వెనక్కి వచ్చి ఒప్పందం ప్రకారం బరోడా సంస్థానంలో రక్షణశాఖలో ఉద్యోగంలో చేరారు.క్కడ ఆయనకి ఒక గొప్ప అధికారిగా ఉద్యోగం దక్కింది కానీ ఈయన నిమ్న కులస్తుడు కావడంతో ఆయన కింద ఉండే ఉద్యోగులు కూడా ఆయనని గౌరవించే వారు కాదు. ఏదైనా ఒక ఫైల్ ఇవ్వాలంటే దూరం నుండే ఆయన టేబుల్ మీదకు విసిరేసేవారు. చదవాలన్న, పని చేయాలన్న, ఉండడానికి ఇల్లు కావాలన్నా, చివరికి నీళ్లు తాగాలన్న కూడా కులం అడ్డు వచ్చేది. ఉద్యోగం చేసుకుంటూనే 1927 నుండి అంటరానితనానికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేయడం మొదలు పెట్టాడు. ఇలా మహద్ లో దళితుల మహా సభని ఏర్పాటు చేసారు. దేశంలో నలుమూలల నుండి కొన్ని వేళ మంది దళితులు ఆ సభకు హాజరయ్యారు. అప్పటివరకు దళితులు మహద్ లోని చెరువులో నీటిని తాగడానికి అనుమతి ఉండేది కాదు. కానీ అంబేద్కర్ ఆ సభలో దానికి వ్యతిరేకంగా పోరాడి ఆ చెరువులో నీటిని తాగడానికి అనుమతి వచ్చేలా చేసారు. కొల్హాపూర్ మహారాజ్ సాహు మహరాజ్ అస్పృశ్యత , అంటరానితనాన్ని నివారించడానికి కృషి చేస్తున్నారు అని తెలుసుకుని ఆయన సహకారంతో మూగ వాళ్ళకి నాయకుడు అనే అర్థం వచ్చేలా 'మూక్ నాయక్' అనే పత్రికను అలాగే బహిష్కృత్ భారత్, జనతా , ప్రబుద్ధ భారత్ అనే పత్రికలూ నడిపారు. ళితులకు బడులలోకి, గుడులలోకి వెళ్ళడానికి అనుమతి పొందేలా ఉద్యమాలు చేపట్టి విజయం సాధించారు. ఆయన అంత స్థాయికి ఎదిగారు అంటే కారణం చదువు. ≑ూబట్టే ఆయన అందరికి చదువు అందాలని కృషి చేసారు. ఆయితే సంపద కోసమో, అధికారం కోసమో పోరాటం చేయలేదు అట్టడుగు వర్గాల స్వేచ్ఛ కోసం ఆయన పోరాడేవారు. శోధించు, సమీకరించు, పోరాడు అనే సిద్దాంతంతో బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం, కులమాత బేధాలు లేని సమాజం కోసం కృషి చేసేవారు.స్వాతంత్రం వచ్చిన తరువాత అంబేద్కర్ కి కేంద్ర మండలిలో మొట్ట మొదటి న్యాయశాఖ మంత్రి గా పదవి వచ్చింది. అంతేకాదు భారత దేశపు రాజ్యాంగాన్ని రాసే అవకాశం దక్కింది. అయితే రాజ్యాంగం రచించడానికి నియమించిన సభ్యులలో ఒకరు రాజీనామా చేయడం, మరొకరు మరణించడం, కొంతమంది అమెరికాలో ఉండిపోవడం, మరికొంతమంది రాష్ట్ర రాజకీయాలలో నిమగ్నులవడం ఇలా రకరకాల కారణాల వలన భారత రాజ్యాంగం రచించే బాధ్యతంతా అంబేద్కర్ మీద పడింది. దాంతో ఆయన రాత్రీపగలు అనే తేడా లేకుండా నిరంతరం రాజ్యాంగ రచనలోని ఉండేవారు. తరువాత కొద్ది రోజులకి అనారోగ్యం కారణంగా 1956 డిసెంబర్ 6 వ తేదీన అంబేద్కర్ మరణించారు. ఆయన మరణించినగాని ఆయన కృషి ఇప్పటికీ ఎంతో మంది జీవితాలలో వెలుగుని నింపుతుంది. ఒకవేళ ఆయన పూనికుని ఉండకపోతే ఈనాటికి బడుగు బలహీన వర్గాల జీవితాలు ఇంకా అలాగే ఉండిపోయే వేమో.

# ఐటీ ఉద్యోగుల భద్రతపై ప్రత్యేక దృష్టి

## ఉద్యోగులపై మతపరమైన ఒత్తిళ్లు ఉండరాదు.... ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్న బండి సంజయ్

**హైదరాబాద్,ఏప్రిల్13(ఆర్ఎన్ఎ):** నాసిక్‌లో జరిగిన 'లవ్ జిహాద్' ఆరోపణల కేసు నేపథ్యంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్రంగా స్పందించారు. హైదరాబాద్ ఐటీ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగుల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. ఈ మేరకు బండి సంజయ్ కుమార్ ఓ ప్రకటన విడుదల చేశారు. దేశవ్యాప్తంగా, ముఖ్యంగా ఐటీ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులపై మతపరమైన ఒత్తిళ్లు, వేధింపులు, రహస్య నెట్‌వర్క్‌ల ప్రభావం ఉండకూడదని తెలిపారు. హైదరాబాద్‌లో లక్షలాది మంది ఐటీ ఉద్యోగులు ఉన్నందున వారి పని వాతావరణం కేవలం కెరీర్ అభివృద్ధికి మాత్రమే పరిమితం కావాలని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వానికి బండి సంజయ్ కొన్ని కీలక సూచనలు చేశారు. అన్ని ప్రధాన ఐటీ కంపెనీల హెచ్‌ఆర్ బృందాలతో తక్షణ సమావేశం నిర్వహించాలని సూచించారు. ఉద్యోగుల భద్రతపై స్పష్టమైన విధానాలు రూపొందించాలని అన్నారు. ఉద్యోగుల ఫిర్యాదులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఏ కేసును



కూడా దాచిపెట్టకూడదని చెప్పుకొచ్చారు. ఉద్యోగులు కార్యాలయాల్లో స్వేచ్ఛగా, భద్రతతో పనిచేసే వాతావరణం ఉండాలని బండి సంజయ్ కుమార్ సూచించారు. ఏ రకమైన ఒత్తిడి, వేధింపులు, దోపిడీకి అవకాశం ఇవ్వకూడదని స్పష్టం చేశారు. అలాగే, బాధితులు ఒంటరిగా ఉండకుండా వారికి తగిన రక్షణ, మద్దతు అందించాలని సూచించారు. పలువురు ఉద్యోగులు ఇప్పటికే కార్యాలయాల్లో జరిగిన అనుభవాలను సోషల్ మీడియాలో పంచుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ హెచ్చరిక సంకేతాలను ప్రభుత్వం, కంపెనీలు నిర్లక్ష్యం చేయకూడదని సూచించారు. ఐటీ కంపెనీల యాజమాన్యాలు, హెచ్‌ఆర్ విభాగాలు ఉద్యోగుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని బండి సంజయ్ కుమార్ కోరారు. ప్రతి ఫిర్యాదును నిష్పక్షపాతంగా, వేగంగా పరిష్కరించాల్సిన అవసరం ఉందని చెప్పారు. నాసిక్ కేసు నేపథ్యంలో వచ్చిన ఈ వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా ఐటీ రంగ భద్రతపై చర్చను మరింత పెంచాయని తెలిపారు. ఉద్యోగుల రక్షణ, కార్యాలయాల్లో పారదర్శకత, ఫిర్యాదు వ్యవస్థ బలోపేతం వంటి అంశాలు ఇప్పుడు కీలకంగా మారాయని పేర్కొన్నారు.

# పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధమేఘాలు

## ఇరాన్‌పై దాడికి ట్రంప్, ఇజ్రాయిల్ సమాలోచనలు... ఎప్పుడు ఏం జరుగుతుందో అన్న ఆందోళన

**వాషింగ్టన్,ఏప్రిల్13(ఆర్ఎన్ఎ):** అమెరికా-ఇరాన్ మధ్య శాంతి చర్చలు విఫలమవడంతో పశ్చిమాసియా మళ్లీ నివురుగప్పిన నిప్పులా మారింది. ఏ క్షణాన ఏం జరుగుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. మరోవైపు, ఇరాన్‌పై మళ్లీ దాడులు ప్రారంభించేందుకు అమెరికా, ఇజ్రాయెల్ సిద్ధమవుతున్నట్లు వార్తలు రావడం ఆందోళన కలిగిస్తోంది. హర్మూజ్ జలసంధిని దిగ్బంధిస్తామని అమెరికా సెంట్రల్ కమాండ్ ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. దీంతో పాటు ఇరాన్‌పై పరిమిత స్థాయిలో సైనిక దాడులను పునరుద్ధరించేలా అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్ సలహాదారులు ప్రణాళికలు రచిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ పలు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి.

అయితే, ఈ దాడులకు ట్రంప్ అంగీకరిస్తారా? లేదా అనేదానిపై ఇంకా స్పష్టత లేదు. ఇరాన్ (ఎసజీని)ను నలువైపులా నిర్బంధించి, హర్మూజ్ జలసంధిపై నియంత్రణ తెచ్చుకోవాలని ట్రంప్ భావిస్తున్నట్లు సమాచారం. మిత్ర దేశాలతో కలిసి ఈ మార్గంలో ప్రయాణించే నౌకలకు భద్రత కల్పించే అంశంపై అమెరికా అధ్యక్షుడు చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. అటు, ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ కూడా ఇరాన్‌పై దాడులు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని ఐడీఎఫ్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ లెఫ్టినెంట్ జనరల్ ఇయాల్ జమీర్ తన సైన్యాన్ని ఆదేశించినట్లు ఇజ్రాయెల్ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఇరాన్‌పై దాడుల పునరుద్ధరణ విషయంలో ట్రంప్ నిర్ణయం కోసం ఇజ్రాయెల్ ఎదురుచూస్తున్నట్లు ఆ కథనాలు తెలిపాయి. అయితే, ఈలోగా టెహ్రాన్ తమపై దాడి చేస్తే మాత్రం ప్రతిస్పందన తీవ్రంగా ఉంటుందని ఐడీఎఫ్ హెచ్చరిస్తోంది. ఇదిలా ఉండగా.. యూఎస్-ఇరాన్ చర్చలు విఫలం కావడంతో పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్తతలు చెలరేగాయి. ఇరాన్ పోర్టుల నుంచి నౌకలు హోర్ముజ్ మీదుగా రాకపోకలు సాగించ కుండా నేటి సాయంత్రం 7.30 (భారత కాలమానం ప్రకారం) నిర్బంధం విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. దీంతో పాటు ఇరాన్‌పై యూఎస్, ఇజ్రాయెల్‌లు మళ్లీ దాడులు చేసేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్టు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. అణు కార్యక్రమాన్ని వదులుకునేలా ఇరాన్‌పై ఒత్తిడి తెచ్చేందుకు ఇజ్రాయెల్ దాడులను ప్లాన్ చేస్తున్నట్టు మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఆర్మీ సిద్ధంగా ఉండాలని ఇప్పటికే ఇజ్రాయెల్ రక్షణ దళం చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ జమీర్ ఆదేశించారు. మరోవైపు, ఇరాన్‌పై పరిమిత స్థాయిలో దాడులు చేసేందుకు ట్రంప్, ఆయన సలహాదారులు యోచిస్తున్నట్టు తెలుస్తోంది. ఇరాన్‌ను అన్ని వైపుల నుంచి దిగ్బంధించి చర్చల్లో ప్రతిష్టంభనను తొలగించాలనేది యూఎస్ ప్రభుత్వం ఉద్దేశమని కథనాలు వెలువడ్డాయి. ఈ దిశగా నాటో దేశాలను కూడా రంగంలోకి దింపేందుకు అమెరికా ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే హోర్ముజ్ మీదుగా నౌకల రాకపోకలను ఇరాన్ నిలిపివేసిన విషయం తెలిసిందే. హోర్ముజ్ జలాల్లోకి యూఎస్ యుద్ధ నౌకలు వస్తే దాడులు తప్పవని హెచ్చరించింది. చర్చలు విఫలం కావడానికి అమెరికానే కారణమని తేల్చి చెప్పింది. యూఎస్ పెట్టిన అసమంజసమైన డిమాండ్స్ కారణంగానే చర్చల్లో పీటముడి పడిందని పేర్కొంది. అణు కార్యక్రమం వదులుకునే దిశగా ఇరాన్ నుంచి స్పష్టమైన హామీలు రాలేదని యూఎస్ ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ పేర్కొన్నారు.

# ఒంటరి వృద్ధురాలిపై దాడి

## రోకలిబండతో బాదిన దుండుగులు

## బంగారం దోచుకుని పరార్

**కామారెడ్డి,ఏప్రిల్13(ఆర్ఎన్ఎ):** కామారెడ్డి జిల్లాలోని భిక్కనూరు మండల కేంద్రంలో జరిగిన దారుణ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఇంట్లోకి చొరబడి ఓ వృద్ధురాలిపై రోకలిబండతో దాడి చేసి, ఆమె బంగారు ఆభరణాలను అపహరించిన ఘటన ప్రజలను భయభ్రాంతులకు గురి చేసింది. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భిక్కనూరు మండల కేంద్రంలో నివసిస్తున్న ఓ వృద్ధురాలు తన ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడ్డారు. ఆ సమయంలో ఆమెపై అకస్మాత్తుగా దాడికి పాల్పడ్డారు. దాడికి రోకలి బండను ఉపయోగించినట్లు సమాచారం. ఈ దాడిలో వృద్ధురాలు తీవ్రంగా గాయపడింది. దాడి సమయంలో ఆమె అరుస్తూ సహాయం కోరినప్పటికీ, దుండగులు ఆమె బంగారు ఆభరణాలను బలవంతంగా లాక్కొని పరారయ్యారు. వాటి విలువ ఎంతన్నది పూర్తిగా నిర్ధారణ కాలేదు. ఈ ఘటనలో వృద్ధురాలి తలకు తీవ్ర గాయాలైనట్లు వైద్యులు తెలిపారు. రక్తస్రావం అధికంగా ఉండటంతో స్థానికులు వెంటనే స్పందించి ఆమెను సమీప ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అందించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిపై వైద్య బృందం నిరంతరం పర్యవేక్షిస్తోంది. ఈ దారుణ ఘటనతో భిక్కనూరు ప్రాంత ప్రజల్లో భయాందోళన నెలకొంది. వృద్ధురాలిపై ఇంతటి క్రూరమైన దాడి జరగడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దుండగులు ముందుగా ఇంటి పరిస్థితిని గమనించి, ఎవరు లేని సమయం చూసి లోపలికి చొరబడినట్లు పోలీసులు భావిస్తున్నారు. బంగారు ఆభరణాల సమాచారం ముందుగానే తెలిసి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. ఈ దాడి పథకం ప్రకారం జరిగిందా లేదా అకస్మాత్తుగా జరిగిన దోపిడీనా అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. ససమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు వేగవంతం చేశారు. ఈ ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజ్‌ను సేకరించి, అనుమానితులను గుర్తించడానికి చర్యలు చేపట్టారు. స్థానికుల నుంచి కూడా సమాచారం సేకరిస్తున్నారు. పోలీసులు ఈ ఘటనను సీరియస్‌గా తీసుకుని, దోషులను త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు.

# మరోమారు ఎదురు కాల్పులు

## మహిళా మావోయిస్టు నాయకురాలు మృతి ... అడవుల్లో కొనసాగుతున్న కూంబింగ్

**రాయ్‌పూర్,ఏప్రిల్13(ఆర్ఎన్ఎ):** ఛత్తీస్‌గఢ్‌లో భద్రతా దళాలు, మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో మహిళా మావోయిస్టు కమాండర్ రూపీ మృతి చెందారు. కాంకేర్ జిల్లాలోని ఛోటే బెట్టియా అటవీ ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. రూపీపై రూ.5 లక్షల బహుమతి ప్రకటించబడినట్లు అధికారులు తెలిపారు. మావోయిస్టులు ఉన్నారనే విశ్వసనీయ సమాచారం ఆధారంగా భద్రతా దళాలు ఆ ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టగా, ఈ సందర్భంగా ఇరుపక్షాల మధ్య కాల్పులు చోటుచేసుకున్నాయి. ఎన్‌కౌంటర్ అనంతరం రూపీ మృతదేహంతో పాటు ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు భద్రతా దళాలు వెల్లడించాయి. ఆ ప్రాంతంలో మరికొందరు మావోయిస్టులు దాగి ఉన్నారనే అనుమానంతో విస్తృతంగా గాలింపు కొనసాగుతోంది. గత నెలలో కూడా ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు హతమైన సంగతి తెలిసిందే. ఎన్‌కౌంటర్ సమయంలో సుమారు పదిమంది మావోయిస్టులు అక్కడి నుంచి అడవుల్లోకి పారిపోయినట్లు సమాచారం. వారు దట్టమైన అటవీ ప్రాంతాన్ని ఉపయోగించి



తప్పించుకున్నారని భద్రతా బలగాలు భావిస్తున్నాయి. వారిని గుర్తించి పట్టుకోవడానికి ప్రత్యేక బలగాలు రంగంలోకి దిగాయి. ఎన్‌కౌంటర్ అనంతరం ప్రాంతాన్ని పూర్తిగా చుట్టుముట్టి కూంబింగ్ ఆపరేషన్ కొనసాగుతోంది. భద్రతా బలగాలు అడవిలో గాలింపు చర్యలు ముమ్మరం చేశాయి. మరి కొంతమంది మావోయిస్టులు అటవీలో దాగి ఉండవచ్చనే అనుమానంతో ఆపరేషన్‌ను భద్రతా బలగాలు కొనసాగిస్తున్నాయి. మావోయిస్టుల కదలికలపై గత కొంతకాలంగా భద్రతా బలగాలు నిఘా పెంచాయి. వారికి వచ్చిన సమాచారం ఆధారంగా ఈ ఆపరేషన్‌ని చేపట్టినట్లు తెలుస్తోంది. దట్టమైన అటవీ ప్రాంతం కావడంతో ఈ ఆపరేషన్ జాగ్రత్తగా కొనసాగుతోంది. ఈ ప్రాంతం గతంలో కూడా మావోయిస్టు కార్యకలా పాలకు కేంద్రంగా ఉంది. తరచూ భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు జరుగుతు న్నాయి. మావోయిస్టులు ఉద్యమం ప్రభావం ఈ ప్రాంతాల్లో ఇంకా కొనసాగుతోండటంతో భద్రతా సవాళ్లు నెలకొన్నాయి. ఎన్‌కౌంటర్ నేపథ్యంలో సమీప గ్రామాల్లో భద్రతను పోలీసులు కట్టుదిట్టం చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. అటవీ ప్రాంతానికి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్థానికులకు హెచ్చరికలు జారీ చేశారు. మిగిలిన మరికొంతమంది మావోయిస్టులను పట్టుకోవడానికి డ్రోన్ సర్వైలెన్స్, ప్రత్యేక కూంబింగ్ బలగాలు ఉపయోగిస్తున్నట్లు సమాచారం. ఈ ఆపరేషన్ మరికొన్ని గంటలు లేదా రోజులు కొనసాగవచ్చని భద్రతా వర్గాలు చెబుతున్నాయి. మాచపల్లి అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఒక మహిళా మావోయిస్టు మృతి చెందడం, పలువురు తప్పించుకోవడం పరిస్థితి తీవ్రతను సూచిస్తోంది. ప్రస్తుతం కొనసాగుతున్న కూంబింగ్ ఆపరేషన్‌లో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

# పాదచారులపై దూసుకెళ్లిన ట్రక్కు

## ఏడుగురు వ్యక్తులు అక్కడిక్కడే మృతి

**రాజ్‌కోట్,ఏప్రిల్13(ఆర్ఎన్ఎ):** ఓ ట్రక్కు అదుపుతప్పి రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తున్న యాత్రికులపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఏడుగురు అక్కడికక్కడే మరణించారు. వారిలో ఆరుగురు యాత్రికులు కాగా.. మరో వ్యక్తి రోడ్డు పక్కన తన వాహనం టైరు మారుస్తున్న డంపర్ డ్రైవర్. యాత్రికులు రాజస్థాన్‌లోని రాజ్‌కోట్ లోని గధ్కా గ్రామం నుంచి దేకావాలా లోని మహదేవ్ ఆలయానికి వెళ్తుండగా.. సోమవారం తెల్లవారుజామున లఖ్తర్-విరామ్‌గామ్ రహదారిపై భాస్కర్‌పారా సమీపంలో ప్రమాదం జరిగింది. రాజ్‌కోట్‌లోని గధ్కా గ్రామం నుంచి దేకావాలాలోని మహాదేవ్ ఆలయానికి నడుచుకుంటూ వెళ్తున్న యాత్రికులు.. మార్గమధ్యలో భాస్కర్‌పారా సమీపంలో ఓ వ్యక్తి రోడ్డుపై ఆగిపోయిన డంపర్‌కు టైరు మారుస్తున్నాడు. యాత్రికులు ఆ డంపర్‌ను దాటుతున్న సమయంలో వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన ట్రక్కు వారిని ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆరుగురు యాత్రికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. వారిలో ఐదుగురు మహిళలు, ఒక పురుషుడు ఉన్నారు. అదేవిధంగా డంపర్ టైరు మారుస్తున్న డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయాడు.దాంతో మొత్తం మృతుల సంఖ్య ఏడుకు చేరింది. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టానికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా అజయ్ పురం గ్రామంలో బైక్ యాత్ర ప్రారంభం

**అనకాపల్లి,ఏప్రిల్13(ఆర్ఎన్ఎ):** అనకాపల్లి జిల్లా రావికమతం మండలం చీమలపాడు పంచాయతీ అజయ్ పురం గ్రామంలో గిరిజన సంఘం., కెవిపిఎస్ సంఘాల ఆధ్వర్యంలో డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలదండలు వేసి నివాళి అర్పించారు.అజయ్ పరువు నుండి జోగంపేట, నేరేడు బంధ, కళ్యాణ్ లావా వరకు బైకే యాత్ర నిర్వహించడం జరిగింది. ఎస్సీ ఎస్టీ చట్టాన్ని ఆర్టికల్ 9 షెడ్యూల్లో చేర్చాలని, నాన్ షెడ్యూల్ గిరిజన మండలాలను ఏజెన్సీ ఏరియాలో కలపాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని కోరారు. రావికతం మండల కేంద్రంలో సర్వేనెంబర్ అంబేద్కర్ కాలనీ వద్ద ఉన్న చెత్తను తొలగించాలి. బాదంపాడు రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 41-లో 5-80 చెట్లు భూమిలో ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం దళితులకు, గిరిజలకు కేటాయించాలి బాదంపాడు రెవిన్యూ పరిధిలో సీలింగ్ భూమి చుట్టూ బౌండరీ ఏర్పాటు



చేయాలని తెలిపారు. దళితులకు గిరిజనులకు పట్టాలి ఇవ్వాలి. కొత్తకోట దళిత కాలనీకి మంచినీరు సౌకర్యం కల్పించాలి.

గిరిజనులు సాగులోన భూములకు, సాగకు కల్పించి, గిరిజనులకు దళితులకు రక్షణ కల్పించాలన్నారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన మోనాటరింగ్ కమిటీలో గిరిజనులకు ప్రాతినిధ్యం కల్పించాలని, జెడ్ జోగంపేట పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. నర్సీపట్నం నుండి జెడ్ జోగిపేట్ వరకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని, దళితులకు గిరిజనులకు ఇచ్చిన అధిక బిల్లులు తగ్గించాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన దళితులకు గిరిజనులకు నర్సీపట్నంలో ప్రత్యేక గ్రీవెన్స్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సాయి కార్యదర్శి కే గోవిందరావు. గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు పాంగి చంద్రావు. పాంగి పవన్ కుమార్. వంతల చిరంజీవి. గేమిల రాజు తదితరులు పాల్గొన్నారు.

# మిద్దె మీద వరి చేను..

## ఏడాదికి 45 కేజీల బియ్యం.. వారెవ్వా!





మిద్దె పైకి వెళ్దాం పద... కొత్త మాట. ఒకప్పుడు సేద్యం అంటే పొలం అనే భావన. ఇప్పుడు అది మారింది. టెర్రస్ కూడా పంట చేనే అనే ధోరణి పెరిగింది. అయితే ఇన్నాళ్లు కూరగాయలు ఆకుకూరలు మాత్రమే టెర్రస్ మీద పండించడం చూశాం. కాని కేరళలోని స్త్రీలు కొందరు మిద్దె మీద ఏకంగా వరే పండించేస్తున్నారు. కుండీల్లో వరి పండి కంకులుగా కోతకు సిద్ధం కావడం విశేషమే.ఆడవాళ్లు ఇప్పుడు ఆధునిక సేద్యవనితలు. మిద్దె మీద వరి చేను ప్రత్యక్షం కావడం కొంత వింతగానే ఉండొచ్చు. పూల కుండీలు, వంకాయలు, బెండకాయలు మిద్దె తోటల్లో కనిపించడం సాధారణం. కొందరు ఆకుకూరలు, సొరకాయలు, పొట్ల కాయలు కూడా పండిస్తున్నారు. కాని వరిని కూడా మిద్దె మీద పండించవచ్చని కేరళ మహిళలు పదేళ్లుగా నిరూపిస్తున్నారు. గత రెండేళ్లుగా కోవిడ్ మూలంగా ఇళ్లకే పరిమితం కావాల్సి రావడం వల్ల ఈ మిద్దె వరి సేద్యం ఇంకా పెరిగింది.

### కుండీల్లో వరి

తిరువంతపురం సమీపంలోని శ్రీకారయంకు చెందిన అంబిక అనే గృహిణి ఐదేళ్ల క్రితం తన టెర్రస్ మీద ప్లాస్టిక్ కుండీల్లో వరి పండించి అందరి దృష్టినీ ఆకర్షించింది. తన మిద్దె మీద మొత్తం 100 ప్లాస్టిక్ కుండీలు పెట్టి వాటిలో సేంద్రియ ఎరువు నింపి, ఒక్కోకుండీలో మూడు నాలుగు వరి మొలకలు నాటి 'ఉమ' అనే వరి వంగడాన్ని **110 రోజుల్లో పండించింది.**

ఆమె తన పైరు ఎదగడానికి బెల్లం, ఆవు పేడ, ఆవు మూత్రం, ఆకుపచ్చ కసువు, కోడిగుడ్ల సొనలు కలిపి తయారు చేసిన 'హృదయామృతం' అనే ద్రావణాన్ని ఉపయోగించింది. చీడ పీడలకు వేప గింజల పొడిని ఉపయోగించింది. మిద్దె ఎక్కితే వంగిన వరి కంకులతో నిండిన పంట కనపడటం ఎంత ఆనందంగా ఉంటుంది. పైగా అది ఇంట్లో రోజూ తినే బియ్యంగా మారినప్పుడు.

### బాటిళ్లలో వరి

ఇది ఇలా ఉంటే కొట్టాయంకు చెందిన సెలెని అనే గృహిణి తన భర్త శామ్ జోసఫ్ సహకారంతో ఇటీవలి కోవిడ్ కాలంలో తన టెర్రస్ మీద ఖాళీ వాటర్ బాటిల్స్‌లో (లీటర్‌వి) వరి పండించి ఆశ్చర్యపరిచింది. వాడి పడేసిన 175 ఖాళీ లీటర్ బాటిల్స్‌ను ఆమె తన వరి సేద్యానికి ఉపయోగించింది. వాటర్ బాటిల్స్‌ను సగానికి కోసి మట్టి, పేడలతో నింపి నీరు ఆరకుండా చూస్తూ వరి పండించింది.

ఎటువంటి రసాయన ఎరువులు వాడకుండా చక్కగా ఈ బాటిల్స్‌లోనే ఆమె నాలుగు కేజీల వరిని పండించింది. కాలక్షేపానికి కాలక్షేపం... రెండు రోజులకు సరిపడా అయినవే కావచ్చు... కాని మన బియ్యం మనం తిన్నాం కదా అంటుంది.

### 45 కేజీల పంట

కొల్లాంకు చెందిన సుగంధా దేవి మిద్దె మీద వరి పంట పండించడంలో మేటిగా మారింది. ఆమె ఏకంగా ప్రతి సంవత్సరం 40 కిలోల బియ్యం దిగుబడి వచ్చేలా టెర్రస్ మీద వరి పండిస్తోంది. పదేళ్ల క్రితం మొదలెట్టిన ఈ పనిలో ఇప్పుడు ఆమె నిష్ణాతురాలిగా మారింది. 56 ఏళ్ల సుగంధా దేవి తన ఇంటి మీదే కాక కూతురి ఇంటి మీద కూడా సేద్యం చేస్తోంది. 'నేను సంవత్సరానికి ఒకసారి, అదీ వర్షాకాలంలో మాత్రమే వరి పండిస్తాను. ఎందుకంటే వరికి తేమ జాస్తిగా కావాలని మనకు తెలుసు. అందుకే జూన్ నుంచి మొదలెట్టి సెప్టెంబర్ మధ్య కాలంలో వరి పండిస్తాను' అంటోంది సుగంధా దేవి. కేరళలో వ్యవసాయాన్ని, మిద్దె తోటల్ని ప్రోత్సహించేందుకు గ్రామ పంచాయతీల్లో ఎరువు, మట్టి సంచులు అమ్ముతారు సబ్సిడీకి. ప్రతి సంవత్సరం ఈ సంచులు కొని వాటిలోనే వరి పండిస్తుంది సుగంధా దేవి. మిద్దె మీద బల్లలాంటివి ఏర్పాటు చేసి ఆ బల్లల మీద ఈ సంచులను ఉంచి వాటిలోనే వరి నాటి పండిస్తుంది. మిద్దె మీదకు వెళితే దట్టంగా ఎదిగిన వరి కనిపిస్తుంది. '120 రోజుల్లో 45 కిలోల వరి పండిస్తాను' అంటుందామె. మిగిలిన కాలంలో ఆమె తన మిద్దె మీద, కూతురి మిద్దె మీద కూరగాయలు పండిస్తోంది. 'నేను నా చిన్నప్పటి నుంచి పంట చేలలో పని చేశాను. ఆ అనుభవం వృధా పోలేదు. ఇప్పుడు నేను, నా కూతురి కుటుంబం కల్తీ లేని భోజనం చేస్తున్నాం. ఈ కరోనా కాలంలో మేము ఆరోగ్యం గా ఉన్నామంటే మేము పండించుకునేది తినడం వల్లే' అంటోందామె. మట్టి, కలప రజను, పేడను సమ పాళ్లలో కలిపిన మిశ్రమాన్ని ఆమె వరి పండించడానికి వాడుతుంది. పంటకు తేమ పోకుండా ఉండటానికి రోజుకి రెండుసార్లు నీరు స్ప్రే చేస్తుంది. మూడు నాలుగు రోజులకు ఒకసారి వేప నూనెను క్రిమి సంహారకంగా ఉపయోగిస్తుంది. 'మా బియ్యం ఎవరికీ అమ్మం. కాని ఒక కేజీ రెండు కేజీలైనా ఇమ్మని వారూ వీరూ అడుగుతుంటారు. ఒక్కోసారి ఇస్తాం' అంటుందామె గర్వంగా. సుగంధాదేవికి ఇటీవలే ఆమె ఊరి పంచాయతీ 'ఉత్తమ రైతు' పురస్కారం ఇచ్చింది. ఒకప్పుడు వడియాలు, బట్టలు ఆరేసుకోవడానికి మాత్రమే టెర్రస్‌ను ఉపయోగించే మహిళలు ఇవాళ ఆ చోటును ఆకుపచ్చగా మారుస్తున్నారు. వరినే మిద్దెకు ఎక్కిస్తున్నారు. శభాష్.

# నాగరత్నమ్మ వయసు 62.. పర్వతారోహణ.. ఉన్నతమైన కల






'కల ఉంటే చాలు అదే వయసును తగ్గిస్తుంది. లక్ష్యం వైపు అడుగులు వేయిస్తుంది' అనడానికి నాగరత్నమ్మ అతి పెద్ద ఉదాహరణగా నిలుస్తున్నారు. బెంగుళూరులో ఉంటున్న నాగరత్నమ్మ వయసు 62. గృహిణిగా బాధ్యతలు తీరి, విశ్రాంతి తీసుకుంటున్న వయసు. కానీ, పశ్చిమ కనుమల్లో ఎత్తైన, అత్యంత కష్టతరమైన పర్వతాన్ని.. అదీ చీరకట్టుతో అధిరోహించి, అందరి దృష్టిని ఆకట్టుకున్నారామె. సంకల్పం ఉంటే వయసు కేవలం ఒక అంకె మాత్రమే అని చాటుతున్నారు. ఇంటి గడప దాటి ఎన్నడూ పర్యటనలు కూడా చేయలేదనే నాగరత్నమ్మను 'ఈ వయసులో టీవీ చూస్తూ, మనవలు- మనవరాండ్రతో కాలక్షేపం చేయకుండా ఏంటీ సాహసం' అని తెలిసినవాళ్లు, తెలియనివాళ్లూ అడుగుతుంటే హాయిగా నవ్వేస్తుంది. ఆ తర్వాత తాను ఎందుకు ఈ సాహసానికి పూనుకున్నదో వివరిస్తుంది.

### ఏళ్ల నాటి తపన

పర్వతాలను అధిరోహించాలని తనకు ఇరవై ఏళ్ల వయసున్నప్పుడే కలగన్నదట నాగరత్నమ్మ. కానీ, పెళ్లి, పిల్లలు, కుటుంబ బాధ్యతల నడుమ ఆ కల కళ్ల వెనకే దాగిపోయిందని చెబుతుంది. "కాలప్రవాహంలో నాలుగు దశాబ్దాలు దాటిపోయాయి. పిల్లలు వారి జీవితాల్లో స్థిరపడ్డారు. బాధ్యతలేవీ లేకపోవడంతో నా కల ముందుకు వచ్చింది. మా అబ్బాయితో చెప్పాను. ముందు సంశయించాడు. 'ఈ వయసులో పర్వతారోహణ.. అంటే మోకాళ్ల నొప్పులు వస్తాయి, భరించలేవు' అన్నాడు. 'నా కల నాలో ఉత్సాహాన్ని, శక్తిని పెంచుతుంది. నేనిలా పర్వతారోహణ చేయడం నా వయసు వాళ్లకు స్ఫూర్తిదాయకంగా ఉంటుంది, కాదనకు' అని చెప్పాను. అలా 40 ఏళ్ల తర్వాత నా కల నెరవేర్చుకోవడానికి మా అబ్బాయి, అతని మిత్రులతో కలిసి పశ్చిమ కనుమలకు చేరుకున్నాను. ఒకవిధంగా చెప్పాలంటే ఇది నా జీవితంలో మొదటి పర్యటన కూడా. అగస్త్య ఆర్కూడమ్ పర్వతం ఎత్తు 6000 అడుగుల పైమాటే. అంత ఎత్తున్న పర్వతాన్ని చీరకట్టుతో అధిరోహించడం అసాధ్యం అన్నారు. సాధ్యమే అని మొదలుపెట్టాను. శిఖరాగ్రాన్ని చేరుకున్నాక కలిగిన ఆనందాన్ని మాటల్లో చెప్పలేను" అంటారు నాగరత్నమ్మ. ఆమె చేసిన ట్రెక్కింగ్‌కి ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో ప్రశంసల జల్లు కురుస్తోంది. సాహసం నాగరత్నమ్మ వయసును తగ్గించింది. ఇప్పుడీ పర్వతారోహణ ఆమెలో మరింత శక్తిని నింపింది. దీంతో 'మరిన్ని పర్వతారోహణలు చేసి, నా కలను సుసంపన్నం చేసుకుంటాను' అంటూ తన లక్ష్యాన్ని వివరించే నాగరత్నమ్మను తప్పక అభినందించాల్సిందే! ఒకవిధంగా చెప్పాలంటే ఇది నా జీవితంలో మొదటి పర్యటన కూడా. అగస్త్య ఆర్కూడమ్ పర్వతం ఎత్తు 6000 అడుగుల పైమాటే. అంత ఎత్తున్న పర్వతాన్ని చీరకట్టుతో అధిరోహించడం అసాధ్యం అన్నారు. సాధ్యమే అని మొదలుపెట్టాను. శిఖరాగ్రాన్ని చేరుకున్నాక కలిగిన ఆనందాన్ని మాటల్లో చెప్పలేను.

- నాగరత్నమ్మ

# చిలగడ దుంప తినడం ఇష్టమా.. ఈ విషయాలు తెలిస్తే!



ఫిబ్రవరి 22న కుక్ ఎ స్వీట్ పొటాటో డేగా జరుపుకుంటారు. ఓహో.. ఇదో రోజు కూడా ఉందా అని అనుకుంటున్నారా? ఎస్ ఉంది. మరి వెల్.. రూట్ వెజిటబుల్ గా చెప్పుకునే ఈ చిలగడ దుంపకు పెద్ద చరిత్రే ఉంది. వేల ఏళ్ల క్రితమే ఉనికిలో ఉన్న స్వీట్ పొటాటో మధుమేహంతో బాధపడేవారికి ఒక వరం లాంటిదట. చిలగడదుంప వల్ల అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలున్నాయి. మధ్య అమెరికా లేదా దక్షిణ అమెరికాలో చిలగడ దుంప లేదా స్వీట్ పొటాటో పుట్టిందని భావిస్తున్నారు. ఇవ ఇతర దుంపల కంటే చాలా ఆరోగ్యకరమైనవట. విటమిన్ ఏ పుష్కలంగా లభించే ఈ చిలగడదుంపల్లో విటమిన్ %దీ%-6, మెగ్నీషియం, విటమిన్ సీతోపాటు, అధిక ఫైబర్, తక్కువ కొవ్వు , కేలరీలతో నిండి ఉంటుంది. ఇందులో ఉండే ఫైబ్రినోజేన్ కూడా రక్త గడ్డకట్ట కుండా సహాయపడుతుంది. అలాగే ఈ దుంపలలోని అధిక స్థాయి పొటాషియం హార్ట్ బీట్‌ను క్రమబద్ధీకరిస్తుంది. ఇందులో ఉండే మెగ్నీషియం ఆరోగ్యకరమైన ధమనులకు, గుండె కండరాలకు చాలా మంచిది. చిలగడ దుంపలు మన శరీరంలోని అంతర్గత అవయవాలకు ఆక్సిడేటివ్ ప్రమాదాన్ని తగ్గించే స్పోరామిన్స్ను ఉత్పత్తిచేసే ప్రత్యేక లక్షణాన్ని కలిగి ఉన్నాయి. అలాగే శక్తివంతమైన యాంటీ-ఇన్ఫ్లమేటరరీ, యాన్తోసయానిన్ కూడా లభ్యం. ఇది ఇన్ఫ్లమేషన్ ను తగ్గించి, దానివల్ల వచ్చే ప్రమాదాన్ని నివారిస్తుంది. ఇందులో అధికంగా ఉండే కెరోటినాయిడ్స్, బీటా-కెరోటిన్, శరీరంలో విటమిన్‌ని తయారుచేయడానికి సహాయపడతాయి. ఇది కంటిచూపును మెరుగుపరుస్తుంది. రోగనిరోధక శక్తిని పెంచి, మన బాడీలోని ఫ్రీ రాడికల్స్ను తగ్గించి, తద్వారా వృద్ధాప్య సంకేతాలను తగ్గిస్తుంది కూడా. విటమిన్ అధికంగా అతికొద్ది ఆహారాల్లో చిలగడ దుంప ఒకటి. సన్ షైన్ విటమిన్‌గా చెప్పుకునే విటమిన్ డీ చిలగడ దుంపలలో తక్షణమే అందుబాటులో ఉంటుంది. చిలగడ దుంపలను ఆహారంలో చేర్చుకోవడం వల్లన చర్మం మెరుస్తుంది. నల్ల మచ్చలను తొలగిస్తుంది. ఇంకొక ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే మధుమేహం కలవారు మామూలు దుంపలు తీసుకోవడానికి బదులుగా ఈ చిలగడ దుంపలను తీసుకోవడం మంచిది. గ్లైసీమిక్ ఇండెక్స్ తక్కువగా ఉండడం వల్ల అది మధుమేహ నియంత్రణకు తోడ్పడుతుందని డైటీషియన్స్ చెబుతున్నారు. చిలగడ దుంపల్లో ఉండే అధిక కార్బోహైడ్రేట్‌లకు రక్తంలో చక్కెర స్థాయిలను పెంచే లక్షణం ఉన్నప్పటికీ ఫైబర్ కంటెంట్ ఈ ప్రక్రియను నెమ్మదిస్తుందని నిపుణులు చెబుతున్న మాట. ఆంథోసైనిన్స్ అనే పాలీఫెనోలిక్ సమ్మేళనం ఇన్సులిన్‌ను నియంత్రిస్తుంది. టైప్-2 డయాబెటిస్ ప్రమాదాన్ని తగిస్తుందని అధ్యయనాలు సూచిస్తున్నాయి. మితంగా తింటే, అన్ని రకాల చిలగడదుంపలు ఆరోగ్యకరమేననీ, వీటిల్లో యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు, మినరల్స్ చాలా ఎక్కువ గనుక డయాబెటిస్-ఫ్రెండ్లీ డైట్‌లో చేర్చు కోవచ్చని చెబుతున్నారు.

# మహిళా రిజర్వేషన్ బిల్లుపై మోడీ కపట నాటకం

## సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు విమర్శ

**విశాఖపట్టణం,ఏప్రిల్13(ఆర్ఎన్ఎ):** మహిళా రిజర్వేషన్ బిల్లుపై మోడీ ప్రభుత్వం కపట నాటకం ఆడుతుందని సిపిఎం నేతలు మండిపడ్డారు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న ఐదు రాష్ట్రాల ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ చర్చ చేస్తుందని ఆగ్రహించారు. 2023లోనే చట్టం అయినప్పుడే 2011 జనాభా లెక్కల ఆధారంగా చట్టాన్ని అమలు చేయాలని సిపిఎం కోరిందని తెలిపారు. అప్పుడు డిలిమిటేషన్, సీట్ల పెంపుదల, సెన్సస్ అయిన తరువాత అమలు చేస్తామని కేంద్ర ప్రభుత్వం మాయమాటలు చెప్పిందని తెలిపారు. కానీ ఇప్పుడు అవేమి జరగకపోయినా మహిళా రిజర్వేషన్ బిల్లుపై చర్చ కోసం 3రోజుల పాటు ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారని ఆగ్రహించారు. బిల్లుకి మద్దతు ఇవ్వాలని ప్రధాని మోడీ రాజకీయ పార్టీల ఫ్లోర్ లీడర్లకు లేఖ రాయడం నాటమని తెలిపారు. రాష్ట్రాల ప్రతినిధుల అభిప్రాయాలను తెలుసుకోకుండా, కేంద్రం నిర్ణయాలను అమలు చేయాలని ఏకపక్ష వైఖరిని ఖండిస్తున్నట్లు తెలిపారు. డిలిమిటేషన్ ను జనాభా ప్రాతిపదికన కాకుండా సీట్ల పెంపుదలను బట్టి అమలు చేయాలని అనేక రాష్ట్రాలు ప్రతిపాదించాయని తెలిపారు. డిలిమిటేషన్ తో సంబంధం తేకుండా మహిళా రిజర్వేషన్ బిల్లును అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కేంద్ర కమిటీ సభ్యులు లోకనాథం పాల్గొన్నారు.

# వివోల వేతన బకాయిలు చెల్లించాలి

## సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన



**కర్నూలు, ఏప్రిల్ 13 (ఆర్ఎన్ఎ):** వివోఏలకు మూడు నెలల వేతన బకాయిలు కనీస వేతనాలు చెల్లించాలని హెచ్ఆర్ పాలసీని అమలు చేయాలని, శ్రీనిధి బకాయల చెల్లింపు సెల్ ఫోన్స్ గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని అభయహస్తం మహిళా మార్ట్ లో పెట్టిన పెట్టుబడులు పొదుపు మహిళలకు తిరిగి చెల్లించాలని వడ్డీ రాయితీ ఇవ్వాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం నందికొట్కూరు తాసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమానికి వివోఏల సంఘం నాయకులు పుల్లం రాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ కార్యదర్శి టి గోపాలకృష్ణ మాట్లాడుతూ వెలుగు వివోఏలకు కనీస వేతనాలు చెల్లించాలని అన్నారు రాష్ట్రంలో 28,000 మంది వీవోఏలు పొదుపు సంఘాలు మహిళలకు దీర్ఘకాలంగా సేవలందిస్తున్నారు. కనీస వేతనం ఉద్యోగ భద్రత కోసం మొబైల్ సిమ్ కార్డ్స్ గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం తదితర డిమాండ్ల సాధనకై ఆందోళనలు పోరాటాలు నిర్వహించాలని అన్నారు. వేతనాలు పెరిగి ఏడు సంవత్సరాలయింది పెరుగుతున్న ధరలకు అనుకూలంగా వేతనాలు పెంచాలన్నారు. తక్షణమే వివో ఏ లకు మూడు నెలల వేతన బకాయిలు కనీస వేతనాలు చెల్లించాలన్నారు. లేని పక్షంలో సీఐటీయూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని తాసిల్దారు శ్రీనివాసులు గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో వివోఏలు. మహేశ్వరమ్మ. సతీష్. నాగరాజు. ఆదం. లక్ష్మి. మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

# స్వర్ణ నారావారిపల్లె అభివృద్ధి నమూనాలో స్వర్ణ చంద్రగిరి

## వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం... యూరియా వినియోగాన్ని తగ్గిస్తూ ప్రకృతి వ్యవసాయంపై ప్రోత్సాహం

## మత్స్యకారులకు జీవనోపాధి కోసం చంద్రగిరి పరిధి చెరువుల అభివృద్ధి... అధికారులతో సమీక్షలో కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ ఆదేశం



**తిరుపతి,ఏప్రిల్13(ఆర్ఎన్ఎ):** స్వర్ణ నారావారిపల్లె అభివృద్ధి నమూనాను ఆదర్శంగా తీసుకొని, స్వర్ణ చంద్రగిరి ప్రాంతాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయడానికి జిల్లా అధికారులు ప్రణాళికాబద్ధంగా త్వరితగతిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో, స్వర్ణ చంద్రగిరి అభివృద్ధి అంశంపై తిరుపతి ఆర్డీవో రామ్మోహన్, స్వర్ణ చంద్రగిరి ప్రత్యేక అధికారి మరియు జిల్లా పంచాయతీ అధికారి సుశీల దేవి,ఇతర శాఖల అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ నూతన పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. యూరియా వినియోగాన్ని తగ్గిస్తూ ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని, చిరుధాన్యాల సాగుపై రైతులను ఆకర్షిస్తూ పీఎండీఎస్ కిట్లను అందించాలని తెలిపారు. రైతుల ఆదాయాన్ని పెంచేందుకు పాల ఉత్పత్తి అభివృద్ధి, రైతు బజార్ల ఏర్పాటు వంటి చర్యలు చేపట్టాలని అన్నారు. ఉద్యానవన రంగంలో మామిడి తోటల అభివృద్ధికి మ్యాంగో ఫ్రూట్ కవర్ల వినియోగంపై అవగాహన కల్పించాలని సూచించారు. చంద్రగిరి పరిధిలోని చెరువులను గుర్తించి, మత్స్యకారులకు జీవనోపాధి కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యా రంగంలో డిజిటల్ ఎడ్యుకేషన్‌ను బలోపేతం చేయాలని, పాఠశాలలలో పెండింగ్ లో పనులను సమర్థవంతంగా అమలు చేయాలని, 'మనబడి ? మన భవిష్యత్తు' కార్యక్రమం కింద పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రణాళికను పటిష్ఠంగా అమలు చేయాలన్నారు. సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడం, ఇంప్రూవ్‌మెంట్ ప్యానెల్‌లు ఏర్పాటు చేయడం, విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు, యోగా తరగతులు నిర్వహించడం వంటి చర్యలు చేపట్టాలని తెలిపారు. స్వర్ణ చంద్రగిరిలో ప్రతి ఇంటికి రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థలు ఏర్పాటు చేయాలని, అర్హులైన వారికి గృహాలు మంజూరు చేయాలని సూచించారు. జల జీవన్ మిషన్ కింద ప్రతి ఇంటికి తాగునీటి కనెక్షన్ అందించాల్సిందిగా చెప్పారు. పశు వైద్య అధికారులు పశువులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు అందజేశారు. గేదెలు, ఎద్దులు, మేకలు, గొర్రెలకు వ్యాధి నిరోధక టీకాలు వేయడం జరిగింది. అలాగే కీటకనాశన మందులు పంపిణీ చేసి పశువులను వ్యాధుల నుండి రక్షించే చర్యలు చేపట్టాలన్నారు.పశుసంవర్ధక శాఖ ద్వారా అందిస్తున్న పథకాలు, సబ్సిడీలు, బీమా సదుపాయాలపై రైతులకు వివరాలు తెలియ చేయాలన్నారు. ఆధునిక పద్ధతుల్లో పశుపోషణ చేయడం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని సూచించారు. శిబిరంలో పాల్గొన్న రైతులు పశువుల సంరక్షణకు సంబంధించిన సందేహాలను నిపుణులను అడిగి నివృత్తి చేసుకున్నారు. ఈ శిబిరం ద్వారా పశువుల ఆరోగ్య పరిస్థితి మెరుగుపడటంతో పాటు రైతులకు ఉపయోగకరమైన సమాచారం అందించాలని తెలిపారు. సంజీవని ప్రాజెక్టుకు సంబంధించిన ప్రతిపాదనలు పంపాలని, ఏబిహెచ్ఏ నమోదును 100శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల భవనాల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, పోషణ్ 2.0 పథకంపై అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల ద్వారా యువతకు శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. ఎంపీడీవోలు యూన్గి÷డ్ ఫ్యామిలీ సర్వేను పూర్తి చేయాలని, ప్రతి ఒక్కరికీ ఆధార్, జనన ధృవపత్రాలు అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. ఎన్ఆర్ఈజీఎస్ కింద స్వర్ణ చంద్రగిరి అభివృద్ధికి సంబంధించిన పనులను పూర్తి చేయాలని, జిల్లా అధికారులు అందరూ సమన్వయంతో పనిచేసి అభివృద్ధి సాధించేందుకు కృషి చేయాలని తెలిపారు. అన్ని శాఖ ల వారు అందరూ సమన్వయంతో వారికి కేటాయించిన విధులను నిర్దేశిరచిన సమయంలోపల పూర్తి చేయాలని సూచించారు. అనంతరం భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో నారీ శక్తి వందన సమ్మేళనానికి సంబంధించిన గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారు ప్రసంగిస్తున్న సందేశాన్ని వర్చువల్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. సమావేశంలో డి ఈ ఓ కుమార్, సి పి ఓ రాజశేఖర్, ద్వామా పి డి శ్రీనివాసరావు, డి ఆర్ డి ఏ పి డి శోభన్ బాబు, డి ఎమ్ అండ్ హెచ్ ఓ బాలకృష్ణ నాయక్,వ్యవసాయ శాఖ అధికారి ప్రసాద రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, మండల అధికారులు పాల్గొన్నారు.

# మత్తు రహిత భారత్ ని నిర్మిద్దాం

**చైల్డ్ ప్రొటెక్షన్ ప్రతినిధి బాయికాడి లక్ష్మణ్**



**సిద్దిపేట ఏప్రిల్ 13 నేటి మనదేశమ్ ప్రతినిధి :** సిద్దిపేట జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ ,బాలల పరిరక్షణ విభాగం (చైల్డ్ హెల్ప్ లైన్ ) ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా దుబ్బాక మండలం పెద్దగుండవెల్లి గ్రామంలో మత్తు రహిత సమాజం కోసం అనే కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిద్దిపేట జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ప్రతినిధి బాయికాడి లక్ష్మణ్ మాట్లాడుతూ నేడు సమాజంలోమాదక ద్రవ్యాలు డ్రగ్స్ అత్యంత ప్రమాదకరంగా మారాయని, వీటి బారిన యువత పడడం ఆందోళన చెందాల్సిన విషయమన్నారు. సుమారుగా 30 శాతం యువత వీటి బారిన పడి నిర్వీర్యమైతున్నారని అన్నారు. మద్యపానం, పొగాకు, వైట్నర్, ట్యూబ్ సొల్యూషన్ ఇలాంటి రూపంలోసమాజం లోని అన్ని వర్గాల ప్రజలను పీడిస్తున్న సామాజిక సమస్య ఈ మారకద్రవ్యం అన్నారు. ఈ డ్రగ్స్ బారిన పడిన వాళ్ళు ఆరోగ్య సమస్యలు బుద్ధి మందగించడం, చూపు, వినికిడి, ఊపిరితిత్తులు కాలేయం క్యాన్సర్ బారిన పడడం మాణిక్ మానసిక సమస్యలు నియంత్రణ కోల్పోవడం లాంటి సమస్యలు ఎదురవుతున్నాయని, సమాజంలో హింస అశాంతి ఉగ్రవాదం పెరగడానికి అవకాశాలుగా మారుతున్నాయి అని తెలిపారు.. చెడు అలవాట్లకు యువత దూరంగా ఉండాలని అన్నారు. నషా ముక్త భారత్ అనే సంకల్పము తీసుకొని యువత ముందుకు సాగాలన్నారు. కొన్ని విచ్ఛిన్నకర శక్తులు దేశాన్ని సమాజాన్ని చేయాలనే ధోరణి తో ఇలాంటి డ్రగ్స్ వాడుతున్నారు అన్నారు . యువత వారి యొక్క సంతోషాన్ని క్లబ్బుల్లో, పబ్బుల్లో గడపకుండా, దేశ అభివృద్ధిలో దేశ సేవలో సంతోషాన్ని వెతుక్కోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. యువత యొక్క విజ్ఞానము తెలివితేటలు, చదువు, సంస్కారం, వ్యక్తిగత స్వార్థం కాకుండా కుటుంబం సమాజం దేశం కోసం ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు."నేను, నా ఆరోగ్యం, నా కుటుంబం, నా సమాజం కోసం డ్రగ్స్‌ను ఎప్పటికీ వాడననీ డ్రగ్స్ వల్ల కలిగే హానులను తెలుసుకొని, వాటి నుండి దూరంగా ఉంటానని ఇతరులను కూడా డ్రగ్స్ వాడకానికి ప్రోత్సహించను, అడ్డుకుంటానని స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన జీవితం గడపడానికి కట్టుబడి ఉంటాను.మన సమాజాన్ని డ్రగ్స్ రహితంగా మార్చేందుకు నా వంతు కృషి చేస్తానని ప్రతిజ్ఞ చేయడం జారింది గ్రామ సర్పంచ్ గుండెల వజ్రవ్వ రాజు మాట్లాడుతూ యువతచిన్న చిన్న విషయాలకే ఆత్మ హత్యలు చేసుకుంటున్నారని ఆత్మ హత్యలు విడనాడి ఆత్మ విశ్వాసం తో గొప్ప వ్యక్తులను వారి జీవితాలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని అన్నారు .ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి మురళి వార్డు సభ్యులు,అంగన్వాడీ టీచర్లు ఆశా వర్కర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు

# ప్రజావాణి ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

**పలు సమస్యలపై వినతులు స్వీకరించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్**

**ప్రజావాణి ఫిర్యాదుల సంఖ్య 63**



**జగిత్యాల, ఏప్రిల్ 13(నేటి మన దేశమ్ ప్రతినిధి)::**ప్రజావాణి అర్జీల పై సమగ్ర విచారణ జరిపి సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ అదేశించారు.సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను అదనపుకలెక్టర్ ఆర్డీఓలతో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ పలు సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని పలు మండలాల నుండి ప్రజలు సమస్యలు విన్నవించుకోడానికి ప్రజావాణికి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పై సమగ్ర విచారణ చేపట్టి పరిష్కారానికి చొరవ చూపాలని అన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాగా సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 63 ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.అనంతరం 8వ పోషణ్ పక్ వాడ పోస్టర్ ఆవిష్కరించారు.ప్రధాన మంత్రి ఇంటర్న్ షిప్ పథకం పోస్టర్ ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ బి.ఎస్.లత,స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.రాజ గౌడ్, జగిత్యాల, కోరుట్ల, ఆర్డీవోలు మధు సూదన్, జీవాకర్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సాయి అపార్ట్ మెంట్ లో తాళం వేసిన ఇంట్లో భారీ చోరీ



**కామారెడ్డి,ఏప్రిల్ 13.(నేటి మనదేశమ్ ప్రతినిధి)**కామారెడ్డి జిల్లా కేంద్రంలోని విద్యానగర్ కాలనీ జన్మభూమి రోడ్డులో ఉన్న శ్రీ సాయి అపార్ట్ మెంట్ లో తాళం వేసిన ఇంట్లో భారీ చోరీ జరిగింది. వివరాలిలా ఉన్నాయి. అపార్ట్ మెంట్ లో నివాసం ఉండే బాలకృష్ణ రాజంపేట ఎంపీడీవోగా పనిచేస్తున్నారు. బాలకృష్ణ తన కుటుంబంతో కలిసి ఆస్పత్రి పనిమీద ఫ్లాట్ కు తాళం వేసి శనివారం హైదరాబాద్ వెళ్లారు. అదే రోజు రాత్రి దొంగలు తాళం పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. దీనిని గమనించిన అపార్ట్మెంట్ వాచ్మెన్ బాలకృష్ణకు సమాచారం ఇచ్చారు. వారు హుటాయుటముగా హైదరాబాద్ నుండి బయలుదేరి కామారెడ్డి చేరుకోవడం జరిగింది. ఆపాటికి పట్టణ పోలీసులు ఘటనా స్థలాన్ని చేరుకొని పరిశీలించి విచారణ జరిపారు. శుభకార్యాల సీజన్ కావడంతో బంగారు ఆభరణాలను ఇంట్లోనే ఉంచుకున్నట్లు తెలుస్తోంది. 35 నుండి 40 తులాల బంగారం, 8 కిలోల నుండి పది కిలోల వరకు వెండి, రూ.లక్ష నగదు చోరీకి గురైనట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్లూస్ టీం బృందాలు వివరాలు సేకరించాయి. పోలీసులు అపార్ట్మెంట్, పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పట్టణ సీఐ నరహరి తెలిపారు. బాధితుడు బాలకృష్ణ ఇది నేను జీవితాంతం సంపాదించిన సొమ్ము కాబట్టి పోలీసులు దొంగలను పట్టుకొని సొమ్మును రికవరీ చేయించి ఇవ్వాలని కన్నీళ్లపై పర్యంతమై వేడుకున్నాడు.

# అన్ని వర్గాల ప్రజల కృషితోనే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యం

**జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్**

**ట్రాఫిక్ నియమాలు పాటిద్దాం... రోడ్డు ప్రమాదాలు నివారిద్దాం**

**జిల్లా ఎస్పీ అశోక్ కుమార్**




**జగిత్యాల,ఏప్రిల్ 13(నేటి మన దేశమ్ ప్రతినిధి)::**అన్ని వర్గాల ప్రజల కృషితోనే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యం అని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా రోడ్డు ప్రమాదాలను నియంత్రించడం, ప్రజల్లో ట్రాఫిక్ నియమాల పట్ల బాధ్యతాభావం పెంపొందించడం లక్ష్యంగా అరైవ్ అలైవ్‌కార్యక్రమాన్ని ఏప్రిల్ 13 నుండి 18 వరకు జిల్లావ్యాప్తంగా విస్తృతంగా నిర్వహిస్తున్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా సోమవారం జగిత్యాల పట్టణంలోని ఓల్డ్ బస్ స్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తో కలిసి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ కోసం పోలీస్ శాఖ చేపడుతున్న అరైవ్ అలైవ్ కార్యక్రమం ప్రశంసనీయమని తెలిపారు. వాహనదారులు జాగ్రత్తగా, నియమ నిబంధనలు పాటిస్తూ ప్రయాణిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని అన్నారు.రోడ్డు భద్రత ఒక్క పోలీస్ శాఖ బాధ్యత కాకుండా ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని స్పష్టం చేశారు. "వేగం ప్రాణం తీస్తుంది" అనే విషయాన్ని గుర్తుంచుకుని అధిక వేగంతో ప్రయాణించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లలకు హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించాలని కోరారు.ఆనంతరంఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూప్రస్తుత కాలంలో ఇతర ప్రమాదాల కంటే రోడ్డు ప్రమాదాల వల్లనే ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదాలను గణనీయంగా తగ్గించేందుకు గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు రోడ్డు భద్రతా వ్యవస్థలను బలోపేతం చేయడం, ప్రజల్లో డిఫెన్సివ్ డ్రైవింగ్ సంస్కృతిని పెంపొందించడంఅరైవ్ అలైవ్ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు.రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలు అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగం, ట్రాఫిక్ నియమాలను పాటించకపోవడం వంటి అంశాలేనని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వాహనం నడిపి, తమతో పాటు ఇతరుల ప్రాణాలను కాపాడాలని పిలుపునిచ్చారు. చిన్న నిర్లక్ష్యాలే పెద్ద ప్రమాదాలకు దారితీస్తాయని, అలాంటి సంఘటనలు కుటుంబాలకు తీరని నష్టాన్ని కలిగిస్తాయని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, డీఎస్పీ రఘు చందర్, ఆర్టీఓ శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, ఇన్స్పెక్టర్లు కరుణాకర్, ఎస్.ఐలు, మున్సిపల్ కౌన్సిలర్లు, సుమారు 300 మంది విద్యార్థులు, ప్రజలు ఉత్సాహంగా పాల్గొని రోడ్డు భద్రతపై అవగాహన పొందారు.


# ముదిగొండలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి: రైతుల వినతి



**మధిర ప్రతినిధి/ ముదిగొండ, ఏప్రిల్ 13, నేటి మన దేశమ్** ముదిగొండ మండల కేంద్రంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని తక్షణమే ఏర్పాటు చేయాలని కోరుతూ రైతులు సోమవారం సొసైటీ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. సిపిఎం మండల కార్యదర్శి భట్టు పురుషోత్తం నాయకత్వంలో రైతులు కలిసి సొసైటీ ఇన్చార్జ్ కార్యదర్శి ప్రసాద్‌కు ఈ వినతిపత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ కట్టకూరు ఉపేందర్, మాజీ వైస్ ఎంపీపీ మంకిన దామోదర్ మాట్లాడుతూ, రైతులు పండించిన మొక్కజొన్న పంటకు సరైన ధర అందడం లేదని, వెంటనే కొనుగోలు కేంద్రం ప్రారంభించాలని కోరారు. కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తే రైతులకు పెద్ద ఎత్తున ఉపశమనం కలుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో రైతులు రామయ్య, రమేష్, నరేష్, సతీష్, ఉపేందర్, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

# నేరాల నియంత్రణ, కేసుల ఛేదనలో సీసీ కెమెరాల పాత్ర కీలకం

**జిల్లా ఎస్పీ అశోక్ కుమార్**



**జగిత్యాల, ఏప్రిల్ 13(నేటి మన దేశమ్ ప్రతినిధి)::**నేరాల నియంత్రణ, కేసుల ఛేదనలో సీసీ కెమెరాల పాత్ర కీలకం అని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు.ఆధునిక యుగంలో నేరాల నియంత్రణ, కేసుల ఛేదన, ప్రజా భద్రత పరిరక్షణలో సీసీ కెమెరాల వినియోగం అత్యంత కీలకంగా మారిన నేపథ్యంలో, కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా జగిత్యాల పట్టణంలో ఏర్పాటు చేసిన 150 సీసీ కెమెరాలను సోమవారం జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ లతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ "ప్రజల రక్షణకు, నేరాల అరికట్టడానికి సీసీ కెమెరాలు అమూల్యమైన సాధనాలు. ప్రతి వీధి, ప్రతి మూలలో కెమెరాలు అమర్చడం వలన నేరం జరిగిన వెంటనే గుర్తించడం, నిందితులను పట్టుకోవడం చాలా వేగంగా జరుగుతోంది. సీసీ కెమెరాలు లేకపోతే కేసుల ఛేదనలో ఆలస్యం జరిగేది, కానీ ఇప్పుడు వాటి సహాయంతో విచారణ వేగవంతమైంది" అని తెలిపారు.దొంగతనాలు, చోరీలు, గొడవలు, రోడ్డు ప్రమాదాలు వంటి ఘటనల్లో నిందితుల కదలికలు సీసీ కెమెరాల్లో రికార్డ్ అవడంతో పోలీసులు తక్షణమే స్పందించి అరెస్టులు చేయగలిగిన అనేక ఉదాహరణలు ఉన్నాయని వివరించారు.ఆనంతరంజిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ మాట్లాడుతూ "సీసీ కెమెరాలు పోలీసుల మూడో నేత్రం లాంటివి. ఇవి నేరాలు జరగకుండా ముందుగానే హెచ్చరికగా పనిచేస్తాయిని, కెమెరాలు ఉన్నాయన్న భయం నేరస్థుల్లో ఉంటుందని తెలిపారు. ప్రజలు తమ ఇళ్లకు, వ్యాపార సంస్థలకు, అపార్ట్‌మెంట్లకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.ప్రత్యేకంగా ప్రధాన రహదారులు, క్రాస్ రోడ్లు, బిజీ సెంటర్లు, మార్కెట్ ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరి అవసరమని పేర్కొన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా వ్యక్తిగత భద్రతతో పాటు సమాజ భద్రత కూడా బలోపేతం అవుతుందని తెలిపారు.సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన స్థానిక కళాశాలలు, పాఠశాల యాజమాన్యాలు, వ్యాపారవేత్తలు మరియు ఇతర సంస్థల ప్రతినిధులను జిల్లా ఎస్పీ అభినందించారు. ప్రజల సహకారం లేకుండా ఇలాంటి కార్యక్రమాలు విజయవంతం కావడం కష్టమని, ఇదే స్ఫూర్తితో ఇతర ప్రాంతాల ప్రజలు కూడా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో మధుసూదన్, డీఎస్పీ రఘు చందర్,మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, ఇన్స్పెక్టర్లు కరుణాకర్, ఎస్.ఐలు, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## తల్లిని నిరాదరిస్తున్న ఉపాధ్యాయుడిపై

# కలెక్టర్ కు ఫిర్యాదు..



**జగిత్యాల ఏప్రిల్ 13(నేటి మన దేశమ్ ప్రతినిధి):**జగిత్యాల పట్టణానికి చెందిన మాదారపు కనుకమ్మ (73)అనే పక్షవాతంతో భాద పడుతున్న వృద్ధురాలు జిల్లా సీనియర్ సిటిజెన్స్ అధ్యక్షులు హరి అశోక్ కుమార్ సాయంతో సోమవారం ప్రజావాణి లో కలెక్టర్ కు ఫిర్యాదు చేసింది. ఆ ఫిర్యాదు లో వివరాలు విలేకరులకు రోదిస్తూ తెలిపింది.ఇంటి నుంచి గెంటి వేయగా హనుమాన్ వాడ ఓ రేకుల షెడ్డులో తన పెళ్లి కాని కూతురుతో దుర్భర స్థితి లో జీవిస్తున్నానని,మేడి పల్లి మండలం దమ్మన్న పేట ప్రభుత్వ స్కూల్ లో హెడ్ మాస్టారు గా పనిచేస్తున్న నా కొడుకు మాదారపు గంగాదర్ వేతనం నుంచి 15శాతం డబ్బులు ప్రతి నెల తన బ్యాంకు ఖాతా లో జమచేయించాలని, తన వద్ద నుండి తీసుకున్న రూ. 10లక్షలు, 15తులాల బంగారం ఇప్పించాలని, నివా స వసతి కల్పించాలని కలెక్టర్ ను కోరింది. వృద్ధురాలి వెంట ఆమె కూతురు శాంత,సీనియర్ సిటిజెన్స్ జిల్లా అధ్యక్షులు, న్యాయవాది హరి అశోక్ కుమార్, జిల్లా ప్రతినిధులు పి. సి. హన్మంత్ రెడ్డి, గౌరి శెట్టి విశ్వ నాతం, బొల్లం విజయ్ బొబ్బటి కరుణ,ఎం.డి. యాకూబ్ పట్టణ అధ్యక్షులు మానాల కిషన్ తదితరులున్నారు.

# ఎడవల్లిలో వైభవంగా ఇందిరమ్మ ఇంటి ప్రారంభోత్సవం.



**మధిర ప్రతినిధి ముదిగొండ ఏప్రిల్ 13 నేటి మన దేశమ్.** ముదిగొండ మండల పరిధిలోని ఎడవల్లి గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ కార్యక్రమం పండుగలా సాగింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సారథ్యంలో పేదలందరికీ ఇళ్లు కల్పించాలనే లక్ష్యంతో ఈ పథకం కొనసాగుతోంది. ఇందులో భాగంగా గ్రామానికి చెందిన పరికపల్లి పద్మ నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటిని అధికారులు, నాయకులు కలిసి ఘనంగా ప్రారంభించారు.మండల పరిషత్ అభివృద్ధి అధికారి ( ఎంపీడీవో) ప్రభాకర్ రావు ఈ ఇంటిని ప్రారంభించి, లబ్ధిదారులకు శు భాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని పేదలు సద్వినియోగం చేసుకొని సొంత ఇంటి కల నెరవేర్చుకోవాలని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు పసుపులేటి దేవేంద్రం, బీసీ సెల్ అధ్యక్షుడు పల్లిపాటి కృష్ణ, బి బ్లాక్ అధ్యక్షుడు కందిమల్ల వీరబాబు పాల్గొని ప్రభుత్వ పథకాల ఆవశ్యకతను వివరించారు.గ్రామ సర్పంచ్ ఎరకల భారతమ్మ, సెక్రెటరీ కళ్యాణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండల సేవాదళ్ అధ్యక్షుడు జెడ్పీ వినోద్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు మరియు గ్రామ ఇన్‌ఛార్జ్ భూక్య ధర్మానాయక్ పాల్గొన్నారు. లబ్ధిదారుల ముఖాల్లో చిరునవ్వు చూడటమే ఈ పథకం అసలు ఉద్దేశమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందని నాయకులు స్పష్టం చేశారు. కొత్త ఇంట్లోకి ప్రవేశించిన పద్మ కుటుంబ సభ్యులు తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

# దివంగత మాజీ స్పీకర్ శ్రీపాద రావు సేవలు మరువలేనివి..

**రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్..**



ధర్మపురి,ఏప్రిల్ 13(నేటి మన దేశమ్ ప్రతినిధి): దివంగత మాజీ స్పీకర్‌శ్రీపాద రావు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చేసిన సేవలు మరువలేనివని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. శ్రీపాదరావు 27వ వర్ధంతి సందర్భంగా జిల్లాలోని ధర్మపురి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలవేసి మంత్రి లక్ష్మణ్ కుమార్ నివాళ్లులు అర్పించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మారుమూల మంథని ప్రాంతంలోని ధన్వాడ గ్రామంలో జన్మించిన శ్రీపాద రావు ధన్వాడ సర్పంచ్ గా, మంథని సమితి ప్రెసిడెంట్ గా , మంథని ఎమ్మెల్యేగా సేవలు అందించారని మంత్రి అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ స్పీకర్ గా పనిచేసి స్పీకర్ పదవికి వన్నెతెచ్చిన గొప్ప నేత శ్రీపాద రావు అని అన్నారు. చిన్న పెద్ద తేడా లేకుండా అందరితో కలివిడిగా ఉంటూ శ్రీపాద రావు అజాతశత్రువుగా పేరు తెచ్చుకున్నారని మంత్రి అన్నారు. తండ్రికి తగ్గ తనయుడిగా రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు రాజకీయాల్లో రాణిస్తున్నారని అన్నారు. శ్రీపాదరావు వర్ధంతి సందర్భంగా ధర్మపురి ప్రజల పక్షాన వారికి నివాళులు అర్పిస్తున్నట్టు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్ తో ధర్మపురి మున్సిపల్ కౌన్సిలర్లు, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.




# అల్లు వారు అలా అన్నారో లేదో...




టాలీవుడ్ అగ్ర నిర్మాత అల్లు అరవింద్.. డెకాయిట్ సినిమా సక్సెస్ మీట్లో ఈ చిత్ర కథానాయిక మృణాల్ ఠాకూర్‌ను ఉద్దేశించిన చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. గతంలో తాను ఇక్కడి అబ్బాయిని పెళ్లి చేసుకోమని లావణ్య త్రిపాఠికి చెబితే, ఆమె వరుణ్‌తేజ్‌ను పెళ్లాడి హైదరాబాద్‌లో సెటిలైపోయిన విషయాన్ని గుర్తు చేసిన అరవింద్.. మృణాల్ కూడా ఇక్కడి అబ్బాయినే పెళ్లి చేసుకుని ఇక్కడే ఉండిపోవాలని ఆకాంక్షించారు. దీంతో మృణాల్ తెగ సిగ్గుపడిపోయింది. ఆడిటోరియం అంతా నవ్వులతో నిండిపోయింది. ఐతే అరవింద్ ఈ కామెంట్ చేసిన కాసేపటికే సోషల్ మీడియా జనాలు డ్యూటీ ఎక్కేశారు. లావణ్య.. వరుణ్‌తో ప్రేమలో ఉన్న విషయం తెలిసే అరవింద్ అప్పట్లో ఆ కామెంట్ చేశారని, ఇప్పుడు మృణాల్ కూడా ఇక్కడ ఓ అబ్బాయిని చూసుకుంది కాబట్టే ఆయన ఇలా మాట్లాడారని కథలు అల్లేశారు. అంతే కాక ఆ అబ్బాయి ఎవరో కూడా చెప్పేశారు. అక్కినేని ఫ్యామిలీకి చెందిన సుమంత్‌తో మృణాల్ ప్రేమలో ఉన్నట్లుగా పేర్కొంటూ వీళ్లిద్దరూ సన్నిహితంగా ఉన్న ఒక ఫొటోను షేర్ చేస్తున్నారు నెటిజన్లు. సుమంత్, మృణాల్ కలిసి సీతారామం సినిమాలో నటించిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో ఇద్దరూ ఎక్కడో ఒక ఫొటోకు పోజు ఇచ్చారు. ఆర్టిస్టులు కలిసి నటించినపుడు ఇలా ఫొటోలు దిగడంలో ఆశ్చర్యమేమీ లేదు. కానీ సోషల్ మీడియా జనాలు మాత్రం ఇలా ఆలోచించడం లేదు. ఇద్దరికీ లింక్ పెట్టేశారు. కానీ డెకాయిట్ ప్రి రిలీజ్ ఈవెంట్లో మృణాల్.. సుమంత్‌ను అన్నా అని సంబోధించిన విషయాన్ని మరవకూడదు. అన్న అనే పదానికి అర్థం తెలియకుండానే ఆమె అలా అని ఉండదు. సుమంత్‌కు గతంలో హీరోయిన్ కీర్తి రెడ్డితో పెళ్లయింది. కొంత కాలానికే ఇద్దరూ విడిపోయారు. 20 ఏళ్లకు పైగా సుమంత్ సింగిల్‌గానే ఉంటున్నాడు. తనకు మళ్లీ పెళ్లి చేసుకునే ఉద్దేశమే ఉన్నట్లు కనిపించడం లేదు. పైగా సుమంత్‌కు 51 ఏళ్లు వచ్చేశాయి. మృణాల్ కంటే అతను చాలా పెద్దవాడు. వయసు 50 దాటినా, అమ్మాయితో వయసు అంతరం ఉన్నా పెళ్లి చేసుకోవడానికి అవేవీ అడ్డంకులు కాదు కానీ.. సుమంత్, మృణాల్ మధ్య ఎలాంటి వ్యక్తిగత బంధం లేదన్నది క్లియర్‌గా తెలుస్తున్నా.. ఇలా లింక్ పెట్టేయడం విచిత్రం.

## నందమూరి నాలుగో తరం సినిమా ఏమైంది?



టాలీవుడ్లో ఘన చరిత్ర ఉన్న నందమూరి కుటుంబం నుంచి ఇప్పటికే మూడు తరాల హీరోలు వచ్చారు. ఆ ఫ్యామిలీ నుంచి నాలుగో తరం హీరో ఎంట్రీ గురించి రెండేళ్ల ముందే అనౌన్స్‌మెంట్ వచ్చింది. హరికృష్ణ మనవడు, జానకి రామ్ తనయుడు అయిన నందమూరి తారక రామారావు (తన షార్ట్ నేమ్ కూడా ఎన్టీఆర్‌యే)ను సీనియర్ దర్శక నిర్మాత వైవీఎస్ చౌదరి హీరోగా పరిచయం చేయబోతున్నట్లు 2024లో ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆ సినిమా అనౌన్స్‌మెంట్ టైంలో కూడా వైవీఎస్ చాలా హంగామానే చేశారు. హీరో హీరోయిన్లకు సంబంధించి వేర్వేరుగా వీడియోలు రిలీజ్ చేశారు. సినిమా గురించి వరుసగా ప్రెస్ మీట్లు పెట్టి మీడియా దృష్టిని ఆకర్షించడానికి ప్రయత్నించారు. ఇది తెలుగుదనం ఉట్టిపడే సినిమా అని.. తెలుగు భాష, సంస్కృతి గురించి ప్రపంచానికి చెప్పే చిత్రమని ప్రకటించారు. కానీ ప్రారంభానికి ముందు ఇంత హడావుడి చేశారే కానీ.. ఆ తర్వాత సినిమా గురించి సౌండే లేదు. అసలు ఈ సినిమా సెట్స్ మీదికి వెళ్లిందా.. షూటింగ్ జరుగుతోందా.. చిత్రీకరణ ఏ దశలో ఉంది.. విడుదల ఎప్పుడు.. ఇలా ఏ సమాచారం బయటికి రావడం లేదు. ఏడాదిగా ఈ సినిమా అసలు వార్తల్లోనే లేదు. హీరో కొత్త వాడే అయినా.. నందమూరి లాంటి పెద్ద కుటుంబానికి చెందిన కుర్రాడు. కాబట్టి ఆ ఫ్యామిలీ బ్యాకప్ తనకు ఉంటుంది. తన అరంగేట్ర సినిమాను పట్టించుకోకుండా వదిలేసే అవకాశం లేదు. తమ సోదరుడి కొడుకు విషయంలో కళ్యాణ్ రామ్, జూనియర్ ఎన్టీఆర్ కూడా దృష్టిసారిస్తూనే ఉండొచ్చు. అయినా ఈ సినిమా ఊసులేవీ వినిపించకపోవడం ఆశ్చర్యం కలిగించే విషయమే. ఐతే వైవీఎస్ ఒకప్పుడు హరికృష్ణకు పెద్ద బ్రేక్ ఇచ్చి ఉండొచ్చు.. రామ్‌ను హీరోగా నిలబెట్టి ఉండొచ్చు.. కానీ చాలా ఏళ్ల నుంచి ఆయన ఫామ్‌లో లేడు. చివరగా తీసిన రేయ్ సినిమా పరిస్థితి ఏంటో తెలిసిందే. ఇప్పుడున్న ఫామ్‌లో వైవీఎస్ బాక్సాఫీస్ దగ్గర ప్రభావం చూపించగలరా లేదా అనే ఆలోచనలో పడ్డట్టు వార్తలు వస్తున్నాయి. బహుశా ఆ కారణంతోనే సినిమాను హోల్డ్‌లో పెట్టేశారా అనే సందేహాలు కలుగుతున్నాయి. లేని పక్షంలో ఇంత కాలం వైవీఎస్ సైలెంటుగా ఉండే అవకాశం లేదు.

# ప్యారడైజ్ గుమ్మడికాయ... రోమియో కొబ్బరికాయ



మార్చి నుంచి ఆగస్టుకి విడుదల తేదీ వాయిదా వేసుకున్న నాని ది ప్యారడైజ్ ఖచ్చితంగా చెప్పిన డేట్ కి విడుదలవుతుందా లేదానే అనుమానాలు ఇండస్ట్రీలో కొనసాగుతూనే ఉన్నాయి. నిన్న వదిలిన హీరోయిన్ కయదు లోహర్ బర్త్ డే పోస్టర్లో మరోసారి తేదీని స్పష్టంగా పేర్కొన్నారు కానీ కేవలం వీటిని బట్టే మాట మీద ఉంటారన్న గ్యారెంటీ అయితే లేదు. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల, నాని మాత్రం ఎట్టి పరిస్థితుల్లో ఆగస్ట్ 21 వదులుకునేందుకు సిద్ధంగా లేరు. ఇప్పటికైతే ఎలాంటి మార్పు లేదని క్లారిటీ వచ్చింది కాబట్టి అభిమానులు రిలాక్స్ అవ్వొచ్చు. అలాని కన్ఫర్మ్ గా చెప్పలేని పరిస్థితి కూడా గమనించాలి. మళ్ళీ ఏ మాత్రం లేట్ అయినా దాని ప్రభావం నేరుగా బ్లడీ రోమియో మీద పడుతుంది. ఎందుకంటే దర్శకుడు సుజిత్ ఆల్రెడీ స్క్రిప్ట్ సిద్ధం చేసుకుని ఉన్నాడు. క్యాస్టింగ్ కూడా పేపర్ మీద రెడీగా ఉంది కానీ నాని డేట్స్ అందుబాటులోకి వస్తేనే ఇతర ఆర్టిస్టుల కాల్ షీట్స్ తీసుకోవడానికి కుదురుతుంది. లేదంటే వృథా అవుతాయి. ప్యారడైజ్ కోసం జుత్తు గెడ్డం బాగా పెంచేసిన నాని వాటిని ఇప్పట్లో తీసేయలేడు. బ్లడీ రోమియో గ్యాంగ్ స్టర్ డ్రామా కాబట్టి దాని లుక్ పూర్తి డిఫరెంట్ గా ఉంటుంది. శ్రీకాంత్ ఓదెల గుమ్మడికాయ కొట్టేసి పంపిస్తే కానీ సుజిత్ కొబ్బరికాయ కొట్టలేడు. గతంలో అయితే నానికి ఈ సమస్య లేదు. ఒకే లుక్ తో ఒకే టైంలో రెండు సినిమాలు చేసేవాడు. కానీ ఇప్పుడు ప్యాన్ ఇండియా సబ్జెక్టులతో అలా కుదరడం లేదు. మేకోవర్ ప్రతిదానికి వేర్వేరుగా విభిన్నంగా ఉంటున్నాయి. ఒకేసారి వచ్చి క్లాష్ కు సిద్ధపడాలని ముందు అనుకున్న పెద్ది, ప్యారడైజ్ రెండూ ఒకే సమస్యని ఎదురుకుంటూ ఉండటం విచిత్రం. నిర్మాణం, పాటల చిత్రీకరణ, రాజీ లేని దర్శకుల మొండిపట్టు లాంటి కారణాల వల్ల ఫ్యాన్స్, ట్రేడ్ కోరుకున్న డేట్లకు ఇవి రాలేకపోతున్నాయి. నాని ప్యారడైజ్ కోసం ప్రాణాలు పెట్టేస్తున్నాడు. ఇప్పటిదాకా అందని ద్రాక్షలా ఊరిస్తున్న హిందీ మార్కెట్ దీని దెబ్బతో ఎక్కడికో తీసుకెళ్తుందని ధీమాగా ఉన్నాడు. ఫ్యాన్స్ నమ్మకం కూడా అదే.



# బిజినెస్ న్యూస్



## ఓలా నుంచి కొత్త స్కూటర్.. సింగిల్ ఛార్జింగ్‌తో 320 km



ప్రముఖ విద్యుత్ వాహన తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్ కొత్త స్కూటర్‌ను మార్కెట్‌లోకి లాంచ్ చేసింది. సొంతంగా అభివృద్ధి చేసిన 4680 భారత్ సెల్‌తో తయారు చేసిన ఎస్1 ఎక్స్ం 5.2 kWh వేరియంట్‌ను (Ola S1 X+) సోమవారం విడుదల చేసింది. దీని ధరను రూ.1,29,999గా నిర్ణయించింది. ఇన్‌హౌస్‌లో రూపుదిద్దుకున్న సెల్ టెక్నాలజీ సాయంతో తయారు చేసిన స్కూటర్ కావడంతో అందుబాటు ధరలో తేవడం సాధ్యమైందని ఓలా ఎలక్ట్రిక్ ఓ ప్రకటనలో పేర్కొంది. ఏప్రిల్ 15 వరకు ప్రారంభ ధర కింద రూ.1.29 లక్షలకు విక్రయించనున్నట్లు ఓలా తెలిపింది. ఇందులో 11kW మిడ్ డ్రైవ్ మోటార్‌ను అమర్చినట్లు వెల్లడించింది. సింగిల్ ఛార్జింగ్‌తో 320 కిలోమీటర్లు (IDC రేంజ్) ప్రయాణించొచ్చని పేర్కొంది. ఈ స్కూటర్ టాప్ స్పీడ్ గంటకు 125 కిలోమీటర్లు. బ్రేకింగ్ సామర్థ్యాన్ని మరింత మెరుగుపరుస్తూ బ్రేక్ బై వైర్, ఫ్రంట్ డిస్క్ బ్రేక్ సదుపాయంతో తీసుకొచ్చినట్లు ఓలా వెల్లడించింది. ఓలా ఎలక్ట్రిక్ ఎస్1 ప్రో స్కూటర్లతో పాటు రోడ్‌స్టర్ విద్యుత్ మోటార్ సైకిళ్లను విక్రయిస్తోంది. ఎస్1 థర్డ్ జనరేషన్‌లో ఎస్1 ప్రోం (5.2kWh, 4kWh), ఎస్ 1ప్రో (4 kWh, 3kWh) పేరుతో ప్రీమియం స్కూటర్లను విక్రయిస్తోంది. మాస్ మార్కెట్‌ను దృష్టిలో పెట్టుకుని ఎస్1 ఎక్స్ం (4నెౌష్ట్ర), ఎస్ 1 ఎక్స్ (2, 3, 4 నెౌష్ట్ర) విక్రయిస్తోంది. రోడ్‌స్టర్ ఎక్స్‌ంను 4.5నెౌష్ట్ర, 9.1 నెౌష్ట్ర కాన్ఫిగరేషన్‌తోనూ, రోడ్‌స్టర్ ఎక్స్‌ను 2.5, 3.5, 4.5 kWh బ్యాటరీ సామర్థ్యంతోనూ విక్రయిస్తోంది. ఎస్1 ఎక్స్ం 5.2 నెౌష్ట్ర ఈ శ్రేణిలో కొత్తగా చేరింది.

## ఏళ్ల తరబడి ఉన్న యాప్‌ను నిలిపేసిన మైక్రోసాఫ్ట్

మే 25 నుంచి 'అవుట్‌లుక్ లైట్' సేవలు బంద్

టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ తమ వినియోగదారులకు ముఖ్యమైన హెచ్చరిక జారీ చేసింది. ఆండ్రాయిడ్ స్మార్ట్‌ఫోన్లలో తక్కువ డేటా, తక్కువ మెమరీతో పనిచేసేలా రూపొందించిన 'అవుట్‌లుక్ లైట్' యాప్ సేవలను నిలిపివేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించింది. 2026, మే 25వ తేదీ నుంచి ఈ యాప్ పూర్తిగా పనిచేయడం ఆగిపోతుందని కంపెనీ స్పష్టం చేసింది.

ఏమిటీ మార్పు? ఎందుకు?

ఎంట్రీ లెవల్ స్మార్ట్‌ఫోన్లు, నెమ్మదిగా ఉండే ఇంటర్నెట్ కనెక్షన్లను దృష్టిలో ఉంచుకుని మైక్రోసాఫ్ట్ గతంలో ఈ 'లైట్' వెర్షన్‌ను ప్రవేశపెట్టింది. అయితే, తన మొబైల్ ఈమెయిల్ వ్యూహాన్ని ఏకీకృతం చేయడంలో భాగంగా ఇకపై సింగిల్ ప్లాట్‌ఫామ్ పైనే దృష్టి సారించాలని కంపెనీ నిర్ణయించింది. మైక్రోసాఫ్ట్ 365 సేవలతో అనుసంధానం, మెరుగైన భద్రతా ఫీచర్లు, వ్యక్తిగత, కార్పొరేట్ వినియోగదారులకు విస్తృతమైన సౌకర్యాలను ఒకేచోట అందించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు



సమాచారం. ఈ క్రమంలోనే 2025 చివరి నుంచే కొత్త డౌన్‌లోడ్లను నిలిపివేసిన కంపెనీ ఇప్పుడు తుది గడువును ఖరారు చేసింది. వినియోగదారులపై ప్రభావం ఇలా.. మే 25 తర్వాత మీ ఫోన్‌లో యాప్ ఐకాన్ కనిపించినప్పటికీ మెయిల్ బాక్స్ ఓపెన్ కాదు. అంటే, మీరు కొత్త ఈమెయిల్స్ చూడటం, పంపడం లేదా క్యాలెండర్ ఈవెంట్లను నిర్వహించడం సాధ్యం కాదు. అయితే, వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. మీ ఈమెయిల్స్, కాంటాక్ట్స్, క్యాలెండర్ డేటా అంతా సురక్షితంగా ఉంటుంది. యూజర్లు వెంటనే గూగుల్ ప్లే స్టోర్ నుంచి ప్రధాన 'అవుట్‌లుక్ మొబైల్' యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి.

ఇప్పుడేం చేయాలి?

అంతరాయం లేని అవుట్‌లుక్ సర్వీసుల కోసం వినియోగదారులు గడువు ముగిసేలోపే కొన్ని చర్యలు తీసుకోవాలని కంపెనీ సూచించింది. అవుట్‌లుక్ లైట్ యాప్‌లోనే అప్‌గ్రేడ్ ఆప్షన్ కనిపిస్తుంది. దాని ద్వారా నేరుగా మెయిన్ యాప్‌కు వెళ్లవచ్చు. మెయిన్ అవుట్‌లుక్ యాప్ ఇన్‌స్టాల్ చేసిన తర్వాత మీ పాత మైక్రోసాఫ్ట్ అకౌంట్ వివరాలతో లాగిన్ అయితే సరిపోతుంది. మీ మెయిల్స్, అటాచ్‌మెంట్లు ఆటోమేటిక్‌గా సింక్ అవుతాయి. కంపెనీ ఐటీ నిర్వాహకులు ప్రత్యేకంగా ఏమీ చేయనవసరం లేదు కానీ, తమ ఉద్యోగులు సకాలంలో కొత్త యాప్‌కు మారేలా అంతర్గత మార్గదర్శకాలు జారీ చేయాల్సి ఉంటుంది. సాంకేతికత సర్వీసులు వేగంగా మారుతున్న తరుణంలో ఫీచర్ రిచ్ ప్లాట్‌ఫామ్‌ల వైపు మొగ్గు చూపడం ద్వారా యూజర్లకు అత్యుత్తమ సేవలు అందించడమే లక్ష్యమని మైక్రోసాఫ్ట్ పేర్కొంది. కాబట్టి, గడువు ముగిసే వరకు వేచి చూడకుండా ఇప్పుడే మెయిన్ యాప్‌కు మారడం ఉత్తమం.

## నష్టాలతో ముగిసిన సూచీలు



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. ఇరాన్-అమెరికా మధ్య చర్చలు విఫలం కావడం, హర్మూజ్ దిగ్బంధనానికి ట్రంప్ ఆదేశాలు ఇవ్వడం వంటి కారణాలతో పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. దీనికితోడు చమురు ధరలు పెరగడమూ ప్రతికూల ప్రభావం చూపింది. దీంతో పీఎస్‌యూ బ్యాంక్స్, బ్యాంకింగ్, ఫైనాన్షియల్, ఆయిల్ అండ్ గ్యాస్ స్టాక్స్ అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి. అయితే, సెన్సెక్స్ ఓ దశలో 1600 పాయింట్లు నష్టపోగా.. తర్వాత కాస్త కోలుకుని 700 పాయింట్ల నష్టానికే పరిమితం కావడం ఊరటనిచ్చే అంశం. సెన్సెక్స్ ఉదయం 75,937.16 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 77,550.25) భారీ నష్టాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 75,868.32 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరికి 702.57 పాయింట్ల నష్టంతో 76,847.57 వద్ద ముగిసింది. నిఫ్టీ 207.95 పాయింట్ల నష్టంతో 23,842.65 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 56 పైసలు బలహీనపడి 93.39గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఐసీఐసీఐ బ్యాంక్, ఎన్టీపీసీ, యాక్సిస్ బ్యాంక్ స్టాక్స్ మాత్రమే లాభపడ్డాయి. మారుతీ సుజుకీ, ఇండిగో, బజాజ్ ఫైనాన్స్, రిలయన్స్, టీసీఎస్ స్టాక్స్ నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 102 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4717 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

స్టాక్ మార్కెట్ నష్టాలకు కారణాలు ఇవే..

అమెరికా-ఇరాన్ మధ్య చర్చలు విఫలం కావడంతో హర్మూజ్‌ను దిగ్బంధించాలని తమ నౌకాదళాన్ని ఆదేశించినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. ఈ పరిణామాలు సెంటిమెంట్ దెబ్బతీశాయి.

ఇటీవల కాస్త తగ్గిన చమురు ధరలు మరోసారి భగ్గుమన్నాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్‌కు ఏడు శాతం పెరిగి 102 డాలర్లకు చేరింది.

ఇటీవల కాస్త కోలుకున్నట్లు కనిపించిన రూపాయి మరోసారి పతనం కావడం, ఆసియా పసిఫిక్ మార్కెట్లు నష్టాల ప్రభావం మన సూచీలపై పడింది.

## రెడ్‌మీ నుంచి ఎంట్రీ లెవల్ 5జీ స్మార్ట్‌ఫోన్



ఎంట్రీ లెవల్ స్మార్ట్‌ఫోన్ కొనుగోలు చేయాలనుకునే వారి కోసం షావోమీ సంస్థ రెడ్‌మీ ఏ7 ప్రో 5జీ (=వఎఐఅ ూ7 ్రతీశ) మొబైల్‌ను లాంచ్ చేసింది. ఇప్పటికే గ్లోబల్ మార్కెట్‌లో ఎంట్రీ ఇచ్చిన ఈ ఫోన్.. భారత్‌లో సోమవారం విడుదలైంది. 6,300 ఎంఏహెచ్ బ్యాటరీ, 32 ఎంపీ డ్యూయల్ కెమెరాతో ఈ ఫోన్ వస్తోంది. ఫీచర్లు, ధర వివరాలు ఇప్పుడు చూద్దాం..

రెడ్‌మీ ఏ7 ప్రో ఫీచర్లు ఇవే..

6.9 అంగుళాల హెచ్‌డీం ఎల్‌సీడీ స్క్రీన్

ఆండ్రాయిడ్ 16తో కూడిన హైపర్‌ఓఎస్3

నాలుగేళ్ల ఓఎస్ అప్‌డేట్స్, ఆరేళ్ల పాటు సెక్యూరిటీ అప్‌డేట్స్

ఆక్టాకోర్ యూనిసోక్ టీ8300 ప్రాసెసర్

జెమినై, గూగుల్ సర్కిల్ టు సెర్చ్ ఏఐ ఫీచర్లు

32 ఎంపీ ప్రధాన కెమెరా

ముందు వైపు 8 ఎంపీ కెమెరా

వైఫై 5, బ్లూటూత్ 5.4, యూఎస్‌బీ టైప్-సి పోర్ట్, ఐపీ52 రేటింగ్

6300 ఎంఏహెచ్ బ్యాటరీ, 15ఔ వైర్డ్ ఛార్జింగ్ రివర్స్ వైర్డ్ ఛార్జింగ్ సదుపాయం

ధర: 4జీబీం 64జీబీ= రూ.11,499

4జీబీం 128జీబీ= రూ.12,499

## ఆసక్తి ఉన్న యువత ప్రధాన మంత్రి ఇంటర్న్ షిప్ పథకానికి దరఖాస్తు చేసుకోవాలి..

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి)**: కేంద్ర ప్రభుత్వం అమలు పరుస్తున్న 'ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకం' మూడో దశలో జిల్లాలోని అర్హులైన యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఒక ప్రకటనలో తెలిపారు. యువతకు తమ నైపుణ్యాలు పెంపుదల చేసుకునేందుకు ఇది ఒక గొప్ప అవకాశం అని పేర్కొన్నారు. ఈ ఇంటర్న్‌షిప్ 6 నుండి 12 నెలల వరకు ఉంటుందని అన్నారు. ఇందులో ఎంపికైన అభ్యర్థులకు నెలకు 5 వేల రూపాయల చొప్పున ఆర్థిక సహాయం (స్టైఫండ్), ఒకసారి అదనంగా ఇచ్చే ప్రోత్సాహకం (గ్రాంట్) 6 వేల రూపాయలు అందుతాయని వివరించారు. దీంతోపాటు అభ్యర్థులకు పీఎం జీవన్ జ్యోతి బీమా యోజన, పీఎం సురక్ష బీమా యోజన వంటి పథకాల కింద ఉచిత బీమా సౌకర్యం కల్పించబడుతుందని వివరించారు. 18 నుండి 25 సంవత్సరాల మధ్య వయస్సు గల విద్యార్హత: 10వ తరగతి, ఇంటర్మీడియట్, ఐటిఐ, పాలిటెక్నిక్ డిప్లొమా, డిగ్రీ, బి.టెక్, పిజి చదివిన, చివరి సంవత్సరం చదువుతున్న వారు అర్హులని అన్నారు. కుటుంబ వార్షిక ఆదాయం 12 లక్షలకు మించరాదని చెప్పారు. అర్హులైన అభ్యర్థులు తమ మొబైల్ నంబర్, ఆధార్, ఇతర విద్యార్హత పత్రాలు, ఫోటోలతో, ప్రైమ్ మినిస్టర్ స్కీం పోర్టల్ ద్వారా ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవచ్చునని వివరించారు. అభ్యర్థులు గరిష్టంగా మూడు ఇంటర్న్‌షిప్ ఆప్షన్లను ఎంచుకునే అవకాశం ఉందని తెలిపారు. మరింత సమాచారం కోసం కలెక్టరేట్ లోని జిల్లా పరిశ్రమల కార్యాలయం, లేదా టోల్-ఫ్రీ నంబర్ 1800 11 6090 ని సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలోని యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని కలెక్టర్ ఆ ప్రకటన ద్వారా తెలిపారు.

## ఇంటర్మీడియట్ ఫలితాలలో టైమ్స్ జూనియర్ కళాశాల విద్యార్థుల ప్రభంజనం

విద్యార్థులను అభినందించిన కళాశాల కరెస్పాండెంట్ అవినాష్ రాయ్,ప్రిన్సిపల్ బోటనీ వెంకన్న



**యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్)**: ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన ఇంటర్మీడియట్ ఫలితాలలో స్థానిక భువనగిరి పట్టణంలోనే టైమ్స్ జూనియర్ కళాశాల విద్యార్థులు అన్ని విభాగాలలో జిల్లా మరియు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారని కళాశాల కరస్పాండెంట్ అవినాష్ రాయ్,ప్రిన్సిపల్ బోటనీ వెంకన్న తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో అభినందన సభ కార్యక్రమం ఏర్పాటు చేసి జిల్లా రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులకు మెమొంటో అందజేసి శాలువాతో సత్కరించి అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ర్యాంకులు సాధించిన వారిలో ఫస్ట్ ఇయర్ టాపర్స్ ఎంపీసీ సామియా మహావీన్ 466/470బైపీసీ మచ్చ లక్ష్మి ప్రణవి 436/440సీఈసీ బల్లి సాత్విక్ 487/500సెకండ్ ఇయర్ టాపర్స్ ఎంపీసీ వంగా లిఖిత 991/1000బైపీసీ ముస్కాన్ అఫ్రీన్ 990/1000సీఈ సి రత్నపురం వందన శ్రీ 982/1000 ఈ సందర్భంగా మాట్లాడుతూ ర్యాంకులు సాధించడంలో ప్రధాన పాత్ర పోషించిన ఉపాధ్యాయ బృందానికి మరియు తల్లిదండ్రులకు కళాశాల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.విద్యార్థులు ఒక ప్రణాళిక పద్ధతిలో చదవాలని పేర్కొన్నారు. విద్యార్థులు తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం గోవిందరాజుల గోవింద్, గణేష్, సత్యనారాయణ, ప్రదీప్ చంద్ర, శిరీష,నికిత, చంద్రశేఖర్,నిషాత్, ఆంజనేయులు,అంజి,భవాని, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌సీసీ క్యాంపులో గౌతమ్ విద్యార్థిని జుహామహీన్ సత్తా

### ఫైరింగ్ లో అత్యుత్తమ ప్రతిభ

### జుహామహీన్ కు పలువురు అభినందనలు



**కోరుట్ల,ఏప్రిల్ 13(నేటి మన దేశమ్ ప్రతినిధి)**:: పట్టణంలోని గౌతమ్ ఉన్నత పాఠశాలకు చెందిన జాతీయ క్యాడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ) 9వ బెటాలియన్ విద్యార్థులు కరీంనగర్ పోలీస్ ట్రైనింగ్ సెంటర్ లో నిర్వహించిన ఇంటర్ డైరెక్టరేట్ స్పోర్ట్స్ షూటింగ్ చాంపియన్ షిప్‌లో అత్యంత ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లో 100 మంది క్యాడెట్లలో ఫైరింగ్ విభాగంలో జుహామహీన్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రశంసలు అందుకుంది.కాగాకోరుట్ల పట్టణంలోని హాజీపూర్‌కు చెందిన షేక్ సద్దాం ఉజమా తబస్సుమ్ దంపతుల కుమార్తె జుహామహీన్ ఫైరింగ్ విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రశంసలు అందుకుంది.ఈ సందర్భంగా గౌతమ్ ఉన్నత వ్యవస్థాపకులు ఎం.ఎ. గఫార్,పాఠశాల ప్రెసిడెంట్ ఎం.ఎ. కైజర్, జాయింట్ సెక్రటరీ ఎం.ఎ. అఫ్రోజ్, ఎన్‌సీసీ అధికారులు, పాఠశాల ప్రిన్సిపాల్స్ గోపి మారాసి, క్రిస్టినా, ఏ.ఎన్.ఓ విజయ్ నాయక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు అభినందించారు.ఈ సందర్భంగా ఎన్‌సీసీ అడ్మిన్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ జయంత మాట్లాడుతూ యువతలో క్రమశిక్షణ, శారీరక దృఢత్వం పెంపొందించడమే ఎన్‌సీసీ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. క్యాడెట్లు అన్ని రంగాల్లో రాణించేందుకు శిక్షణ కార్యక్రమాలను ఆస్వాదిస్తూ స్నేహస్ఫూర్తిని పెంపొందించుకోవాలని సూచించారు.శిబిరంలో క్యాడెట్లు ఫైరింగ్, మ్యాప్ రీడింగ్, ఫీల్డ్ క్రాఫ్ట్, యుద్ధ నైపుణ్యాల్లో శిక్షణ పొందుతున్నట్లు తెలిపారు.



## హెచ్పీవీ వ్యాక్సినేషన్ పై అవగాహన కల్పించాలి

2011-12 సం.. 14 ఏళ్ళు నిండిన బాలికలకు వ్యాక్సిన్ అందించాలి

జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్



**జగిత్యాల, ఏప్రిల్ 13(నేటి మన దేశమ్ ప్రతినిధి)**::ప్రతి ఒక్కరికీ హెచ్పీవీ వ్యాక్సినేషన్ పై అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ అన్నారు. సోమవారం జగిత్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్పీవీ) వ్యాక్సినేషన్ పై జిల్లా టాస్క్ ఫోర్స్ సమావేశం జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సమావేశానికి వివిధ లైన్ డిపార్ట్మెంట్స్‌కు చెందిన అధికారులు హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూబాలికల ఆరోగ్య పరిరక్షణలో హెచ్‌పీవీ వ్యాక్సిన్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. 2011-12 సంవత్సరంలో జన్మించిన 14 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్క అమ్మాయి తప్పనిసరిగా ఈ వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచించారు. ప్రస్తుతం టెన్త్ క్లాస్ పరీక్షలు ముగిసిన నేపథ్యంలో ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. పాఠశాలలు, ఆంగన్వాడీ కేంద్రాల ద్వారా బాలికలను గుర్తించి వ్యాక్సిన్ వేయించాలని అధికారులకు ఆదేశించారు.గ్రామ, పట్టణ స్థాయిలో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.తల్లిదండ్రుల్లో అవగాహన పెంచడం చాలా అవసరమని పేర్కొన్నారు. హెచ్‌పీవీ వ్యాక్సిన్ ద్వారా గర్భాశయ క్యాన్సర్‌ను ముందుగానే నివారించవచ్చని తెలిపారు. అందువల్ల ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యతతో అమలు చేయాలని అన్నారు. ప్రతి ఆరోగ్య సిబ్బంది తమ బాధ్యతగా భావించి పని చేయాలని సూచించారు. సంబంధిత అధికారులు పరస్పర సమన్వయంతో లక్ష్యాలను చేరుకోవాలని అన్నారు.జిల్లాలో వ్యాక్సినేషన్ శాతం పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రతి బాలికకు వ్యాక్సిన్ అందేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు.వ్యాక్సినేషన్ సమయంలో ఎటువంటి లోపాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. విద్యా సంస్థల సహకారం కూడా తీసుకోవాలని తెలిపారు. జిల్లాలోని అన్ని పాఠశాలలతో సమన్వయం పెంచాలని అన్నారు. అంగన్వాడీ సిబ్బంది కూడా ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొనాలని సూచించారు. వ్యాక్సినేషన్ పై అపోహలను తొలగించేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు.ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. జిల్లాలో 2170 వ్యాక్సిన్ లు అందుబాటులో ఉండగా ఇప్పటివరకు 769 మందికి వ్యాక్సినేషన్ చేశామని తెలిపారు. జిల్లాలోని రెసిడెన్సియల్ స్కూల్స్ లలో చదివే 14 సంవత్సరం లో జన్మించిన బాలికలకు ఈ వ్యాక్సినేషన్ అందించాలని కోరారు.ఆనంతరం జిల్లా వైద్యాధికారి డా. సుజాత మాట్లాడుతూవ్యాక్సినేషన్ ప్రగతిని వివరిస్తూ జిల్లా ప్రజలు, ముఖ్యంగా తల్లిదండ్రులు తమ కుమార్తెలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేయించి వారి ఆరోగ్యాన్ని కాపాడాలని వైద్య, ఆరోగ్య శాఖ తరుపున ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో డిప్యూటీ డి ఎం హెచ్ ఓ జైపాల్ రెడ్డి, ఆర్ఎంవో లు ఎస్సీ వెల్ఫేర్ అధికారి రాజ్ కుమార్, డీపీఆర్వో పి.నరేష్ సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలి.!

టియుడబ్ల్య జే (ఐ జె యు) జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి

కమిటీ సభ్యులతో జిల్లా కలెక్టర్ సమావేశం





**సంగారెడ్డి: జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 13 (నేటి మన దేశమ్)** సంగారెడ్డి జిల్లా లో నూతనంగా ఏర్పడిన అక్రిడిటేషన్ కమిటీ సభ్యులతో జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య సోమ వారం సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలోని జర్నలిస్టుల కు అక్రిడిటేషన్ కార్డుల జారీపై చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో గురించి ఆరా తీశారు. టీయూడబ్ల్యూజేఐజేయు సంగారెడ్డి జిల్లా శాఖ అధ్యక్షుడు బండారు యాదగిరి , ఫోటో జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు ఆరిఫ్ లు జిల్లా కలెక్టర్ ను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా బండారు యాదగిరి మాట్లాడుతూ అర్హులందరికీ అక్రిడేషన్ కార్డులను మంజూరు చేయాలని కోరారు. జిల్లాలో చాలా సంవత్సరాలుగా అర్హులైన వారు జర్నలిస్టులుగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు. సంగారెడ్డి పట్టణంతో పాటు నియోజకవర్గ కేంద్రాలలో , మండలాల్లో అర్హులు చాలామంది ఉన్నారని చెప్పారు.వీరందరికీ కూడా సకాలంలో అక్రిడిటేషన్ కార్డులను జారీ చేస్తే బాగుంటుందని వివరించారు. జిల్లాలో ప్రింట్ మీడియాతో పాటు ఎలక్ట్రానిక్ మీడియాలో , ఉర్దూ , ఇంగ్లీష్ పత్రికలలో అనేకమంది నిత్యం వార్తలు రాస్తున్నారని చెప్పారు. ఇటీవల కాలంలో స్థానికంగా కూడా కొత్త పత్రికలను ఏర్పాటు చేశారని చెప్పారు. కేబుల్ టీవీలలో కూడా అనేక వార్తలు ప్రసారం అవుతున్నాయని అన్నారు. వీడియో గ్రాఫర్లు ఫోటోగ్రాఫర్లుగా చాలామంది వృత్తికి అంకితమై పని చేస్తున్నారని వివరించారు. జర్నలిజమే ప్రధాన వృత్తిగా స్వీకరించి అనేక ఆటుపోట్లను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రస్తుతం జర్నలిస్టులంతా దరఖాస్తులు చేసుకుంటున్నారని అన్నారు. వారందరికీ కూడా ప్రభుత్వం తరఫున లభించే గుర్తింపు కార్డుగా అక్రిడిటేషన్ ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు ఎంతమంది దరఖాస్తు చేశారు ?ఇంకా ఎంత మంది దరఖాస్తు చేసే అవకాశం ఉన్నది ?అని అడిగారు. జర్నలిజం కోసం అంకితమై పనిచేస్తున్న వారి పేర్లను ప్రతిపాదిస్తే బాగుంటుందని ఈ సందర్భంగా ఆమె సూచించారు. సంగారెడ్డి జిల్లా యూనియన్ తరపున తనను ప్రతిపాదించినందుకు రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ ప్రధాన కార్యదర్శి రామ్ నారాయణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం ఎ కే ఫైసల్ లకు బండారు యాదగిరి కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్టుల హక్కుల కోసం సంక్షేమం కోసం తమ సంఘం నిరంతరం పాటుపడుతుందని ఈ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని ఆయన అన్నారు. డిపిఆర్ఓ విజయలక్ష్మి తో పాటు సభ్యులుగా నియమితులైన యోగానంద రెడ్డి, శ్రీధర్, వై ప్రభాకర్, జి ప్రభాకర్, ఆరిఫ్, అక్రముద్దీన్,

## కాంగ్రెస్ ప్రభుత్వం ఉందా లేదా ?

రేవంత్ సర్కారు పనితీరుపై సంచలన వ్యాఖ్యలు చేసిన పోచారం శ్రీనివాస్ రెడ్డి



**కామారెడ్డి,ఏప్రిల్ 13.(నేటి మనదేశమ్ ప్రతినిధి)**సిద్దాపూర్ రిజర్వాయర్‌కు నిధులు ఇవ్వట్లేదని సొంత ప్రభుత్వంపై తిరుగుబాటురేవంత్ రెడ్డి మాట తప్పాడు.. ఈ ప్రభుత్వంలో మంత్రులు ఎమ్మెల్యేల ఫోన్లు లేపరు అన్నారు బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి.నేను ఈ వయస్సులో నిధులు మంజూరు చేయాలని మంత్రుల కాళ్లు మొక్కాలా ? 20 సార్లు బాన్సువాడకు నిధులు ఇవ్వాలని మంత్రిని అడిగినా.. పట్టించుకోలేదు.బీఆర్ఎస్ ప్రభుత్వంలో నేను ఇంట్లో కూర్చుని అడిగితే చకచకా జీవోలు ఇచ్చేవారు.అసలు ప్రభుత్వం ఉందా?..ఉంటే అది పని చేస్తుందా? అనే అనుమానం వస్తుంది అన్నారు.వరుసగా రేవంత్ రెడ్డిపై తిరుగుబాటు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు.

## ఇంటెలిజెన్స్ భవనాలను ప్రారంభించిన రాష్ట్ర డీజీపీ



**ఆదిలాబాద్ ఏప్రిల్ 13 (నేటి మన దేశమ్ ప్రతినిధి.**

పట్టణంలోని మావలనందు ఇంటెలిజెన్స్ డిపార్ట్మెంట్ కు చెందిన మూడు డిఎస్పి ,సిఐ,ఎస్ఐ క్వార్టర్స్ లను రాష్ట్ర డిజిపి బి శివధర్ రెడ్డి పోలీసు అధికారుల సమక్షంలో లాంఛనంగా పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రారంభించడం జరిగింది.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్,అదనపు ఎస్పి బి సురేందర్ రావు, పరిపాలన అదనపు ఎస్పి మౌనిక,శిక్షణ ఐపిఎస్ రాహుల్ కాంత్,డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, పట్టణ సిఐలు,ఎస్సైలు,రిజర్వు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నిర్మల్ వాసులు చిత్రసీమలో అడుగు పెట్టడం అభినందనీయం..

- మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి



**నిర్మల్, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి)**: నిర్మల్ జిల్లా అంటేనే ఇక చరిత్రాత్మక ప్రాంతమణి, చలన చిత్రాల షూటింగ్ కి అనువైన ప్రాంతమని నిర్మల్ మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి అన్నారు. సోమవారం కొప్పుల క్రియేషన్స్ ఆధ్వర్యంలో ద ఎంప్టీ సీట్ చిత్రం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.., నిర్మల్ పట్టణం నుండి చలన చిత్ర నిర్మాతలు, దర్శకులుగా ఎదగడం హర్షనియమన్నారు. పట్టణంలో కోటలు, బురుజులు, గొలుసుకట్టు చెరువులు ఎంతో ఆకట్టుకునే ప్రాంతమని, జిల్లా నలుమూలల పర్యాటక ప్రాంతంగా బాసర సరస్వతి, కుంటాల జలపాతం, కవ్వాల్ అభయారణ్యం, గోదావరి సహియద్రి ప్రాంతాలు ఉన్నాయన్నారు. ఇక్కడి ప్రాంతాలను చలన చిత్రాల్లో చూయిస్తే ఈ ప్రాంతంతో పాటు, స్థానికులకు ఎంతో ఉపయోగ కరంగా ఉంటుందన్నారు. మొట్టమొదటి సారిగా దర్శకులు, నిర్మాతలుగా అడుగుబెడుతున్న ద్యాగ స్వామి, కొప్పుల చిన్నయ్యకు అభినందనలు తెలిపారు.

## అమరవాది లక్ష్మీనారాయణ అధ్యక్షతన తెలంగాణ రాష్ట్ర అర్యవైశ్య మహాసభ అత్యవసర సమావేశం



**కామారెడ్డి/హైదర్‌బాద్: నిర్మల్ 13. (నేటి మనదేశమ్ ప్రతినిధి)**

తెలంగాణ రాష్ట్ర అర్యవైశ్య మహాసభ నూతన అధ్యక్షునిగా ఎన్నికైన గౌరవ అమరవాది లక్ష్మీనారాయణ అధ్యక్షతన తెలంగాణ రాష్ట్ర అర్యవైశ్య మహాసభ అత్యవసర సమావేశం జరిగింది, ఇందులో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ మాజీ అధ్యక్షులు, మాజీ మున్సిపల్ చైర్మన్, కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్ గుప్తా ప్రసంగించారు కార్యక్రమం లో ఆర్యవైశ్య మహాసభ కామారెడ్డి జిల్లా అధ్యక్షులు బాల కిషన్ , మాజీ అధ్యక్షులు బాలు తదితరులు పాల్గొన్నారు. వీరు అధ్యక్షులు అమరావది లక్ష్మీనారాయణ ను సన్మానించారు.

# స్వర్ణ చంద్రగిరి అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలి

**– జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్**



**తిరుపతి, ఏప్రిల్ 13 (నేటి మనదేశవమ్) :** స్వర్ణ నారావారిపల్లె అభివృద్ధి నమూనాను ఆదర్శంగా తీసుకొని, స్వర్ణ చంద్రగిరి ప్రాంతాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయడానికి జిల్లా అధికారులు ప్రణాళికాబద్ధంగా త్వరితగతిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో, స్వర్ణ చంద్రగిరి అభివృద్ధి అంశంపై తిరుపతి ఆర్డీవో రామ్మోహన్, స్వర్ణ చంద్రగిరి ప్రత్యేక అధికారి మరియు జిల్లా పంచాయతీ అధికారి శ్రీమతి సుశీల దేవి మరియు ఇతర శాఖల అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ నూతన పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. యూరియా వినియోగాన్ని తగ్గిస్తూ ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని, చిరుధాన్యాల సాగుపై రైతులను ఆకర్షిస్తూ పీఎండీఎస్ కిట్లను అందించాలని తెలిపారు. రైతుల ఆదాయాన్ని పెంచేందుకు పాల ఉత్పత్తి అభివృద్ధి, రైతు బజార్ల ఏర్పాటు వంటి చర్యలు చేపట్టాలని అన్నారు.

ఉద్యానవన రంగంలో మామిడి తోటల అభివృద్ధికి మ్యాంగో ఫ్రూట్ కవర్ల వినియోగంపై అవగాహన కల్పించాలని సూచించారు. చంద్రగిరి పరిధిలోని చెరువులను గుర్తించి, మత్స్యకారులకు జీవనోపాధి కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యా రంగంలో డిజిటల్ ఎడ్యుకేషన్‌ను బలోపేతం చేయాలని, పాఠశాలలలో పెండింగ్ లో పనులను సమర్థవంతంగా అమలు చేయాలని, 'మనబడి – మన భవిష్యత్తు' కార్యక్రమం కింద పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రణాళికను పటిష్టంగా అమలు చేయాలన్నారు. సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడం, ఇంప్రూవ్‌మెంట్ ప్యానెల్‌లు ఏర్పాటు చేయడం, విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు, యోగా తరగతులు నిర్వహించడం వంటి చర్యలు చేపట్టాలని తెలిపారు.స్వర్ణ చంద్రగిరిలో ప్రతి ఇంటికి రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థలు ఏర్పాటు చేయాలని, అర్హులైన వారికి గృహాలు మంజూరు చేయాలని సూచించారు. జల జీవన్ మిషన్ కింద ప్రతి ఇంటికి తాగునీటి కనెక్షన్ అందించాల్సిందిగా చెప్పారు. పశువైద్య అధికారులు పశువులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు అందజేశారు. గేదెలు, ఎద్దులు, మేకలు, గొర్రెలకు వ్యాధి నిరోధక టీకాలు వేయడం జరిగింది. అలాగే కీటకనాశన మందులు పంపిణీ చేసి పశువులను వ్యాధుల నుండి రక్షించే చర్యలు చేపట్టాలన్నారు.పశుసంవర్ధక శాఖ ద్వారా అందిస్తున్న పథకాలు, సబ్సిడీలు, బీమా సదుపాయాలపై రైతులకు వివరాలు తెలియ చేయాలన్నారు. ఆధునిక పద్ధతుల్లో పశుపోషణ చేయడం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని సూచించారు. శిబిరంలో పాల్గొన్న రైతులు పశువుల సంరక్షణకు సంబంధించిన సందేహాలను నిపుణులను అడిగి నివృత్తి చేసుకున్నారు. ఈ శిబిరం ద్వారా పశువుల ఆరోగ్య పరిస్థితి మెరుగుపడటంతో పాటు రైతులకు ఉపయోగకరమైన సమాచారం అందించాలని తెలిపారు. సంజీవని ప్రాజెక్టుకు సంబంధించిన ప్రతిపాదనలు పంపాలని, ఏబిహెచ్‌ఏ (ఆభా) నమోదును 100% పూర్తి చేయాలని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల భవనాల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, పోషణ్ 2.0 పథకంపై అవగాహన కల్పించాలని తెలిపారు.

జిల్లా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల ద్వారా యువతకు శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. ఎంపీడీవోలు యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేను పూర్తి చేయాలని, ప్రతి ఒక్కరికీ ఆధార్, జనన ధృవపత్రాలు అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. ఎన్ఆర్ఈజీఎస్ కింద స్వర్ణ చంద్రగిరి అభివృద్ధికి సంబంధించిన పనులను పూర్తి చేయాలని, జిల్లా అధికారులు అందరూ సమన్వయంతో పనిచేసి అభివృద్ధి సాధించేందుకు కృషి చేయాలని తెలిపారు. అన్ని శాఖ ల వారు అందరూ సమన్వయంతో వారికి కేటాయించిన విధులను నిర్దేశించిన సమయంలోపల పూర్తి చేయాలని సూచించారు. అనంతరం భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో నారీ శక్తి వందన సమ్మేళనానికి సంబంధించిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రసంగిస్తున్న సందేశాన్ని వర్చువల్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో డి ఈ ఓ కుమార్, సి పి ఓ రాజశేఖర్, ద్వామా పి డి శ్రీనివాసరావు, డి ఆర్ డి ఏ పి డి శోభన్ బాబు, డి ఎమ్ అండ్ హెచ్ ఓ బాలకృష్ణ నాయక్,వ్యవసాయ శాఖ అధికారి ప్రసాద రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, మండల అధికారులు పాల్గొన్నారు.

# ఇరాన్‌పై యుద్ధాన్ని ఆపాలి




**శ్రీకాకుళం, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్) :** ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధాన్ని తక్షణమే ఆపాలని వక్తలు డిమాండ్ చేశారు. ఆదివారం శ్రీకాకుళంలోని ఎన్జీవో హోమ్‌లో ఇరాన్‌పై యుద్ధాన్ని ఖండిస్తూ, ప్రపంచ శాంతిని కోరుతూ జిల్లా పౌరహక్కుల సంఘం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కేవీ జగన్నాథ రావు, అరుణోదయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు తదితరులు మాట్లాడుతూ మానవజాతి మనుగడకు ప్రమాద కరంగా పరిణమించిన యు ద్ధాన్ని ఖండించారు. నాగరిక సమాజంలో ఆధిపత్యం కోసం, సహజ వనరుల దోపిడీకి యుద్ధాలు చేస్తున్న అమెరికా సామ్రాజ్యవాదాన్ని వ్యతిరే కించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మిస్కా కృష్ణయ్య, మద్దిల వినోద్ కుమార్, రామారావు, వెంకటరావు, మహిళా సంఘాల నాయకులు నాగమణి, భానుమతి, గీతారాణి, జోగారావు, దానయ్య, వైకుంఠరావు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

**– ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు**



**శ్రీకాకుళం, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్) :** ముఖ్యమంత్రి సహాయనిధి నిరు పేదలకు వరమని (సీఎంఆర్ఎఫ్), పేద కుటుంబాలు వైద్యంకోసం దరఖాస్తు చేసిన వెంటనే సీఎం నిధులు మంజూరు చేస్తున్నారని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తెలిపారు. రణస్థలంలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో ఎచ్చెర్ల నియోజకవర్గం పరిధిలో తొమ్మిది మందికి రూ.10 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు, అవసరాల్లో ఉన్నవారికి ప్రభుత్వం సహాయం తక్షణమే అందేలా కూటమి ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోం దన్నారు. కార్య క్రమంలో నాయకులు డీజీఎం ఆనంద రావు, ముప్పిడి సురేష్, ఎం కనకారావు, పిషిని జగన్నాథంనాయుడు, శ్రీనివాసరావు, దుమ్ము అశోక్ పాల్గొన్నారు.

# మెరుగైన జీవనమే లక్ష్యం



**గజపతినగరం, ఏప్రిల్ 13 (నేటి మనదేశవమ్) :** ఎస్సి, ఎస్టిలకు మెరుగైన జీవన విధానం ఇవ్వడం, వారి ఉన్నతే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మండలంలోని పాతబగ్గాం గ్రామంలో పిఎం సూర్య ఘర్ ముఫ్తీ బిజిలీ యోజన కార్యక్రమంలో పాల్గొని రూఫ్‌టాప్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సూర్య ఘర్ పథకం ద్వారా కూటమి ప్రభుత్వం ఎస్సి, ఎస్టిలకు ఉచితంగా సోలార్ రూఫ్ టాప్ ప్యానల్స్‌తో పాటు ప్రతి నెలా అదనంగా రూ.200 కూడా ఇస్తుందన్నారు. తొలి విడతలో రూ.170 కోట్లతో 15,018 మంది లబ్ధిదారులకు ఈ పథకం వర్తింపజేస్తున్నామని, 30.04 మెగావాట్ల కరెంట్ జిల్లాలో ఉత్పత్తి చేస్తామని తెలిపారు. నియోజకవర్గంలో 8,535 ఎస్సి, ఎస్టి లబ్ధిదారులు ఉంటే 2170 మందిని ఈ పథకం ద్వారా ఎంపిక చేశామన్నారు. విద్యుత్ ఉత్పత్తి పెంచుకుంటేనే యూనిట్ ధర తగ్గుతుందని, విద్యుత్ ఉత్పత్తి పెంచుకు నేందుకు ఈ పథకం ఉపయోగించుకోవాలని అన్నారు. సూర్య ఘర్ ఏర్పాటు చేసుకున్న వారికి మరో 25 ఏళ్లు కరెంటు బిల్లులు భారం ఉండదన్నారు. గత ప్రభుత్వంలో విద్యుత్ వ్యవస్థ అస్తవ్యస్తం ఇక గత ప్రభుత్వం అస్తవ్యస్త విధానాలతో యూనిట్ రూ.15కు కొని ప్రజలపై సర్‌చార్జీల పేరుతో అధిక బిల్లుల మోపారని మంత్రి విమర్శించారు. జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లోనూ లోఓల్టేజ్ సమస్యతో ప్రజలు నానా ఇబ్బందులకు గురయ్యారని, కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే నియోజకవర్గంలో రూ.3కోట్లతో 130 కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుతో పాటు మరో రూ.3 కోట్లతో ఎలక్ట్రికల్ పోల్స్ కూడా మార్చుతున్నామని చెప్పారు. జిల్లా కేంద్రం విజయనగరంలో తీవ్రమైన లోఓల్టేజ్ సమస్య ఉన్నా గత ప్రభుత్వం ఏనాడు పట్టించుకోలేదని, కూటమి ప్రభుత్వం వచ్చాక స్థానిక ఎమ్మెల్యే అతిథి గజపతిరాజుతో కలిసి చంద్రబాబు దృష్టికి ఈ సమస్య తీసుకువెళ్లి రూ.180 కోట్లతో సబ్‌స్టేషన్ తీసుకువచ్చామన్నారు. గజపతినగరం నియోజకవర్గంలోని బొండపల్లి మండలంలో ఒక సబ్‌స్టేషన్‌తో పాటు నెల్లిమర్ల నియోజకవర్గంలో మరో రెండు సబ్‌స్టేషన్లు కూడా ఏర్పాటవుతుండడం కూటమి ప్రభుత్వ పాలనకు నిదర్శనం అన్నారు. ఈ కార్యక్రమంలో గజపతినగరం జనసేన ఇన్‌చార్జ్ మర్రాపు సురేష్, ఎఎంసి చైర్మన్ గోపాలరాజు, గజపతినగరం టిడిపి మండల అధ్యక్షులు గంట్యాడ శ్రీదేవి, ఆంధ్రా రిజర్వాయర్ చైర్మన్ కోడి సతీష్‌కుమార్, పిఎసిఎస్ లెంక బంగారునాయుడు, క్లస్టర్ నాయకులు ప్రదీప్‌కుమార్, గోవింద, నారాయణ అప్పల నాయుడు, తదితరులు పాల్గొన్నారు. పొట్టి శ్రీరాములు విగ్రహావిష్కరణఅమరజీవి పొట్టి శ్రీరాములు ప్రత్యేక ఆంధ్రప్రదేశ్ కోసం చేసిన త్యాగం ఎప్పటికీ తెలుగు ప్రజల మదిలో ఉండిపోతుందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. పాతబగ్గాం హైస్కూల్ ఆవరణలో పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసినందుకు జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకులను మంత్రి అభినందించారు. రూ.73.60 లక్షలతో నిర్మించిన సీసీ రహదారులు, డ్రైనేజ్‌లను కూడా మంత్రి ప్రారంభించారు.

# స్వీయ రక్షణకు కరాటే, బాక్సింగ్



**మాధవధార, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్) :** స్వీయ ఆత్మరక్షణ కోసం కరాటే, బాక్సింగ్ వంటి క్రీడలలో శిక్షణ తీసుకోవాలని ప్రముఖ రియల్ వ్యాపార సంస్థ హైవే వెంచర్స్ అధినేత, సినీ నిర్మాత డాక్టర్ హేమారావు చింతాడ సూచించారు. విశాఖ వేదికగా స్థానిక బీచ్ రోడ్డులోని గోకుల్ పార్కు వద్ద విశాఖ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ (వికెఎ) పౌండర్ కె.సింగ్, ప్రెసిడెంట్ నీలాపు శ్రీను, జనరల్ సెక్రటరీ గనగళ్ల రాజేష్ ఆధ్వర్యంలో అఫిలేటెడ్ (ఎపి అమెచ్యూర్ కిక్ బాక్సింగ్, ఇండియన్ కిక్ బాక్సింగ్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) ఆధ్వర్యాన మే 9,10 తేదీలలో జరగనున్న ఉత్తరాంధ్ర కిక్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్-2026 పోటీల ట్రోఫీ, బ్రోచర్‌ను డాక్టర్ హేమా రావు చింతాడ ఆవిష్క రించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ, క్రీడల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారు లకు ప్రత్యేక ప్రోత్సాహం ఉంటుందని తెలిపారు. ఇటువంటి క్రీడలకు తనవంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని హామీఇచ్చారు. వికెఎ జనరల్ సెక్రటరీ గనగళ్ల రాజేష్ మాట్లాడుతూ, సమాజ సేవాలో ముందుండే హైవే వెంచర్స్ అధినేత చేతులమీదుగా ట్రోఫీ ఆవిష్కరించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు చింతాడ ఢిల్లీశ్వరరావు, సనపల చిన్నబాబు, అరవింద్ స్వామి, పోటీల నిర్వాహకులు సుధాకర్, సంతోష్, సురేంద్ర, యల్లారావు తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు చర్యలు

**– ఎస్పీ దామోదర్ – పోలీస్‌స్టేషన్ల ఆకస్మిక తనిఖీ**



**బొబ్బిలి, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్) :** విజయనగరం జిల్లాను గంజాయి రహిత జిల్లాగా తీర్చి దిద్దేందుకు పోలీ సు యంత్రాంగం అహర్నిశలు శ్రమిస్తోందని ఎస్పీ ఏఆ ర్ దామోదర్ తెలిపారు. బొబ్బిలి పోలీసుస్టేషన్‌ను, రూ రల్ సర్కిల్ కార్యాలయాన్ని ఆయన ఆదివారం సంద ర్శించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఒడిశా నుంచి గంజాయి రవాణాను అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామని చెప్పారు. సంక ల్పం పేరుతో జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమా లు చేపడుతున్నామని తెలిపారు. సీఐలు కింతలి నారా యణరావు, శ్రీనివాసరావు, ఎస్ఐ జ్ఞానప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**బొబ్బిలి కోట సందర్శన :** బొబ్బిలి కోటను ఎస్పీ ఏఆర్ దామోదర్ తమ కు టుంబ సభ్యులతో ఆదివారం సందర్శించారు. ఎమ్మెల్యే బేబీనాయన వారికి సాదరంగా స్వాగతం పలికారు. దర్బార్ మహల్‌ను, అక్కడ మ్యూజియంను ఎస్పీ ఆసక్తి గా తిలకించారు. ఆనాటి ఆయుధాలను, ఫొటోలకు సం బంధించి ఎమ్మెల్యే వారికి వివరించారు. అనంతరం బొబ్బిలి వీణను బహూకరించి సత్క రించారు. బొబ్బిలి కోటను సందర్శించిన అనంతరం ఎస్పీ స్పందిస్తూ అక్కడ రికార్డుల్లో తన అభిప్రాయాన్ని ఇలా నమోదు చేశారు. 'బొబ్బిలి కోట పౌరుషాలకు, ఆత్మాభిమానానికి ప్రతీక. అలాంటి కోటను దర్శించడం నా అదృష్టం. గొప్ప అవకాశం. బొబ్బిలి రాజులు ఉపయోగించిన ఆయుధాలు, వస్తువులు, వివిధ కాన్ఫరెన్స్‌ల్లో పాల్గొన్న ఫోటోలు మొదలగు వాటిని భద్రపరిచి ప్రజాదర్శనార్థం ఉంచిన నేటితరం బొబ్బిలి రాజుల ఆశయం చాలా గొప్పది. రియల్టీ ఇట్ ఈజ్ ఏ మార్వలెస్ ఆన్‌ది ఎర్త్ ఆఫ్ విజయనగరం డిస్ట్రిక్ట్' అని ఎస్పీ రాశారు.

**సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి**

**రామభద్రపురం :** జిల్లాలో సైబర్ క్రైం ఎక్కువవుతున్న దృష్ట్యా ప్రజలు అప్రమ త్తంగా ఉండాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆదివారం తనిఖీ చేశా రు. సైబర్ క్రైంను నిరోధించడానికి జిల్లా స్థాయిలో ఒక ప్రత్యేకమైన వ్యవస్థ ఏర్పాటు చేశామని, వారిపై నిఘా కూడా పెడుతున్నామని తెలిపారు. అలాగే బెట్టింగ్ రాయళ్లపై కూడా నిఘా పెట్టామని, బెట్టింగ్ నిర్వాహ కులపై పీడీ యాక్టు నమోదు చేస్తామని హెచ్చరించా రు. ఈ సమావేశంలో బొబ్బిలి టౌన్ సీఐ కింతలి నా రాయణరావు, బొబ్బిలి రూరల్ సీఐ ఎస్.శ్రీనివాస్, ఎస్ ఐ జ్ఞానప్రసాద్ పాల్గొన్నారు.

**దత్తిరాజేరు :** మండలంలోని స్టేషన్ బూర్జవలస పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదివారం తని ఖీ చేశారు. ఈసందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలు, రికార్డులను పరిశీలించారు. ఫిర్యాదు దారులతో మర్యా దపూర్వకంగా నడుచుకోవాలన్నారు. సీఐ వెంకటర మణ, ఏఎస్ఐ రమణ పాల్గొన్నారు.

# సామాన్యుడి కోసం ఆలోచించిన మహనీయుడు అంబేద్కర్

## ఆంధ్ర విశ్వవిద్యాలయంలో జయంతి వేడుకలు



**విశాఖపట్నం, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్) :** సామాన్య ప్రజల అభ్యున్నతి కోసం నిరంతరం పరితపించిన గొప్ప దార్శనికుడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అని అస్సాంలోని బీరంగన సతీ సాధని రాజ్యిక్ విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ ఆచార్య జి.సింగయ్య కొనియాడారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం (ఏయూ) డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చైర్ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ కళాశాలలోని గౌతమ బుద్ధ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన అంబేద్కర్ జయంతి వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆచార్య సింగయ్య మాట్లాడుతూ ... అంబేద్కర్ కేవలం ఒక వర్గానికి చెందిన వ్యక్తి కాదని, దేశాన్ని ప్రేమించిన గొప్ప దేశభక్తుడని పేర్కొన్నారు. నేటి యువత ప్రపంచంలో తాము ఎవరికీ తక్కువ కాదనే ఆత్మవిశ్వాసంతో ఎదగాలని పిలుపు నిచ్చారు. ఏయూ అంబేద్కర్ చైర్ గ్రామీణ ప్రజలకు చేరువయ్యేలా చేస్తున్న పనులను ఆయన అభినందించారు. మరో అతిథి, ఆచార్య నాగార్జున వర్సిటీ మాజీ వీసీ ఆచార్య వి.బాలమోహన్ దాస్ మాట్లాడుతూ.... " ప్రతి వ్యక్తిలోనూ ఒక అంబేద్కర్ ఉంటారు " అని అభివర్ణించారు. సమాజ శ్రేయస్సు కోసం యువత బాధ్యతగా పని చేయాలని, గాంధీ సెంటర్, అంబేద్కర్ అధ్యయన కేంద్రాలు సమన్వయంతో పని చేయాలని ఆకాంక్షించారు. దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం మాజీ వీసీ ఆచార్య వై.సత్యనారాయణ 'అంబేద్కర్ దార్శనికత--భారత రాజ్యాంగం' అనే అంశంపై ప్రసంగిస్తూ .... భారత రాజ్యాంగం ఎంతో దృఢమైనదని, దేశ అవసరాలకు అనుగుణంగా దీనిని అంబేద్కర్ రూపొందించారని తెలిపారు. ఆర్టికల్ 32ను రాజ్యాంగానికి ప్రధాన స్తంభంగా అభివర్ణించిన ఆయన, చట్టాలను గౌరవించే పౌరులుగా యువత తీర్చి దిద్దబడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ సంచాలకులు ఆచార్య టి.శోభశ్రీ, డాక్టర్ తెన్నేటి జయరాం, డీన్ ఆచార్య టి.వి.కృష్ణ, ఆచార్య రత్నం మరియు పెద్ద సంఖ్యలో పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నిబంధనలు పాటించండి, సురక్షితంగా ఇంటికి చేరుకోండి



**సిద్ద్‌పేట ఏప్రిల్ 13 నేటి మనదేశమ్ ప్రతినిధి :** రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా చేపట్టిన 'అరైవ్–అలైవ్' కార్యక్రమంలో భాగంగా సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్ పల్లి గ్రామంలో రోడ్డు భద్రతా గ్రామ సభ నిర్వహించారు. ట్రాఫిక్ ఎస్సై విజయభాస్కర్ మరియు ఎస్సై మల్లేశం ఆధ్వర్యంలో ఈ అవగాహన సదస్సు జరిగింది. గ్రామ అభివృద్ధిలో భాగంగా, గ్రామ సభ్యులతో కలిసి ప్రత్యేకంగా 'విలేజ్ రోడ్ సేఫ్టీ కమిటీని ఏర్పాటు చేశారు. వాహనదారులు, గ్రామ ప్రజలు ప్రతి ఒక్కరూ విధిగా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని, హెల్మెట్ ధరించడం మరియు అతివేగాన్ని నియంత్రించడం ద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చని ఎస్సై విజయభాస్కర్ సూచించారు. గ్రామ ప్రజలు, ప్రజా ప్రతినిధులు మరియు పంచాయతీ సిబ్బందితో కలిసి రోడ్డు భద్రత నియమాలను పాటిస్తామని ట్రాఫిక్ పోలీసులు ప్రతిజ్ఞ చేయించారు. గ్రామ ప్రజల విన్నపం మేరకు, రహదారి భద్రతలో భాగంగా గ్రామ సర్పంచ్ సహకారంతో రోడ్డుపై ఉన్న ప్రమాదకరమైన గుంతలను పూడ్చివేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎన్సాన్ పల్లి గ్రామ సర్పంచ్ నాగుల స్రవంతి ప్రశాంత్, ఉప సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి, పంచాయతీ సెక్రటరీ నరసింగరావు, ఆశా వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు, ట్రాఫిక్ సిబ్బంది మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి..

**- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**



**నిర్మల్, ఏప్రిల్ 13 ( నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని, ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే స్పందించాలని సూచించారు. మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను సమర్పించారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను వేగవంతం చేసి సమయానికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారులు ప్రభుత్వ వసతి గృహాలను నిరంతరం తనిఖీ చేయాలని తెలిపారు. అలాగే, ముఖ్యమంత్రి బాసర పర్యటనను విజయవంతంగా నిర్వహించినందుకు అధికారులను అభినందించారు. ఇంటర్మీడియట్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించినందుకు సంబంధిత అధికారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బాణాపురంలో రోడ్డు భద్రతపై అవగాహన:

# క్షేమంగా వెళ్లి లాభంగా రండి.



**మధిర ప్రతినిధి /ముదిగొండ, ఏప్రిల్ 13,నేటి మన దేశమ్.** ముదిగొండ మండలంలోని బాణాపురం గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రోడ్డు భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. "క్షేమంగా వెళ్లి.. లాభంగా రండి" అనే నినాదంతో ముదిగొండ పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం సాగింది. గ్రామంలోని ప్రజలకు రహదారి నియమాలపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముదిగొండ సహాయ ఉప నిరీక్షకుడు సాంబశివరావు, కానిస్టేబుల్ రాజు గ్రామస్తులతో మాట్లాడారు. వాహనాలు నడిపేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం వల్ల కలిగే ప్రయోజనాలను వారు వివరించారు. చిన్నపాటి నిర్లక్ష్యం వల్ల జరిగే ప్రమాదాలు కుటుంబాలను ఎలా రోడ్డున పడేస్తాయో తెలియజేస్తూ, ప్రతి ఒక్కరూ బాధ్యతగా వాహనాలు నడపాలని సూచించారు. అనంతరం రహదారి నిబంధనలు పాటిస్తామని గ్రామస్తులందరితో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సంధ్యా నాయక్, వార్డు సభ్యులతో పాటు మరికంటి శ్రీనివాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గుండాల వెంకటప్పయ్య, ఆత్మకూరి ఉపేందర్, వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాస్ మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు తీసుకుంటున్న ఇటువంటి చొరవను గ్రామస్తులు కొనియాడారు. ఈ అవగాహన సదస్సు ద్వారా తమలో బాధ్యత పెరిగిందని గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

# ప్రజావాణి అర్జీలు పెండింగ్ లో పెట్టవద్దు

**జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**



**రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్, 13: నేటి మన దేశ మ్ ప్రతినిధి**ప్రజావాణి అర్జీలు పెండింగ్ లో పెట్టవద్దని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం ప్రజావాణి నిర్వహించగా, జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజావాణికి మొత్తం 270 దరఖాస్తుల రాగా, వాటిని సంబంధిత శాఖల అధికారులకు అందజేసి.. వాటిని పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా ప్రణాళిక అధికారి, సీ,డీ,ఈ సెక్షన్, తహసీల్ ఆఫీస్ రుద్రంగి, తహసీల్ ఆఫీస్ సిరిసిల్ల, అటవీ శాఖ, జిల్లా ఎక్సైజ్ అధికారి, వేములవాడ శ్రీ రాజరాజేశ్వర ఆలయ ఈఓ, ఆర్ అండ్ బీ, జీజీహెచ్ సిరిసిల్ల, మున్సిపల్ కమిషనర్ వేములవాడ, జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి, జిల్లా పశు సంవర్ధక అధికారి, జిల్లా మైనింగ్ అధికారి, సబ్ రిజిస్ట్రార్ సిరిసిల్ల, డీపీఆర్ఓ, జిల్లా వ్యవసాయ అధికారి, సహకార అధికారికి ఒకటి చొప్పున, జిల్లా పౌర సరఫరాల అధికారి, నీటి పారుదల శాఖ, జిల్లా వైద్యాధికారి, తహసీల్ ఆఫీస్ చందుర్తి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కు 2 చొప్పున, జిల్లా విద్యాధికారి, తహసీల్ ఆఫీస్ వేములవాడ, బోయినపల్లికి 3 చొప్పున, ఉపాధి కల్పన అధికారి, తహసీల్ ఆఫీస్ గంభీరావుపేట, ఆర్డీఓ వేములవాడకు 4 చొప్పున, విద్యుత్ శాఖ, ఎస్పీ కార్యాలయం, తహసీల్ ఆఫీస్ ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్ కు 5 చొప్పున, జిల్లా సంక్షేమ అధికారి, తహసీల్ ఆఫీస్ వేములవాడ రూరల్, కోనరావుపేట, ఆర్డీఓ సిరిసిల్లకు 6 చొప్పున, తహసీల్ ఆఫీస్ తంగళ్ళపల్లి, ఇల్లంతకుంటకు -7 చొప్పున, మున్సిపల్ కమిషనర్ సిరిసిల్లకు 8, జిల్లా పంచాయతీ అధికారికి 13, గృహ నిర్మాణ శాఖకు 68, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారికి 73 వచ్చాయి. ప్రజావాణిలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఆర్డీఓలు వెంకటేశ్వర్లు, రాధాభాయి, హౌసింగ్ పీడీ వెంకట మాధవ రావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ముగిసిన పదవ తరగతి పరీక్షలు



**జగిత్యాల, ఏప్రిల్ 13(నేటి మన దేశమ్ ప్రతినిధి):**:పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రశాంతంగా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా విజయవంతంగా ముగియడం పట్ల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ మార్చి నెల 14వ తేదీన ప్రారంభమైన 10వ తరగతి పరీక్షలు జిల్లాలో సజావుగా కొనసాగి, విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలు రాశారని తెలిపారు. ఎండలను దృష్టిలో ఉంచుకుని ప్రతి పరీక్షా కేంద్రంలో అత్యవసర వైద్య సదుపాయాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని కాపాడేందుకు అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణలో ఉపాధ్యాయులు, శాఖాధి కారులు, సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్, పోలీస్ సిబ్బంది సమన్వయంతో పకడ్బందీగా విధులు నిర్వహించినందుకు అభినందించారు.

# ఎన్ఎఫ్బిఎస్ పథకానికి దరఖాస్తుల చేసుకోవాలి.కలెక్టర్ రాజర్షి షా



**అదిలాబాద్ ఏప్రిల్ 13 (నేటి మన దేశమ్ ప్రతినిధి.** జిల్లాలో జాతీయ కుటుంబ లాభ పథకం అమలును మరింత పటిష్టం చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజర్షి షా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నేషనల్ సోషల్ అసిస్టెన్స్ ప్రోగ్రామ్ (ఎన్ఎస్ఏపి) లో భాగంగా అమలవుతున్న ఈ పథకం ద్వారా, పేద కుటుంబానికి చెందిన కుటుంబ యజమాని సహజంగా లేదా ఇతర కారణాల వల్ల మరణించినట్లయితే, ఆ కుటుంబానికి రూ. 20,000 ఆర్థిక సహాయం అందించబడుతుంది అని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు తమ సమీపంలోని మీ-సేవ కేంద్రాల ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ పథకం అమలులో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో దరఖాస్తులను మండల పరిషత్ అభివృద్ధి అధికారి, పట్టణ ప్రాంతాల్లో దరఖాస్తులను మున్సిపల్ కమిషనర్ పర్యవేక్షిస్తారని తెలిపారు. ఇప్పటికే అర్హులైన పలువురికి నిధుల మంజూరు ప్రక్రియ కొనసాగుతోందని కలెక్టర్ తెలిపారు. కాబట్టి జిల్లాలోని అర్హులైన లబ్ధిదారులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

# రోడ్డు భద్రతపై అవగాహన కోసం ఆర్టీసీ "అరైవ్ అ లైవ్" ర్యాలీ




**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా (నేటి మనదేశమ్ ప్రతినిధి)** ఏప్రిల్ 13భద్రాచలంప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈరోజు ఆర్టీసీ భద్రాచలం డిపో ఆధ్వర్యంలో "అరైవ్ అ లైవ్" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం రోడ్డు ప్రమాదాలను నివారించడంపై ప్రజల్లో అవగాహన కల్పించడం. ఈ సందర్భంగా మద్యం మత్తులో వాహనాలు నడపకూడదని, అతివేగం ప్రమాదకరమని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని నినాదాలు చేశారు. భద్రాచలం డిపోకు చెందిన ఆర్టీసీ ఉద్యోగులు బస్టాండ్ నుండి అంబేద్కర్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం డిపో మేనేజర్ జంగయ్య, పట్టణ సీఐ నాగరాజు, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ తిరుపతి, మెకానికల్ ఇంజనీర్ శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్ రాజు తదితరులు పాల్గొన్నారు. డిపో ఉద్యోగులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ, ప్రతి వాహనదారు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ జాగ్రత్తగా డ్రైవింగ్ చేస్తే ప్రమాదాలను పూర్తిగా నివారించవచ్చని తెలిపారు. మద్యం మత్తులో లేదా సెల్‌ఫోన్ ఉపయోగిస్తూ డ్రైవింగ్ చేయడం ప్రమాదాలకు దారి తీస్తుందని తెలియజేశారు .

# అనుపురంలో రోడ్డు భద్రతకు బలమైన బాట

**- 'ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక'లో భాగంగా కమిటీ ఏర్పాటు**



**వేములవాడ, ఏప్రిల్ 13: నేటి మన దేశమ్ ప్రతినిధి** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా అనుపురం గ్రామంలో సోమవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో రోడ్డు భద్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తూ అధికారులు కీలక చర్యలు చేపట్టారు. గ్రామంలో ట్రాఫిక్ నిబంధనల అమలును పర్యవేక్షించేందుకు 'రోడ్డు భద్రతా కమిటీ'ని అధికారుల సమక్షంలో ఏర్పాటు చేశారు. ఈ కమిటీ గ్రామంలో రహదారి భద్రతా చర్యలను క్రమబద్ధంగా అమలు చేయనుంది. టౌన్ ఇన్‌స్పెక్టర్, ట్రాఫిక్ ఆర్ఐ, ట్రాఫిక్ ఎస్ఐ రాజు గ్రామస్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఇటీవల చోటుచేసుకున్న ప్రమాదాలను ఉదాహరణగా తీసుకుని హెల్మెట్ వినియోగం, అతివేగం నియంత్రణ, ట్రాఫిక్ నియమాల పాటింపు వంటి అంశాలపై ప్రజలను చైతన్య పరిచారు. అంతేకాకుండా, ప్రమాదరహిత గ్రామం కోసం కృషి చేస్తామని గ్రామస్థులందరితో కలిసి అధికారులు భద్రతా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

**మోటారు వెహికల్ ఇన్ స్పెక్టర్ జిలాని**





**కోదాడ ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్):** రహదారి నిబంధనలు పాటించడం ద్వారానే విలువైన ప్రాణాలను కాపాడుకోగలమని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ షేక్ జిలానీ అన్నారు. సోమవారం కోదాడలోని పెరికా హాస్టల్‌లో 'ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక'లో భాగంగా 'అరైవ్ అలైవ్' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్ వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదం జరిగిన మొదటి గంట 'గోల్డెన్ అవర్'లో బాధితులకు సాయం చేయాలని కోరారు. సాయం చేసే వారికి ప్రభుత్వం 'రాహ్‌వీర్' పథకం కింద నగదు పురస్కారం అందిస్తుందని తెలిపారు. ఏప్రిల్ 18 వరకు సాగే ఈ అవగాహన వారోత్సవాల్లో వాహనదారులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం లారీ అసోసియేషన్ అధ్యక్షుడు స్థానిక కౌన్సిలర్ తూనం కృష్ణ మాట్లాడుతూ డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని, అధిక వేగం ప్రమాదాలకు ప్రధాన కారణమని పేర్కొన్నారు. రోడ్డు భద్రతపై ప్రతి డ్రైవర్ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఈ సందర్భంగా రహదారి భద్రతా ప్రతి ఒక్కరి బాధ్యత అంటూ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ అంజిరెడ్డి, కరెంటు ఏఈ నరసింహా నాయక్, నాయకుల రహీం, జనార్ధన్, చంద్రశేఖర్ రెడ్డి, సైదులు, వెంకటయ్య, సత్యనారాయణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు..

# డీజీపీని కలిసిన ఎమ్మెల్యే పాయల్ శంకర్



**ఆదిలాబాద్ ఏప్రిల్ 13 (నేటి మన దేశమ్ ప్రతినిధి.** తెలంగాణ రాష్ట్ర డీజీపీ ఆదిలాబాద్ పర్యటనకు వచ్చిన సందర్భంగా ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా డీజీపీకి పుష్పగుచ్ఛం అందజేసి సాదరంగా అభినందనలు తెలిపారు. ఈ సమావేశంలో ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ కూడా పాల్గొనగా జిల్లా శాంతి భద్రతల పరిస్థితులు, ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించే అంశాలపై చర్చించారు. జిల్లా అభివృద్ధి, ప్రజల భద్రత కోసం పోలీస్ శాఖ తీసుకుంటున్న చర్యలను ఎమ్మెల్యే అభినందించారు. ప్రజల భద్రతకు పోలీసులు మరింత సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

# రోడ్డు భద్రతపై గ్రామస్థాయిలో విస్తృత అవగాహన

- ప్రమాదాల నివారణే ప్రధాన లక్ష్యం.- జిల్లా కలెక్టర్ అంకిత్.



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 13, (నేటి మనదేశమ్)**,ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ లో భాగంగా నిర్వహిస్తున్న రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా జిల్లా వ్యాప్తంగా రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ఈ కార్యక్రమాలలో భాగంగా సోమవారం చుంచుపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మార్చి 6 నుండి ప్రారంభమైన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో ప్రతి వారం వివిధ అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు, హెల్త్ క్యాంపులు నిర్వహించడంతో పాటు డీ-అడిక్షన్ మరియు కౌన్సిలింగ్ సేవలను కూడా అందుబాటు లోకి తీసుకువచ్చామని చెప్పారు.జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామపంచాయతీలలో గ్రామ సభలు నిర్వహిస్తూ ప్రజలను ప్రత్యక్షంగా భాగస్వాములుగా చేసుకుంటూ అవగాహన కల్పిస్తున్నామని అన్నారు . రోడ్డు ప్రమాదాల వల్ల ప్రతి రోజు అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తూ, రోడ్డు ప్రమాదాలు రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరిలో బాధ్యతాయుతమైన ప్రవర్తన అవసరమని అన్నారు . ఈ గ్రామసభల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చి ప్రమాదాలను తగ్గించడం ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.ప్రమాదాలకు కారణమయ్యే బ్లాక్ స్పాట్లను గుర్తించడం, రహదారుల వెంట ఉన్న పిచ్చి మొక్కలను తొలగించడం, ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవడం వంటి చర్యలు చేపడుతున్నామని చెప్పారు. అలాగే ప్రమాదాల సమయంలో అంబులెన్స్ సేవలు సమయానికి అందుబాటులో ఉన్నాయా, సమీప ఆసుపత్రులకు కనెక్టివిటీ ఎలా ఉందనే అంశాలను కూడా ఈ గ్రామసభల ద్వారా సమీక్షిస్తున్నామని వివరించారు.పాఠశాల విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించడం ద్వారా వారు తమ తల్లిదండ్రులకు హెల్మెట్, సీట్ బెల్ట్ ప్రాముఖ్యతను తెలియజేసేలా చేయాలని సూచించారు. ఇది ఏ ఒక్క శాఖకు సంబంధించిన విషయం కాదని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసినప్పుడే ప్రమాద రహిత జిల్లాను సాధించగలమని అన్నారు.కొన్ని జిల్లాలో అమలు చేస్తున్న "నో హెల్మెట్ -- నో ఎంట్రీ" వంటి వినూత్న చర్యలు మంచి ఫలితాలు ఇస్తున్నాయని, అలాంటి ఆలోచనలను మన జిల్లాలో కూడా అనుసరించాలని సూచించారు. అతివేగం, డ్రంక్ అండ్ డ్రైవ్, హెల్మెట్ ధరించకపోవడం, సీట్ బెల్ట్ వినియోగం లేకపోవడం వంటి కారణాల వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని , వీటిపై విస్తృతంగా అవగాహన కల్పించి ప్రమాదాలను నివారించాలని పిలుపునిచ్చారు.అన్ని శాఖలు సమన్వయంతో ఈ రోడ్డు భద్రత వారోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం గ్రామస్థులతో కలిసి రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో చుంచుపల్లి సర్పంచ్ భూక్య శాంతి శ్రీ, తాసిల్దార్ నాగరాజు, పంచాయతీ ఈవో వెంకటేశ్వర్లు, రవాణా, పోలీస్ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన మైనార్టీ విద్యాలయం విద్యార్థులకు జిల్లా కలెక్టర్ అభినందన



**రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 13: నేటి మన దేశమ్ ప్రతినిధి** ఇంటర్మీడియట్ పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన జిల్లాలోని మైనారిటీ విద్యాలయాల విద్యార్థులను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సోమవారం అభినందించారు. ఇంటర్మీడియట్ మొదటి, రెండవ సంవత్సరం ఫలితాలు విడుదల కాగా, తంగళ్ళపల్లి, వేములవాడ లోని మైనార్టీ సంక్షేమ గురుకుల విద్యాలయాలకు చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి మార్కులు సాధించారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థులు జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ ను కలువగా, వారిని అభినందించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుంటూ తమ లక్ష్యాలను స్పష్టంగా నిర్ణయించుకుని, పట్టుదలతో కృషి చేస్తే విజయాన్ని సాధించడం సాధ్యమవుతుందని ఆమె సూచించారు. ద్వితీయ సంవత్సరం బీపీసీ విభాగంలో ఎం.నందిని 1000 మార్కులకు గాను 977 మార్కులు, సుబియ తబస్సుం 969 మార్కులు సాధించారు. ఎంపీసీ విభాగంలో బుష్ర కౌసర్ 1000 మార్కులకు గాను 985 మార్కులు కే.నమిత 979 మార్కులు సాధించి తమ ప్రతిభ చూపారు. అలాగే ప్రథమ సంవత్సరం ఎంఎల్ టీ విభాగంలో 500 మార్కులకు గాను సీహెచ్.మనోజ్, కే.నిరంజన్ 488 మార్కులు సాధించి జిల్లాస్థాయిలో మొదటి ర్యాంకును సాధించారు. బి.సుకుమార్ 481 మార్కులు సాధించారు. ఎల్ ఎం అండ్ డీటీ విభాగంలో 500 మార్కులకు గాను ఎస్ ప్రణయ్ 491 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకును సాధించారు ఇ.రాహుల్ 490 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో రెండవ ర్యాంకును సాధించారు. డీ రామ్ చరణ్ 488 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో మూడవ ర్యాంకును సాధించారు అలాగే ద్వితియ సంవత్సరం ఎం ఎల్ టీ విభాగంలో 1000 మార్కులకు యు.హేమంత్ గాను 982 మార్కులు, ఎండీ శాదుల్ 973 మార్కులు ఎల్ మునీందర్ 967 మార్కులు సాధించారు. ఎల్ ఎం అండ్ డీటీ విభాగంలో 1000 మార్కులకు గాను ఎస్.కే ఆదిల్ 977 మార్కులు, జే అభిషేక్ 959 మార్కులు, పీ రాజు 924 మార్కులు సాధించి ప్రతిభ చూపారు.కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారిని ఎం.ఎ.భారతి, పాఠశాల ప్రిన్సిపాల్ ఉరుస ఫాతిమా, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి అర్జీలకు తక్షణ పరిష్కారం



**మేడ్చల్ మల్కాజిగిరి, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్):** ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులు జాప్యం లేకుండా పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుండి మొత్తం 181 దరఖాస్తులను జెడ్పీ సీఈవో కాంతమ్మతో కలిసి అదనపు కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలు పరిష్కారమవుతాయన్న నమ్మకంతో వ్యయప్రయాసలకోర్చి కార్యాలయాలకు వస్తారని, ఆ నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అందిన అర్జీల పరిశీలనలో ఎలాంటి ఆలస్యం జరగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని, తిరస్కరించే దరఖాస్తుల విషయంలో కారణాలను స్పష్టంగా అర్జీదారులకు తెలియజేయాలని సూచించారు. అలాగే స్వీకరించిన అర్జీలపై తీసుకున్న చర్యలను వెంట వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఒక్క కెమెరా...100 మంది పోలీసులతో సమానం!

-490 సీసీటీవీ కెమెరాల ప్రారంభించిన డీజీపీ శివధర్ రెడ్డి...



**ఆదిలాబాద్ ఏప్రిల్ 13 (నేటి మన దేశమ్ ప్రతినిధి.** జిల్లా వ్యాప్తంగా నేరాలు జరగకుండా జరిగిన నేరాలు ఛేదించడానికి పూర్తిగా నిఘా నేత్రంలో రావడానికి దాదాపు పట్టణంలో నూతనంగా,అదనంగా 207 సిసిటీవీ కెమెరాలు,జిల్లా వ్యాప్తంగా ఉన్న మండలాలలో, గ్రామాలలో నూతనంగా 283 సీసీటీవీ కెమెరాలను ఈరోజు రాష్ట్ర డిజిపి బి.శివధర్ రెడ్డి స్థానిక పట్టణంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ నందు ప్రారంభించడం జరిగింది.ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 700 సిసి టీవీ కెమెరాలతో పర్యవేక్షణ కొనసాగుతుంది.నేరాల నియంత్రణలో సీసీటీవీ కెమెరాల పాత్ర కీలకంగా ఉంటూ,ఒక కెమెరా 100 మంది పోలీసు సిబ్బందితో సమానంగా వ్యవహరిస్తుందని తెలిపారు.ప్రజలు,వ్యాపార సంస్థలు,తమ గ్రామాలలో పట్టణాలలో వీధులలో స్వచ్ఛందంగా ప్రతి ఒక్కరూ సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకునే విధంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.నేరస్తులు సీసీటీవీ కెమెరాలు ఉన్న ప్రదేశాలలో నేరాలను చేయడానికి భయపడతారని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్,అదనపు ఎస్పీ బి.సురేందర్ రావు,పరిపాలన అదనపు ఎస్పి పి మౌనిక,శిక్షణ ఐపిఎస్ రాహుల్ కాంత్,డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, పట్టణ సీఐలు,ఎస్సైలు,రిజర్వు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వడదెబ్బపై అప్రమత్తంగా ఉండండి ముదిగొండ వైద్యాధికారి నాగేంద్రప్రసాద్ సూచన.



**మధిర ప్రతినిధి /ముదిగొండ, ఏప్రిల్ 13,నేటి మన దేశమ్.** ప్రస్తుతం వేసవి కాలం కావడంతో ఎండల తీవ్రత రోజురోజుకూ పెరిగిపోతోంది. ఈ నేపథ్యంలో ప్రజలు వడదెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ముదిగొండ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు నాగేంద్రప్రసాద్ ఒక ప్రకటనలో కోరారు. ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండటం ఎంతో అవసరమని ఆయన స్పష్టం చేశారు.ముఖ్యంగా మధ్యాహ్నం వేళల్లో ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుందని, కాబట్టి ఆ సమయంలో ప్రజలు బయటకు రాకుండా ఉండటమే మంచిదని ఆయన సూచించారు.అత్యవసర పనులు ఉంటే ఉదయం పూట లేదా సాయంత్రం వేళల్లోనే పూర్తి చేసుకోవాలని తెలిపారు. వడదెబ్బ ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున వృద్ధులు, గర్భిణీలు, చిన్నపిల్లలు అసలు ఎండలోకి రాకూడదని ఆయన ప్రత్యేకంగా హెచ్చరించారు.శరీరంలో నీటి శాతం తగ్గకుండా చూసుకోవాలని, ఇందుకోసం రోజుకు సరిపడా తాగునీరు తీసుకోవడంతో పాటు మజ్జిగ, కొబ్బరి నీళ్లు, తాజా పండ్ల రసాలు వంటి ద్రవ పదార్థాలను ఎక్కువగా సేవించాలని వైద్యులు సూచించారు. అయితే ఆరోగ్యానికి హాని కలిగించే మత్తు పదార్థాలకు, శీతల పానీయాలకు ప్రజలు దూరంగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఒకవేళ ఎవరికైనా విపరీతమైన నీరసం, తలతిరగడం వంటి వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయకుండా వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించి వైద్య సహాయం పొందాలని డాక్టర్ నాగేంద్రప్రసాద్ ప్రజలకు సూచించారు. పైన పేర్కొన్న జాగ్రత్తలు పాటించడం ద్వారా వేసవి తాపం నుండి మనల్ని మనం కాపాడుకోవచ్చని ఆయన వివరించారు.

## పది సంవత్సరాలు దోచుకొన్నారు కానీ పేదల కు ఇల్లు కట్టివ్వ లేక పోయిన బీఆర్ఎస్ ప్రభుత్వం

సిద్దిపేట కాంగ్రెస్ ఇంచార్జి పూజల హరికృష్ణ



**సిద్ధ్‌పేట ఏప్రిల్ 13 నేటి మనదేశమ్ ప్రతినిధి :** సిద్దిపేట రూరల్ మండలం తొర్నాల గ్రామంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని లక్ష్యంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇల్లు పథకం కింద మంజూరైన లబ్ధిదారులు కొర్తివాడ లక్ష్మి శ్రీకాంత్ నూతన గృహాన్ని సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పూజల హరికృష్ణ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ --- పేద ప్రజలకు ఇల్లు అనేది కేవలం నివాసం మాత్రమే కాదు, వారి ఆత్మగౌరవానికి ప్రతీక అని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి అర్హ కుటుంబానికి గృహ కలను సాకారం చేస్తూ సామాన్య ప్రజల జీవితాల్లో వెలుగు నింపుతోందని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీష్ రావు పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు.పది సంవత్సరాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం పేదల ఇళ్ల సమస్యను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని మండిపడ్డారు. సిద్దిపేట నియోజకవర్గంలో వేలాది మంది పేదలు ఇళ్ల కోసం ఎదురుచూసినా హరీష్ రావు ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయలేదని విమర్శించారు."పది సంవత్సరాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం పేదల సమస్యలను పట్టించుకోలేదు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి నిర్మాణాలు పూర్తి చేస్తోందని మాటలు చెప్పడం బీఆర్ఎస్ పని... పనులు చేసి చూపించడం కాంగ్రెస్ పని" అని ఘాటుగా విమర్శించారు.మొదటి విడతలో 80 శాతం ఇందిరమ్మ ఇళ్లు పూర్తయ్యాయని, రెండో విడత త్వరలో ప్రారంభం కానుందని తెలిపారు. మొదటి విడత బిల్లులు ఇప్పటికే లబ్ధిదారులందరికీ జమ అయ్యాయని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలను మోసం చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షాన నిలబడిందని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గుర్రం అంజిరెడ్డి, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహిపాల్ రెడ్డి, రిక్కల మహేందర్ రెడ్డి, నరహరి, కొడారి మల్లారెడ్డి, ఎర్ర మహేందర్, ఎర్రబోలు రాజిరెడ్డి, అరవింద్, రాకేష్ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# రోడ్డు గుంతలు పూడ్చిన విప్ ఆది శ్రీనివాస్

- అరైవ్ అలైవ్"తో భద్రతపై అవగాహన



**వేములవాడ, ఏప్రిల్ 13: నేటి మన దేశమ్ ప్రతినిధి** కొనరావుపేట మండలం నిజామాబాద్ గ్రామంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా "అరైవ్ అలైవ్" రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ గరిమ ఆగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గీతే పాల్గొన్నారు.ఈ సందర్భంగా రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేయించిన అనంతరం, రోడ్డుపై ఉన్న గుంతలను స్వయంగా పూడ్చి ప్రత్యేకంగా ఆకర్షించారు.

**హెల్మెట్, సీట్‌బెల్ట్ తప్పనిసరి** ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారులో ప్రయాణించే వారు సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. వాహనం నడిపేటప్పుడు కుటుంబ సభ్యులను గుర్తు పెట్టుకుని జాగ్రత్తగా ఉండాలని అన్నారు.అభివృద్ధి-సంక్షేమం కలిసే సాగుతున్నాయిరాష్ట్రంలో పేదల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, అభివృద్ధి--సంక్షేమం రెండూ సమాంతరంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా హామీల అమలులో వెనుకడుగు లేదన్నారు.

**ప్రజల్లో చైతన్యం లక్ష్యం** 99 రోజుల ప్రణాళికలో భాగంగా అన్ని శాఖలు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాయని తెలిపారు. "అరైవ్ అలైవ్" కార్యక్రమంతో రోడ్డు భద్రతపై ప్రజల్లో చైతన్యం పెంచుతున్నామని అన్నారు.

**వ్యసనాలకు దూరంగా ఉండాలి** యువత చెడు వ్యసనాలకు బానిస కాకూడదని, రాష్ట్రాన్ని గంజాయి రహితంగా మార్చే దిశగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. జిల్లాలో డీ-అడిక్షన్ కేంద్రం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

**ఇందిరమ్మ ఇళ్లలో జిల్లా ముందంజ** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో జిల్లా రాష్ట్రంలో ముందంజలో ఉందని తెలిపారు. ఒక్కో ఇల్లు నిర్మాణానికి రూ.5 లక్షలు అందిస్తున్నామని, రేషన్ కార్డు కుటుంబాలకు రూ.5 లక్షల బీమా కల్పిస్తున్నామని వివరించారు.కార్యక్రమంలో స్థానిక అధికారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇంటర్ ఫలితాల్లో టీజీఎంఆర్ఎస్ మైనార్టీ విద్యార్థుల ప్రతిభ



**రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 13: నేటి మన దేశమ్ ప్రతినిధి** తంగళ్ళపల్లి మండలంలోని టీజీఎంఆర్ఎస్ మైనార్టీ పాఠశాల విద్యార్థులు ఇంటర్మీడియట్ ఫలితాల్లో విశేష ప్రతిభ కనబరిచారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థులు కార్పొరేట్ కళాశాలలకు ఏమాత్రం తీసిపోకుండా అత్యుత్తమ ఫలితాలు సాధించడం గమనార్హం.ప్రథమ సంవత్సరం ఎంపీసీ విభాగంలో బి.శిరీష 470లో 439 మార్కులు సాధించగా, బైపీసీలో బి.సాక్షి 440లో 429 మార్కులతో టాప్‌గా నిలిచారు. ద్వితీయ సంవత్సరం బైపీసి ఎం నందిని 1000లో 977 మార్కులు, ఎంపీసీలో బుష్ర కౌసర్ 1000లో 985 మార్కులు సాధించి ప్రతిభ చాటారు.విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం, తల్లిదండ్రుల సహకారంతో ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని ప్రిన్సిపాల్ ఉరుస ఫాతిమా తెలిపారు. భవిష్యత్తులో మరింత ఉన్నత లక్ష్యాలను సాధించాలని విద్యార్థులకు సూచించారు.

## వైభవంగా బాసరలో మాసోత్సవం...



**మల్కాజిగిరి, (నిజామాబాద్ జిల్లా బాసర )ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్):** శ్రీ వాగ్దేవి సంస్కృత భారతి ఆధ్వర్యంలో బాసర క్షేత్రంలోని శ్రీ జ్ఞాన సరస్వతి దేవాలయం సమీపంలో ఉన్న శివయోగి నిర్మల అంబయ్య సిద్ధాంతి సిద్ధాశ్రమంలో మాసోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. కోటి పార్థివలింగ స్తూప సహిత ద్వాదశ జ్యోతిర్లింగ మందిరంలో నిర్వహించిన ఈ వేడుకలు భక్తులను ఆకట్టుకున్నాయి.వేదికపై దీపారాధనతో కార్యక్రమాలు ప్రారంభమై కలశస్థాపన, పుణ్యాహవచనం, లక్ష్మీ గణపతి పూజలు నిర్వహించారు. అనంతరం వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక అర్చనలు నిర్వహించగా, కోటి పార్థివలింగాలతో కూడిన ద్వాదశ జ్యోతిర్లింగాలకు మహారుద్రాభిషేకం, కుంకుమార్చన నిర్వహించారు. గణపతి, నవగ్రహ, రుద్ర, సరస్వతి హోమాలు, భూదాన సంకల్ప పూజలు నిర్వహించి అన్నదానం ఏర్పాటు చేశారు.సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా హైదరాబాద్ నేరేడ్మెట్ కాకతీయ నగర్‌లోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో 26 సంవత్సరాల పాటు ప్రధాన అర్చకుడిగా సేవలందించిన బ్రహ్మశ్రీ మాడుగుల బాలకృష్ణ శర్మ సేవలను వక్తలు ప్రశంసించారు. దేవాలయ అభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడుతూ, నిగర్వి, సంస్కృతాభిమాని అని అభివర్ణించారు. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు శివశ్రీ నిర్మల అంబికానాథ శర్మ దంపతులు, బాలకృష్ణ శర్మ--పావని దంపతులకు బ్రాహ్మణ దంపతీ పూజ నిర్వహించి ఉత్తమ సామాజిక ధార్మిక పురస్కారంతో సత్కరించారు.నాట్య గురువుల శిష్యులు ప్రదర్శించిన నృత్యాలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భావ వ్యక్తీకరణతో కూడిన నృత్యాభినయాలు కళాభిమానులను అలరించాయి.ప్రతి నెల మూడవ ఆదివారం మాసోత్సవం సందర్భంగా ఇలాంటి ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నృత్య ప్రదర్శనలకు ఆసక్తి గల నాట్య గురువులు తమ శిష్యులతో పాల్గొనాలని, ఇందుకోసం ముందస్తుగా నమోదు చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో హైదరాబాద్ వైశ్య ప్రముఖులు, భక్తులు, శ్రీకృష్ణసేవా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by K.S. Rangasayi and published from # 5-5-426, M.J. Road, Hyderabad and Printed at SKYLINE PRESS, # D.No. 5-5-426, M.J. Road, Hyderabad - 500 001 . Ph: 24734846, 9701891645, E-mail: netimanadesam96@gmail.com